ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
ప్రకాశం
జిల్లా వార్తలు
బుధవారం 7, మే 2025



ఆటంకాలు

- క్రీడా'ప్రకాశం' కునికిపాట్లు.. వేధిస్తున్న నిధుల కొరత
- ఐదేళ్లు దాదాపు పోటీలన్నీ దాతల సహకారంతో నిర్వహణ
- అవీ అరకొరగానే!
- నేడు జాతీయ అథ్లెటిక్స్ దినోత్సవం

7



ప్రసన్న స్వరూపుడు.. మల్లవరం వేంకటేశ్వరుడు

- ప్రాచీన వైష్ణవ క్షేత్రంగా ప్రసిద్ధి
- ఎన్నెన్నో ప్రత్యేకతలు స్వామి సొంతం
- నేటి నుంచి బ్రహ్మోత్సవాలు.. 14న కల్యాణం

7



బ్రహ్మోత్సవాలకు సిద్ధమైన మద్దిపాడు మండలం మల్లవరంలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం (ఇన్‌సెట్‌లో) స్వామివారి మూల విరాట్

సమగ్ర విచారణ

సహకార బ్యాంకుపై సభాసంఘం

ఎట్టకేలకు అక్రమార్కులపై చర్యలకు అడుగు ముందుకు పడింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)లో చోటుచేసుకున్న అవినీతి, అక్రమాలపై శాసనసభా సంఘం విచారణ చేపట్టనుంది. అందుకు సంబంధించి మాజీ మంత్రి, ప్రస్తుత అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ నేతృత్వంలో శాసనసభ కమిటీని అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు నియమించారు. రాష్ట్రంలోని అన్ని డీసీసీబీలపైనా ఈ కమిటీ విచారణ చేయనుంది. పీడీసీసీబీలో భారీగా అవినీతి, అక్రమాలు జరిగినట్లు మూడు నెలల క్రితమే కలెక్టర్ అన్సారియా నివేదికను ప్రభుత్వానికి పంపి ఉన్నారు.

కొణతాల నేతృత్వంలో అసెంబ్లీ కమిటీ ఏర్పాటు

- ఇప్పటికే భారీగా అక్రమాలు గుర్తింపు
- ప్రభుత్వానికి నివేదించిన కలెక్టర్
- గత వైసీపీ పాలనలో ఇష్టారాజ్యంగా సాగిన పీడీసీసీబీ కార్యకలాపాలు
- అవినీతిపరుల్లో ఆందోళన



ఒంగోలు, మే 6 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వంలో పీడీసీసీ బ్యాంకు పాలన ఇష్టారీతిన సాగింది. సహకార ఎన్నికలు నిర్వహించకుండానే పీఐసీ కమిటీలతో నాటి ప్రభుత్వం పెద్ద కథనే నడిపింది. దీంతో డీసీసీబీకి పాలకమండలిగా ప్రభుత్వం నియమించిన వారు, బ్యాంకు ఉద్యోగులు, వైసీపీ నేతలు కలిసిపోయి పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పలు ఆధారాలతో ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో విచారించి నివేదిక ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించింది. డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు నేతృత్వంలో త్రిసభ్య కమిటీని కలెక్టర్ నియమించారు. ఈ కమిటీ డీసీసీబీపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి అనేక అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నట్లు నిర్ధారించారు. తదనుగుణమైన నివేదికను

మిగతా 6వ పేజీలో

అవినీతిపై అసెంబ్లీలో చర్చ

పీడీసీసీబీలో నెలకొన్న పరిస్థితే రాష్ట్రంలోని పలు జిల్లాల్లోని డీసీసీబీలు, పీఏసీఎస్‌లు, చివరకు ఆప్కాబ్‌లోనూ ఉన్నట్లు మార్చి 20న అసెంబ్లీ సమావేశాల్లో పలువురు ఎమ్మెల్యేలు ప్రభుత్వం దృష్టికి తెచ్చారు. అందులో పీడీసీసీ బ్యాంకు అక్రమాలను పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర ప్రత్యేకంగా ప్రస్తావించారు. అన్ని బ్యాంకులపై సమగ్ర విచారణకు సభాసంఘం ఏర్పాటు చేయాలని వారంతా డిమాండ్ చేశారు. ఆ మరుసటి రోజున అందుకు సంబంధించి అసెంబ్లీలో తీర్మానం చేశారు. ఈనేపథ్యంలో సహకార బ్యాంకుల్లో అక్రమాలపై విచారణ కోసం సీనియర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ నేతృత్వంలో ఏడుగురు సభ్యులతో కమిటీని నియమిస్తూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు.



పెనుగాలులకు తర్లుపాడు మండలం ఓబాయపల్లెలో విరిగిపోయిన బొప్పాయి చెట్లు

పశ్చిమంలో గాలివాన

దెబ్బతిన్న బొప్పాయి, అరటి తోటలు

- పలుచోట్ల పిడుగులు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం

మార్కాపురం, మే 6 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ ప్రకాశంలో మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వాన కురిసింది. ఓవైపు ఈదురుగాలులు, మరోవైపు పిడుగులతో భీతావహ వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు ఎండ తీవ్రతకు ప్రజలు బెంబేలెత్తిపోయారు. సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో ప్రారంభమైన వర్షం రాత్రి 7.30 వరకూ కురిసింది. ముఖ్యంగా డివిజన్ పరిధిలోని పలు మండలాల్లో ఈదురుగాలుల ప్రభావానికి బొప్పాయి, అరటి తోటలు నేలకొరిగాయి. తర్లుపాడు మండలంలో బొప్పాయి చెట్లు విరిగిపోయాయి. కలుజువ్వలపాడు పంచాయతీలోని ఓబాయపల్లి, లక్ష్మక్కపల్లి, కొండారెడ్డిపల్లెలో ఎక్కువగా బొప్పాయి తోటలు దెబ్బతిన్నాయి. దీంతో రూ.2కోట్ల మేర నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కొన్నిచోట్ల పిడుగులు పడటంతో చెట్లు కాలిపోయాయి. మార్కాపురంతోపాటు తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి, ఎర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, పెద్దారవీడు, కంభం మండలాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరగడం, వైర్లు తెగడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల మండలాల్లో సాయంత్రం 4.30 గంటల నుంచి విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో ప్రజలు అల్లాడిపోయారు. మార్కాపురం పట్టణంలోని పలు శివారు కాలనీల్లో రోడ్లపై నీళ్లు పారాయి. మెయిన్‌బజార్‌లలో కూడా సైడు కాలువలు నిండి రహదారులపై మురుగు నీరు చేరింది



మార్కాపురం మండలం రాయవరం గ్రామంలో పిడుగు పడడంతో కాలిపోతున్న చింతచెట్టు



గాలులకు మార్కాపురంలోని జవహర్ నగర్‌లో వాలిపోయిన విద్యుత్ స్తంభం

పంచాయతీ ఆస్తుల పరిరక్షణ

- గ్రామాల్లోనే గుర్తించి అక్కడే సభ
- జిల్లా గెజిట్‌లో ప్రకటనకు చర్యలు
- ప్రభుత్వ ఆదేశాలతో కదిలిన అధికారులు

ఒంగోలు కలెక్టరేట్, మే 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీల ఆస్తుల పరిరక్షణకు ఆ శాఖ అధికారులు సిద్ధమయ్యారు. వాటిని గుర్తించి జిల్లాస్థాయిలో గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వాలని హైకోర్టు ఆదేశించడంతో తదనుగుణంగా పంచాయతీరాజ్‌శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించింది. జిల్లాలో 729 గ్రామ పంచాయతీలు ఉండగా వాటిలోని ఆస్తుల గుర్తింపును మూడు కేటగిరీలుగా విభజించారు. అందుకు సంబంధించి పంచాయతీ కార్యదర్శులకు దిశానిర్దేశం చేశారు. కేటగిరీ-ఏలో రోడ్లు, డ్రైన్లు, బందెల దొడ్లు, తదితర అంశాలు ఉన్నాయి. కేటగిరీ-బీ కింద పంచాయతీలకు దాతలు ఇచ్చిన ఆస్తులు, వాటి ప్రస్తుత పరిస్థితిని గుర్తించాలి. కేటగిరీ-సీలో వాటర్ ట్యాంకులు, ఊరచెరువులు, చెరువులు, మైనర్ ఇరిగేషన్, పోరంబోకు స్థలాలు, శ్మశాన స్థలాలను గుర్తించి నోటీసు బోర్డులు పెట్టాలి. తదనంతరం ఆయా స్థలాలపై పంచాయతీల్లో గ్రామ సభలు ఏర్పాటు చేయాలి. ఇంకా ఏమైనా ఆస్తులు ఉన్నాయా అన్నది చర్చించి అలాంటి కూడా కూడా పొందుపర్చి జిల్లా పంచాయతీ అధికారికి నివేదిక పంపాలి. వారు పరిశీలించి కలెక్టర్‌కు నివేదించాల్సి ఉంటుంది. తదనంతరం జిల్లా గెజిట్‌లో ప్రచురిస్తారు.





విద్యాశాఖమంత్రి లోకేష్ దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకుంటున్న పోలీసులు

ఏబీవీపీ నిరసనలో స్వల్ప ఉద్రిక్తత

విద్యాశాఖ మంత్రి దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకున్న పోలీసులు

ఒంగోలు కలెక్టరేట్, మే 6 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఒంగోలు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఒంగోలులో నిర్వహించిన నిరసన స్వల్ప ఉద్రిక్తతకు దారితీసింది. జీవో నంబర్ 77ను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక లాయర్‌పేటలోని ప్రకాశం పంతులు విగ్రహం వద్ద విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ఏబీవీపీ కార్యకర్తలు ప్రయత్నించారు. దీన్ని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో తోపులాట జరిగింది. ఈ సందర్భంగా ఏబీవీపీ నెల్లూరు విభాగ్ కన్వీనర్ రాజశేఖర్ మాట్లాడుతూ 77 జీవోను రద్దు చేయకుండానే ఈనెల 7న ఐసెట్ పరీక్షలు నిర్వహించడం తగదన్నారు. గత ఎన్నికలకు ముందు లోకేష్ ఇచ్చిన హామీ మేరకు ఆ ఉత్తర్వులను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ అంకిరెడ్డి పాల్గొన్నారు.



పెద్దపులి చంపిన గేదె కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీ అధికారులు, గ్రామస్థులు

గేదెను చంపిన పెద్దపులి

- ఆందోళనలో గొట్టిపడియ గ్రామస్థులు


7

స్వల్ప భూకంపం

- దర్శి, తాళ్లూరు, ముండ్లమూరు మండలాల్లో ప్రకంపనలు
- భయాందోళనకు గురైన ప్రజలు

దర్శి/తాళ్లూరు, మే 6 (ఆంధ్రజ్యోతి) : దర్శి ప్రాంతంలో మంగళవారం ఉదయం 9 నుంచి 10 గంటల మధ్యలో స్వల్పంగా భూమి కంపించింది. పట్టణంలోని పుచ్చలమిట్ట, పొదిలి రోడ్డు, తదితర ప్రాంతాల్లో సుమారు రెండు సెకన్లపాటు ప్రకంపనలు సంభవించాయి. ఆసమయంలో కొద్దిపాటి శబ్దం కూడా వచ్చింది. దీంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో దర్శి, తానంచింతల, చందలూరు, లంకోజనపల్లి తదితరప్రాంతాల్లోని కొండలను విచ్చలవిడిగా తవ్వారు. కొన్నిచోట్ల వంద అడుగుల లోతులో కుంటలను తీశారు. బొట్లపాలెంలో పశువుల మేత భూమిలో సుమారు వంద ఎకరాల్లో 50 అడుగుల లోతున మట్టి తవ్వారు. వందలాది ఎకరాల్లోని

మిగతా 6వ పేజీలో



కొత్త రేషన్ కార్డులు వస్తున్నాయ్..!

- నేటి నుంచి సచివాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ
- చేర్పులు, మార్పులకూ అవకాశం

6

ఒంగోలులో వస్త్రవ్యాపారి ఆత్మహత్య

వ్యాపారంలో నష్టాలే కారణం

7

12న డీఆర్సీ సమావేశం

కీలక అంశాలతో అజెండా

ఒంగోలు, మే 6 (ఆంధ్రజ్యోతి) : అత్యంత కీలకమైన జిల్లా సమీక్ష మండలి (డీఆర్సీ) సమావేశం ఈ నెల 12న జరగనుంది. ఆ రోజున ఉదయం 11 గంటలకు ప్రకాశం భవనంలోని పీజీఆర్ఎస్ హాలులో దీన్ని నిర్వహించనున్నారు. వాస్తవానికి గతనెల 23న డీఆర్సీ జరగాల్సి ఉంది. అయితే 22వతేదీ రాత్రి జిల్లాకు చెందిన టీడీపీ ముఖ్యనేత, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరి దారుణహత్యకు గురయ్యారు. ఆ మరుసటి రోజున అమ్మనబ్రోలులో ఆయన అంత్యక్రియలు జరగ్గా, నివాళులర్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వచ్చారు. దీంతో 23వతేదీ జరగాల్సిన డీఆర్సీ సమావేశాన్ని వాయిదా వేశారు. తాజాగా ఈనెల 12న నిర్వహించాలని ఇన్‌చార్జి మంత్రి నిర్ణయించారు. ఆ మేరకు అధికారులకు సమాచారం ఇచ్చారు. కీలక అంశాలపై సమావేశంలో చర్చించనున్నారు. ప్రధానంగా జిల్లాలో ప్రస్తుతం జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనుల పురోగతి, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వేసవిలో తాగునీటి సమస్య పరిష్కారం, విద్యుత్ రంగంలో పీఎం సూర్యఘర్ పథకం తీరు, రాష్ట్రప్రభుత్వం అత్యంత ప్రధాన్యతగా భావిస్తున్న ప్రజావినతుల పరిష్కారం తదితర అంశాలపై చర్చించేలా అజెండాను రూపొందిస్తున్నట్లు తెలిసింది.

మద్యం అక్రమంగా అమ్ముతున్న వ్యక్తి అరెస్టు


పట్టుబడిన మద్యం బాటిళ్ళతో ఎస్సై నరసింహారావు

కంభం, మే 6 (ఆంధ్రజ్యోతి) : మండలం జంగంగుంట్లలో ఓ వ్యక్తి మద్యంను అక్రమంగా విక్రయిస్తుండగా 18 క్వార్టర్ బాటిళ్లు, 4 బీర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నరసింహారావు తెలిపారు. అనుమతి లేకుండా అక్రమంగా మద్యం బాటిళ్లను విక్రయిస్తున్నట్లు తెలిస్తే తమకు సమాచారం అందించాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు.

సారా స్వాధీనం.. నిందితుల అరెస్టు


పెద్ద దోర్నాల, మే 6 (ఆంధ్రజ్యోతి) : ఎక్సైజ్ శాఖాధికారులు మంగళవారం విస్తృతదాడులు నిర్వహించారు. నవోదయం-2లో భాగంగా మార్కాపురం ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై వెంకటరెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని ఎగువచెర్లోపల్లి, నల్లగుంట్ల గ్రామాల్లో నిర్వహిస్తున్న దాడుల్లో 30 లీటర సారాను స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఎగువచెర్లోపల్లిలో దాసరి రామయ్య, నల్లగుంట్లలో మెగావత్ చందునాయక్‌ను అరెస్టు చేశారు.నాటుసారా తయారీకి బెల్లం విక్రయించిన వారినీ అరెస్టు చేయనున్నట్లు వెంకటరెడ్డి తెలిపారు.

ఊడిన టిప్పర్ టైర్లు.. తప్పిన ప్రమాదం

అద్దంకి, మే6(ఆంధ్రజ్యోతి): బెంగళూరు గ్రీన్ ఫీల్డ్ రోడ్డుకు గ్రావెల్ తరలించే టిప్పర్ వెనుక యాక్సిల్స్ ఊడి పోయి టైర్లు ఒకదాని పై మరొకటి ఎక్కాయి. స్థానికుల కథనం మేరకు అద్దంకి పట్టణంలోని కలవకూరు రోడ్డులో మంగళవారంరాత్రి ధర్మవరం వైపు నుండి వస్తున్న టిప్పర్ వెనుక యాక్సిల్స్ ఊడిపోయాయి. దీంతో టిప్పర్ వెనుక టైర్లు ఒకదానిపై మరొకటి చేరి రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయింది. అయితే ఆ సమయంలో రోడ్డు పై ఎలాంటి వాహనాలు రాక పోవటంతో ప్రమాదం తప్పిపోయింది.

నేటి నుంచి కొత్త రేషన్ కార్డులకు
దరఖాస్తుల స్వీకరణ!

- సచివాలయాల్లో దరఖాస్తులు స్వీకరణ
- చేర్పులు, మార్పుల కోసం అవకాశం



ఒంగోలు కలెక్టరేట్, మే 6 (ఆంధ్రజ్యోతి) : రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్న పేదలకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. గత ఏడాదిన్నర నుంచి కొత్త కార్డులతో పాటు ప్రస్తుతం ఉన్న కార్డుల్లో చేర్పులు, మార్పుల కోసం అవకాశం లేకపోవడంతో పేద ప్రజానీకం అనేక ఇబ్బందులు పడుతున్నారు. అయితే ప్రభుత్వం తాజాగా బుధవారం నుంచి సచివాలయాల్లో కొత్త కార్డుల కోసం సంబంధిత ధృవీకరణ పత్రాలతో దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వం తెలిపింది. ఇంకొక వైపు ప్రస్తుతం ఉన్న రేషన్ క కార్డుల్లో చేర్పులు, మార్పులతో పాటు నివాసం ఉండే అడ్రసులను కూడా మార్చుకోనేందుకు అవకాశం కల్పించింది. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆమేరకు ప్రకటన చేయడంతో ఇప్పటి వరకు కార్డుల కోసం ఎదురు చూస్తున్న ప్రజానీకం సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలతో పాటు ఆదాయ ధృవీకరణకు కూడా రేషన్ కార్డే ప్రమాణికం కావడంతో ఇప్పటి వరకు కార్డులు లేని పేదలు అనేక పథకాలను కూడా అందుకోలేకపోయారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బాధ్యతలు చేపట్టాక అర్హులైన పేదలందరికి సంక్షేమ పథకాలను అందిస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల కోసం ధరఖాస్తుల స్వీకరణను బుధవారం నుంచి ప్రారంభించనుండటంతో పేదల్లో సంతోషాన్ని వ్యక్తం చేశారు. కాగా జిల్లాలోఇప్పటికే 10వేల మందికి పైగా కొత్త రేషన్ కార్డుల కోసం ధరఖాస్తులు చేసుకున్నారు. ఇప్పుడు వారందరికి కొత్త రేషన్ కార్డులు జారీ చేసే అవకాశం ఉంది. కాగా ఇప్పటి వరకు రేషన్ కార్డులు ఉండగా వాటి స్థానంలో స్మార్ కార్డులు ఇస్తామని మంత్రి మనోహర్ ప్రకటించారు. ఈకేవైసీ కారణంగా స్మార్ట్ కార్డులు జారీ ఆలస్యమైందని వచ్చేనెలలో స్మార్ట్ కార్డులు ఇస్తామని మంత్రి ప్రకటించారు.

పిడుగుపాటు బాధిత కుటుంబాలకు పరిహారం

- కేవలం రెండురోజుల్లోనే ఒక్కోకుటుంబానికి రూ.4లక్షలు
- ఒంగోలు, ఈదుమూడిలో చెక్కులు అందజేసిన ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్


శిరీషా కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్


నాగమల్లేశ్వరరావు కుటుంబ సభ్యులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

ఒంగోలు కార్పొరేషన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు మండలం పెద్ద దేవరంపాడు గ్రామానికి చెందిన నూకసాని శిరీషా ఇటీవల పిడుగుపడి మరణించగా, వారి కుటుంబానికి ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ కూటమి ప్రభుత్వం తరుపున రూ.4లక్షల చెక్కును అందజేశారు. మంగళవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో మృతురాలి కుటుంబానికి ఎమ్మెల్యే దామచర్ల, ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ చేతుల మీదుగా చెక్కును అందించారు. కార్యక్రమంలో డీఆర్వో చినఓబులేసు, మేయర్ గంగాడ సుజాత పాల్గొన్నారు.

ఈదుమూడిలో..

నాగులుప్పలపాడు: ఈదుమూడి గ్రామానికి చెందిన దివ్యాంగుడు కొండేపి నాగమల్లేశ్వరరావు గొర్రెలు మేపుకొనేందుకు వెళ్లి ఈ నెల 4న పిడుగుపాటుగు గురైమృతి చెందాడు.ఈక్రమంలో ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.4లక్షల చెక్కును మంగళవారం ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ ఈదుమూడి వెళ్లి నాగమల్లేశ్వరరావు కుటుం బ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో లక్ష్మీప్రసన్న, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్ కుమార్, ప్రధా న కార్యదర్శి కాకర్ల లక్ష్మీ వరప్రసాద్, నాయకులు కుర్రా వీరాంజనేయులు, రంపతోటి అంకారావు, తెలగతోటి జాన్సన్, కొండ్రగుంట రంగారావు, ఆళ్ల ప్రేమ్‌చంద్ పాల్గొన్నారు.

పొగాకు రైతుల నిరసన


రోడ్డుపై పొగాకు బేళ్లను తగలబెడుతున్న రైతులు

నాగులుప్పలపాడు, మే 6 (ఆంధ్రజ్యోతి): నల్ల బర్లీ పొగాకుకు మద్దతు ధర అందించి ప్రభుత్వం కొనుగోలు చేయాలని కండ్లగుంట గ్రామానికి చెందిన రైతులు డిమాండ్ చేశారు. నాగులుప్పలపాడు సమీపంలోని ఇంకొల్లు జంక్షన్ వద్ద పొగాకు రైతులు బేళ్లను దహనం చేసి మంగళవారం తమ నిరసన వ్యక్తం చేశారు. దీంతో కొద్దిసేపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని నిరసన వ్యక్తం చేస్తున్న పాలపర్తి సతీష్, చెల్లి మోజేస్, నాగేశ్వరావు తదితరులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కార్యదర్శిపై వచ్చిన ఆరోపణలు అవాస్తవం

- డీఎల్‌పీవో పద్మావతి


రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో పద్మావతి

నాగులుప్పలపాడు, మే 6 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శి బెనహర్‌పై వచ్చిన ఆరోపణలు అవాస్తమని డీఎల్‌పీవో పద్మావతి తెలిపారు. నాగులుప్పలపాడు పంచాయతీ కార్యాలయంలో మంగళవారం డీఎల్‌పీవో పద్మావతి విచారణ చేపట్టారు. మట్టిగుంట గ్రామ కార్యదర్శి ఎం.బెనహర్ గతంలో ఒమ్మెవరం, ఈదుమూడి, ఉప్పుగుండూరు గ్రామాల్లో పనిచేసిన సమయంలో అవినీతికి పాల్పడినట్లు ఉప్పుగుండూరు పంచాయితీ 14వ వార్డు సభ్యుడు కనగాల శ్రీనివాసరావు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో గత శుక్రవారం డీఎల్‌పీవో పద్మావతి విచారణ చేపట్టారు. అప్పుడు ఫిర్యాదుదారుడు హాజరుకాక పోవడంతో వాయిదా వేయగా మంగళవారం మరోసారి విచారణ చేపట్టారు. డీఎల్‌పీవో ఎదుట హాజరైన ఫిర్యాదుదారుడు సంతకం చేసి వెళ్లారు. విచారణలో పంచాయతీ, ఇంటి పన్ను వసూలు రికార్డులు పరిశీలించిన డీఎల్‌పీవో అందుకు సంబంధించిన నగదును కార్యదర్శి బెనహర్ ట్రెజరీలో జమ చేసినట్లు గుర్తించారు. ఎలాంటి అవినీతి జరగలేదని ఆమె తేల్చారు. కార్యక్రమంలో ఉప్పుగుండూరు, ఈదుమూడి పంచాయతీ కార్యదర్శులు కిరణ్‌కుమార్, డీవీ.రంగారెడ్డి పాల్గొన్నారు.

బ్రహ్మంగారి మఠానికి ప్రత్యేక బస్సులు

గిద్దలూరు, మే 6 (ఆంధ్రజ్యోతి) : కడప జిల్లాలోని బ్రహ్మంగారిమఠంలో జరుగుతున్న ఆరాధన మహోత్సవానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం గిద్దలూరు డిపో ఆర్టీసీ అధికారులు 20 ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేశారు. మంగళవారం తెల్లవారుజాము నుంచే 20 బస్సులను బస్టాండ్, రైల్వేస్టేషన్ ప్రాంతాల నుంచి కడపకు నడిపారు. బుధవారం కూడా ప్రత్యేక సర్వీసులను నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

ఇతర జిల్లాల నుంచి రైళ్ల ద్వారా గిద్దలూరు వచ్చి ఇక్కడి నుంచి బ్రహ్మంగారి మఠంకు వెళ్లేందుకు వీలుగా ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం వివిధ సంఘాల ప్రతినిధులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు రైల్వేస్టేషన్ ఆవరణలో ప్రత్యేకంగా సామియానాలు ఏర్పాటు చేసి ఉచిత భోజన సౌకర్యం కల్పించారు.

సీసీ రోడ్ల నిర్మాణాలను పరిశీలించిన కేంద్ర బృందం


జమ్మనపల్లిలో సీసీ రోడ్లను పరిశీలిస్తున్న కేంద్ర బృంద సభ్యులు

మార్కాపురం రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొట్టాలపల్లి, జమ్మనపల్లి గ్రామాలలో ఎంపీ గ్రాంట్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను కేంద్ర బృందం సభ్యులు రాజు, విజయేందర్ మండల ఇంజనీరింగ్ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. 2022-2024 ఆర్థిక సంవత్సరంలో ఎంపీ మాగుంట గ్రాంట్ ద్వారా జమ్మనపల్లి గ్రా మంలో రూ.17.50లక్షలు, కొట్టాలపల్లి గ్రామంలో రూ.5లక్షలతో వేసిన సీసీ రోడ్లను వారు పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి రోడ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణాల నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేసినట్లు పంచాయతీ రాజ్ ఏఈ మోహన్‌రాజు తెలిపారు. ఈ తనిఖీలో వారి వెంట పీఆర్ డీఈ, ఏఈలు, సిబ్బంది ఉన్నారు.

సమగ్ర విచారణ

అవీఇవీ

(మొదటి పేజీ తరువాయి)

కలెక్టర్ అన్సారియా ప్రభుత్వానికి పంపించారు. దీనిపై సెక్షన్ 51 విచారణకు సర్కారు ఆదేశించింది. విచారణాధికారి నియామకం విషయంలో వివాదం నెలకొనడంతో 51 విచారణ ముందుకు సాగలేదు.

ఆరు మాసాలే గడువు

విచారణ కమిటీకి కొణతాల చైర్మన్‌గా వ్యవహరించనుండగా ఎమ్మెల్యేలు కూన రవికుమార్, ధూళిపాళ్ల నరేంద్ర, బొలిశెట్టి శ్రీనివాస్, యార్లగడ్డ వెంకట్రావు, బి.రామాంజనేయులు, ఎన్.అమర్‌నాథ రెడ్డిలు సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ తొలి సమావేశం జరిగిన రోజు నుంచి ఆరు మాసాలలో విచారణ పూర్తిచేసి నివేదించాలని స్పీకర్ అయన్నపాత్రుడు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈలోపు సభాసంఘం ఇక్కడి డీసీసీబీలో అక్రమాలపై విచారణ చేసే అవకాశం ఉంది. కాగా ప్రభుత్వ ఆదేశాలతో గతంలోనే కలెక్టర్ అన్సారియా నియమించిన త్రిసభ్య కమిటీ బ్యాంకులో చోటుచేసుకున్న అనేక అవినీతి, అక్రమాలను గుర్తించింది. ఏఏ అంశాలలో అవినీతి, అక్రమాలు ఎలా జరిగాయి, నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు ఎలా సాగించారన్నది అంశాల వారీగా గుర్తించారు. తదనుగుణమైన నివేదికను కలెక్టర్ అన్సారియా ప్రభుత్వానికి పంపారు. ఆ నివేదికను సభాసంఘం ప్రమాణికంగా తీసుకొని తమ విచారణను సమగ్రంగా కొనసాగించే అవకాశం ఉంది. దీంతో బ్యాంకులో అవినీతి, అక్రమాలలో భాగస్వామ్యులైన ఉద్యోగుల్లో ఆందోళన మొదలైంది.

స్వల్ప భూకంపం

(5వ పేజీ తరువాయి)

కొండలు, ప్రభుత్వ భూముల్లో మట్టి తోడేయడంతో సమతుల్యం దెబ్బతిని భూమి కంపించినట్లు పలువురు అభిప్రాయపడుతున్నారు. మండల కేంద్రమైన తాళ్లూరు, తూర్పుగంగవరం గ్రామాల్లో మంగళవారం ఉదయం సెకను పాటు భూమి కంపించింది. ముండ్లమూరు మండలంలోని పలు గ్రామాల్లో రెండు సెకన్లపాటు భూప్రకంపనలు సంభవించారు. దీంతో ఆయా గ్రామాల్లోని ప్రజలు భయాందోళనలతో ఇళ్ల నుంచి పరుగులు తీశారు. మండలంలోని శంకరాపురం, పోలవరం, వేంపాడు, తూర్పుకంభంపాడు, నూజెండ్లపల్లి, సుంకరవారిపాలెంతో పాటు పులిపాడు, కెల్లంపల్లి, బసవాపురం, శ్రీనివాస నగర్, ఉల్లగల్లులో భూమి కంపించింది. ఏడాది లోపే మండలంలో ఐదు సార్లు భూప్రకంపనలు చోటుచేసుకోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దొనకొండ మండలం యర్రబాలెం ఎస్సీ కాలనీలోనూ స్వల్పంగా భూమి కంపించింది.

జవాబుదారీతనంగా పనిచేయాలి

- మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి
- నియోజకవర్గంలోని ఆరు మండలాల అధికారులతో సమీక్ష


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి స్వామి

టంగుటూరు, మే 6 (ఆంధ్రజ్యోతి) : అధికారులు ప్రజలకు జవాబుదారీతనంగా పనిచేయాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సూచించారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల ఎంపీడీవోలు, ఈవోఆర్డీలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులతో తూర్పునాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, స్వచ్ఛాంధ్ర, పంచాయతీల్లో పారిశుధ్య కార్యక్రమాలపై సమీక్షించారు. గ్రామాల్లోని సైడు కాల్వల్లో మురుగు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దోమల నిర్మూలన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. గ్రామాల్లో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి రాత్రిళ్ల వీధిలైట్లు వెలిగేలా చూడాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. రక్షిత నీటి పథకాల పైపులైన్లకు, మోటార్లకు మరమ్మతులు చేసి తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఎంపీడీవోలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలకు సూచించారు. అధికారులు, కింది స్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యలను పరిష్కరించాలన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు అందాలి

- మెప్మా సిబ్బందికి ఎమ్మెల్యే నారాయణరెడ్డి సూచన


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

మార్కాపురం, మే 6 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందేలా మెప్మా సిబ్బంది పనిచేయాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సూచించారు. మున్సిపల్ సమావేశ మందిరంలో మంగళవారం మెప్మా సిబ్బందికి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ మెప్మా ఆర్పీలు, ఓటీలు పారదర్శకంగా పనిచేయాలన్నారు. మీరు సక్రమంగా పనిచేస్తేనే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని చెప్పారు. పనిలో అలసత్వం వహిస్తే సహించేది లేదన్నారు. త్వరలో ప్రభుత్వం గతంలో మాదిరి బీమా సౌకర్యం కూడా కల్పించనుందని తెలిపారు. చాలా మందికి ఇంకా పాత ప్రభుత్వ పోకడలు పోలేదన్నారు. అలాంటి వాళ్లు పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, ఏఎమ్‌సీ మాజీ చైర్మన్ గుంటక సుబ్బారెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ షెక్షావలి, టీడీపీ నాయకులు మాలపాటి వెంకటరెడ్డి, షేక్ మౌలాలి, కొప్పుల శ్రీనివాసులు, మయూరి ఖాశిం, సయ్యద్ గఫార్ పాల్గొన్నారు.

లీగ్ దశకు చేరిన నాలుగు జట్లు

- వీఎస్‌యూలో పోటాపోటీగా సాగిన సాఫ్ట్‌బాల్ మ్యాచ్‌లు
- లీగ్ దశకు చేరిన వీఎస్‌యూ జట్టు

వెంకటాచలం, మే 6 (ఆంధ్రజ్యోతి):మండలంలోని విక్రమ సింహపురి యూనివర్సిటీలో జరుగుతున్న జాతీయ అఖిల భారత అంతర యూనివర్సిటీల సాఫ్ట్‌బాల్ పురుషుల టోర్నమెంట్ మూడోరోజుకు చేరుకుంది. మంగళవారంతో నాకౌట్‌దశ పూర్తయింది. 97 పురుషుల జట్లు పాల్గొనగా మూడురోజుల పాటు 93మ్యాచ్‌లను నిర్వహించారు. ఈ మ్యాచ్‌ల్లో ఓటమి లేకుండా నెల్లూరు విక్రమ సింహపురి యూనివర్సిటీ, గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, మహారాష్ట్ర అమరావతి యూనివర్సిటీ, ఛత్రపతి శివాజీ మహరాజ్ యూనివర్సిటీ జట్లు లీగ్ దశకు చేరుకున్నాయి. బుధవారం లీగ్‌దశకు చేరిన నాలుగు జట్లు ఒక్కోజట్టు మిగిలిన మూడు జట్లతో హోరాహోరీగా తలపడనున్నాయి. వీటిలో ఎక్కువ మ్యాచ్‌లు గెలిచిన జట్టు విన్నర్‌గా, రన్నర్లుగా నిలవనున్నాయి. వీఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు అధ్యక్షతన జరుగుతున్న సాఫ్ట్‌బాల్ పురుషుల టోర్నమెంట్‌ను వర్సిటీ రిజిస్ట్రార్ సునీత, వర్సిటీ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, వివిధ యూనివర్సిటీల కోచ్‌లు, అంపైర్లు, రిఫరీలు పర్యవేక్షిస్తున్నారు.

● నేడు టోర్నీ ముగింపు వేడుక

సాఫ్ట్‌బాల్ పురుషుల టోర్నమెంట్ ముగింపు వేడుకలు బుధవారం సాయంత్రం జరగనున్నాయి. ఈ వేడుకలకు రాష్ట్ర యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డితో పాటు మరికొందరు ప్రముఖులు హాజరుకానున్నారు.

ప్రసన్న స్వరూపుడు

మల్లవరం వేంకటేశ్వరుడు

ప్రాచీన వైష్ణవ క్షేత్రంగా ప్రసిద్ధి

ఎన్నెన్నో ప్రత్యేకతలు వెంకన్న సొంతం

మద్దిపాడు, మే 6(ఆంధ్రజ్యోతి) : కలియుగ ప్రత్యక్ష దైవంగా భక్తుల సేవలను అందుకునే శ్రీ వేంకటేశ్వరుడు కొలువైన క్షేత్రం మల్లవరం. ఇక్కడి శ్రీ వేంకటేశ్వర స్వామి రూపం ఎంతో ప్రసన్నంగా దర్శనమిస్తున్నందున ఈయనను ప్రసన్న వేంకటేశ్వరునిగా భక్తులు భావిస్తారు. మల్లవరం శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం అతి ప్రాచీన వైష్ణవ క్షేత్రంగా పురాణాల ద్వారా తెలుస్తుంది.

స్థల పురాణం...

భూలోకంలో విహరిస్తున్న శ్రీనివాసుడు విశ్రాంతి తీసుకోవటానికి తమ్మవరం కొండవద్దకు వెళ్లడంతో స్వామీ నిన్ను భరించే శక్తి నాకు లేదు క్షమించాలంటూ శరణు వేడుకోగా ఆ సంభాషణ విన్న మల్లవరం గిరి తనపై సేదదీరాలని శ్రీనివాసులు ఆహ్వానించిందట. ఆ భక్తికి మెచ్చి శ్రీనివాసుడు వరం కోరుకొమ్మనగా నీ తేజం అంశం ఇక్కడే నెలకొల్పు తండ్రీ అని మల్లవరం గిరి వేడుకోగా స్వామి ప్రేమతో అనుగ్రహించాడని స్థల పురాణం ద్వారా తెలుస్తుంది.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమై 17వ తేదీతో ముగుస్తాయి. 14న స్వామి కల్యాణం చేస్తారు. బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు.

శ్రీకృష్ణదేవరాయల కాలం నుంచే...

శ్రీకృష్ణదేవరాయలు మల్లవరం శ్రీనివాసుని దర్శించుకుని ఆలయ నిర్మాణం చేపట్టినట్లు చెబుతారు. అద్దంకి సీమను పాలించిన రెడ్డిరాజులు స్వామికి మాన్యాలు ఇచ్చినట్లు శాసనాల్లో తెలుస్తోంది. దేవస్థానం అంచలంచెలుగా అభివృద్ధి చెందుతూ నేడు చక్కటి రాజగోపురం, కల్యాణ మండపం, గరుత్మంతుడు, హనుమంతుని విగ్రహాలు ఏర్పడ్డాయి. 1845లో ముక్తినూతలపాటి సీతారామయ్య మల్లవరం వేంకటేశ్వర స్వామిపై చూర్ణికలు రాయగా, వావిలాల రామ్మూర్తి మల్లవరం వేంకటేశ్వర స్వామిపై శతకం రచించారు. అదేవిధంగా ఆంజనేయ స్వామిపై వావిలాల జాలయ్య అనేక కీర్తనలు అల్లారు. ఇక విశ్వక్సేన, శ్రీలక్ష్మీ పద్మావతి అమ్మవారి ఆలయాలను 2008లో నిర్మించారు.

ఆలయ విశిష్టతలు

- శ్రీశైలంలో పాతాళగంగకు, అహోబిళం లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి, మల్లవరం వేంకటేశ్వర స్వామి ఆలయానికి రెడ్డి రాజులు ఒకేసారి మెట్లు నిర్మించినట్లు చెబుతారు.
- మల్లవరంలోని దేవస్థానం చెంతనే ప్రవహిస్తున్న గుండ్లకమ్మ నది గురించి వ్యాసుడు తన స్కంద పురాణంలో సైతం ప్రస్తావించారు.
- కవిత్రయంలో ఒకరైన ఎర్రన ఉత్తర హరివంశ కావ్యంలో మల్లవరం క్షేత్ర వైభవాన్ని వర్ణించారు.
- ప్రాతఃకాలంలో సూర్యకిరణాలు స్వామి పాదాలను తాకుతాయి.
- ప్రతి పౌర్ణమి రోజున జరిగే ప్రత్యేక పూజ రోజు అమ్మవారి వెండి చిన్న కలశాన్ని, కంకణాలను ముంజేతికి కడతారు. దీని వల్ల సకల శుభాలు కలుగుతాయని భక్తుల నమ్మకం.
- విశేష వాహనసేవలు, కల్యాణోత్సవం, తెప్పోత్సవం, చక్రస్నానం, బ్రహ్మోత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహిస్తుంటారు.
- క్రీ.శ 1277లో స్వామివారి కైంకర్యాల నిమిత్తం అప్పటి రాజు కోమటి వేమారెడ్డి మల్లవరం గ్రామాన్ని దానం చేశారు.
- వేమారెడ్డి సంతానంలో మల్లారెడ్డి పేరిట మల్లవరం, దొడ్డారెడ్డి పేరిట దొడ్డవరం, వేమారెడ్డి పేరిట వెల్లంపల్లి గ్రామాలు ఏర్పడినట్లు పెద్దలు చెబుతారు.



మల్లవరం గుడి.. ఆ పక్కనే గుండకమ్మనది(ఫైల్)

ఆటంకాలు..!

క్రీడా'ప్రకాశం' కునికిపాట్లు.. వేధిస్తున్న నిధుల కొరత

గత ఐదేళ్లు దాదాపు పోటీలన్నీ దాతల సహకారంతో నిర్వహణ

సమన్వయం లేని క్రీడా సంఘాలు

అరకొర మైదానాల్లో ఆటల పోటీలు

నేడు జాతీయ అథ్లెటిక్స్ దినోత్సవం



ఒంగోలు, కార్పొరేషన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు మనిషిని కొత్త పుంతలు తొక్కించడంతోపాటు మనోరంజక సాధనాలలో ముఖ్య భాగమైపోయాయి. సంప్రదాయక ఆటలకంటే ఆధునిక ప్రపంచ గుర్తింపు కలిగిన క్రీడల్లో ప్రావీణ్యం సంపాదిస్తే పేరు, ప్రతిష్ఠలతోపాటు, ఉద్యోగ ఉపాధి అవకాశాలకు మార్గాలు సులువవుతున్నాయి. ప్రధానంగా భారత రైల్వే సంస్థ, వివిధ క్రీడా సంస్థలలో కోచ్‌లుగా, పోలీసు శాఖ వంటి రంగాలలో ప్రాధాన్యత లభిస్తోంది. దీంతో పాఠ్యాంశాలకన్నా పలు క్రీడాపోటీలపైనే కొందరు యువకులు ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో క్రీడా ప్రతిభకు ప్రత్యేక గుర్తింపు ఉన్నా, పరిస్థితులకు ఎదురొడ్డి పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులకు కనీస ప్రోత్సాహం లభించలేదు. ప్రత్యేకించి నిధుల కొరత కారణంగా క్రీడల నిర్వహణ కూడా గగనమైపోతుంది. ఏటా నిర్వహించాల్సిన పలు క్రీడలకు నిధులు లేమి కారణంగా గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో దాతల దయచూపాల్సిన పరిస్థితి. కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తే తప్ప, క్రీడోత్సాహం కనిపించే పరిస్థితి లేదని పలువురు క్రీడా కోచ్‌లు వెల్లడిస్తున్నారు.

క్రీడాకారులకు కొదవలేదు

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో క్రీడా ప్రతిభకు లోటు లేదు. బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల చంద్‌గోపీ నుంచి ఆసియా క్రీడల కబడ్డీ పోటీల్లో భారత జట్టులో స్వర్ణం సాధించిన కళ్యాణి, కబడ్డీలో రాణించిన నాగలక్ష్మి, చీరాలకు చెందిన నిరుపేద కుటుంబంలోని వంశీకృష్ణ, వెయిట్ లిఫ్టింగ్‌లో పతకాలు సాధించిన కుమారి నంద, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పలువురు బాలికలు కత్తి, యుద్ధ క్రీడల్లో, ఇలా ఒకరేమిటి మండలానికో పేరున్న క్రీడాకారులు జిల్లాలో ఉన్నారు.

పోటీలకు ప్రోత్సాహం కరువు

ఆదరణ, ప్రోత్సాహం లేకున్నా క్రీడల పట్ల తమకున్న పట్టుదలతో పరుగులు పెడుతూ ముందుకు సాగుతున్న మన క్రీడాకారులు అభినందనీయులు. ఆసియాలోనే ప్రకాశం సత్తా చాటుతున్నా జిల్లా క్రీడాకారులకు కనీసం ప్రోత్సాహం కరువైంది. పేరుకు తగ్గట్టుగానే ప్రకాశించే మన క్రీడాకారులు పతకాలు సాధించడంలోనూ ప్రథమ స్థానంలోనే నిలుస్తున్నారు. కానీ కనీస క్రీడా ప్రాంగణం లేకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమన్వయం లేని క్రీడా సంఘాలు

జిల్లాలో కీర్తి ప్రతిష్ఠలు సాధించిన క్రీడాకారులకంటే క్రీడా సంఘాలకు జిల్లాలో కొదవ లేదు. ఆటకో సంఘం ఏర్పడగా, ఆ సంఘాలు అయినోళ్ల కోసమే అప్పుడప్పుడు పలు పోటీలు నిర్వహించి ఉనికిని కాపాడుకుంటున్నాయి. అంతేతప్ప అందరూ సమన్వయంతో కలిసి క్రీడాకారుల కీర్తిని ప్రశంసించే విధంగా ఏనాడు ముందుకు రాలేదనే విమర్శలు ఉన్నాయి. కనీస ప్రోత్సాహానికీ కలిసి రాని క్రీడా సంఘాలు పైసోకుతో, పేపర్లలో ఫొటోలతో పరువును కాపాడుకుంటున్నాయే తప్ప పెద్దగా జిల్లాకు ప్రయోజనం చేకూర్చ లేదనే చెప్పాలి. ఇప్పటి వరకు పతకాలు సాధించిన క్రీడాకారులంతా ఎటువంటి శిక్షణలతో నిమిత్తం లేకుండా సొంతంగా ప్రతిభ చాటిన గ్రామీణ కుసుమాలే. కొందరు ఫిజికల్ డైరెక్టర్లు, వ్యాయామోపాధ్యాయులు క్రీడా సంఘాలుగా ఏర్పడ్డారు. ఎవరికి వారే యమునాతీరే అన్నట్లు వ్యవహరించడం క్రీడాభివృద్ధికి ఆటంకాలు ఎదురవుతున్నాయి. ప్రణాళిక లేకుండా పోటీల నిర్వహణ, మొక్కుబడి ఎంపికలతో కాలాన్ని నెట్టుకు రావడం వలన క్రీడా రంగం కష్టాల్లో కునుకుపాట్లు పడుతోంది.

రెవెన్యూ సమస్యలపై బాధ్యతాయుతంగా పనిచేయాలి

కలెక్టర్ అన్సారియా ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, మే 6 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సమస్యలపై వచ్చిన అర్జీల పరిష్కారానికి పూర్తిబాధ్యతాయుతంగా, జవాబుదారీతనంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ సమావేశపు హాలులో రెవెన్యూ అధికారులతో మంగళవారం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎక్కువగా రెవెన్యూ సమస్యలపైనే అర్జీలు వస్తున్నాయన్నారు. వచ్చిన అర్జీలను నిశితంగా పరిశీలించి సమస్యను అర్థంచేసుకొని నాణ్యతతో పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో గతంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులు, పీజీఆర్ఎస్‌లో ప్రజలు అందజేసిన సమస్యల అర్జీలపై క్షేత్ర స్థాయి ఆడిట్‌ను సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. అర్జీల పరిష్కారంలో క్షేత్ర స్థాయిలో ఎండార్స్‌మెంట్ ఇచ్చినా వాటిని పరిష్కారం చూపిన విధానం సక్రమంగా ఉందా, లేదా అనిది రెవెన్యూ డివిజనల్‌అధికారులు పరిశీలించాలన్నారు. ప్రధానంగా రీ ఓపెన్ అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. వాటిపై గ్రామాలవారీగా నివేదిక అందజేయాలని కలెక్టర్ చెప్పారు. వివిధశాఖల అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి భూ కేటాయింపులపై వచ్చిన అర్జీలను సంబంధిత రెవెన్యూ డివిజనల్ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి వెంటనే ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేషు, ఒంగోలు, కనిగిరి ఆర్డీవోలు లక్ష్మీప్రసన్న, కేశవర్ధనరెడ్డి, జిల్లా ఉపాధి కల్పనాధికారి భరద్వాజ్, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసరావు ఉన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

వైద్యులు, సిబ్బంది హాజరు, పనితీరును పర్యవేక్షించాలి

వైద్యులు, సిబ్బంది ఆస్పత్రికి హాజరవుతున్న సమయం, వారి పనితీరుపై పటిష్ఠ పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో మంగళవారం సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఆస్పత్రుల వారీగా పనిచేస్తున్న సిబ్బంది, ఖాళీలు, రోజువారీ కార్యక్రమాలు, అందిస్తున్న సేవలు, ల్యాబరేటరీ, ఎక్స్‌రే, స్కానింగ్, బ్లడ్ బ్యాంకు, డయాలసిస్ తదితర అంశాలవారీగా కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. సీఎస్ఆర్ కింద ఆస్పత్రులకు కావాల్సిన సహాయంపై అడిగి తెలుసుకున్నారు. విధులు నిర్వహించకుండా ఆస్పత్రికి వచ్చామా, ఎఫ్ఆర్ఎస్ వేసి వెళ్లిపోదామా అనే ధోరణిని ఎవరైనా ప్రదర్శిస్తే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాంటి వారికి ముందుగా కౌన్సెలింగ్ ఇవ్వాలని, అయినా పద్ధతి మార్చుకోకపోతే చూస్తూ ఊరుకోవద్దని హెచ్చరించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు, ఎన్‌టీఆర్ వైద్య సేవ జిల్లా కో ఆర్డినేటర్ హేమంత్ పాల్గొన్నారు.

సర్వేలో గుర్తించిన పిల్లలను బడిలో చేర్పించాలి

ఒంగోలు కలెక్టరేట్, మే 6 (ఆంధ్రజ్యోతి) : రాచర్ల మండలంలో నిర్వహించిన బంగారు బాల్యం సర్వే ద్వారా గుర్తించిన పిల్లలను వారి కుటుంబాల స్థితిగతులను తెలుసుకొని వారిని తిరిగి పాఠశాలల్లో చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టరే ట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో మంగళవారం బంగారుబాల్యంపై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. బంగారు బాల్యం పైలట్ ప్రాజెక్టు కింద రాచర్ల మండలంలో 380 మంది పిల్లలను గుర్తించినట్లు తెలిపారు. సర్వేలో చాలా మంది దివ్యాంగుల పిల్లలు ఉన్నందున వారికి వీల్‌చైర్స్, మూడు చక్రాల సైకిళ్లను సమకూర్చాలని దివ్యాంగుల సంక్షేమశాఖ అధికారిని ఆదేశించారు. సమావేశంలో స్త్రీశిశు సంక్షేమ, సాధికారిత అధికారిణి పి. సుధామారుతీ, జిల్లా బాలల సంరక్షణ అధికారి పి. దినేష్‌కుమార్, బంగారుబాల్యం నోడల్ అధికారి గిరిధర్ శర్మ, సార్డ్ ప్రతినిధి సునీల్‌కుమార్ ఉన్నారు.

వస్త్రవ్యాపారి ఆత్మహత్య

వ్యాపారంలో నష్టాలతో సతమతం

మానసిక క్షోభతో మద్యానికి బానిస

ఒంగోలు క్రైం, మే 6(ఆంధ్రజ్యోతి) : వస్త్ర వ్యాపారం చేసే గోలి బాలశంకర్(45) ఇంట్లో ఉరివేసుకొని ఆతహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన స్థానిక పవర్ ఆఫీస్ ఎదురుగా ఉన్న ఎన్‌జీవో కాలనీలో చోటుచేసుకుంది. చీరాలకు చెందిన బాలశంకర్ ఎనిమిదేళ్ల క్రితం ఒంగోలు వచ్చి బాపూజీ మార్కెట్‌లో వస్త్రవ్యాపారం చేస్తున్నాడు. వ్యాపారంలో వచ్చిన నష్టాలకు అప్పుల పాలయ్యాడు. మానసిక క్షోభతో మద్యానికి బానిసయ్యాడు. సోమవారం అర్ధరాత్రి భార్యాపిల్లలు బెడ్ రూంలో పడుకొని ఉండగా హాల్‌లో ఉన్న బాలశంకర్ ఒక్కసారిగా పెద్దగా అరిచి పిల్లలను బాగా చదువుకోవాలని చెప్పడంతో భార్య ఇద్దరు పిల్లలు పరుగున బయిటికి వచ్చారు. అప్పటికే కేబుల్ వైర్‌తో ఫ్యాన్‌కు ఉరివేసుకున్న వేలాడుతున్న బాలశంకర్‌ను కిందకు దించారు. అనంతరం మళ్లీ బెడ్ రూంలోకి వెళ్లితలుపులు బిగించుకుని ఐరన్ బాక్స్ వైరుతో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. దీంతో చుట్టుపక్కల వారిని పిలిచి తలుపులు పెకిలించి అతనిని 108 ద్వారా రిమ్స్‌కు తరలించగా అక్కడ మంగళవారం తెల్లవారుజామున 2.30 గంటలకు బాలశంకర్ మృతి చెందినట్లు డాక్టర్లు చెప్పారని ఆయన భార్య భారతి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తాలూకా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గేదెను చంపిన పెద్దపులి

ఆందోళనలో గొట్టిపడియ గ్రామస్థులు

మార్కాపురం రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొట్టిపడియ గ్రామం గండి చెరువు సమీపంలో మేత మేస్తున్న గేదెపై పెద్దపులి దాడి చేసి చంపేసింది. ఈఘటన మంగళవారం చోటుచేసుకుంది. సమీప పొలాల్లో ఉన్న రైతులు గుర్తించి విషయాన్ని గేదె యజమాని తంగిరాల వెంకటేశ్వరరెడ్డికి తెలిపారు. ఆయన అటవీ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నాగరాజు, వెటర్నరీ అసిస్టెంట్ రఘు, ప్రొటక్షన్ వాచర్స్ అవులయ్య, రామిరెడ్డి, గేదె యజమాని, గ్రామస్థులు కలిసి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పులి సంచరించిన ప్రదేశాన్ని పరిశీలించారు. దాని కాలి ముద్రలను గుర్తించి పెద్దపులే గేదెను చంపినట్లు అటవీశాఖ అధికారులు నిర్ధారించారు. గత నాలుగు సంవత్సరాలుగా ముఖ్యంగా వేసవి సమయంలో గ్రామ సమీపంలో పెద్దపులి సంచరిస్తుందని ప్రజలు చెప్తున్నారు. ఈ ఘటనతో వారు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అటవీ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

టెన్త్ టాపర్‌కు మంత్రి సత్కారం



భార్గవిని సన్మానిస్తున్న మంత్రి స్వామి

ఒంగోలు విద్య, మే 6(ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్రంలో మూడో స్థానం, జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిన ఆలకూరపాడు జడ్పీ హైస్కూలు విద్యార్థిని పుట్టా వెంకటభార్గవి వనితను రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి మంగళవారం సత్కరించారు. తెలుగునాడు ఉపాధ్యాయ సంఘ నాయకులు ప్రోత్సాహక బహుమతిగా విద్యార్థికి రూ.10166 అందజేశారు. నిరుపేద కుటుంబంలో పుట్టి జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిన భార్గవిని అందరూ అభినందించారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌యూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్, చెరుకూరి పూర్ణచంద్రరావు, కె. వెంకట్రావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాంబాబు, ఆంజనేయులు, హెచ్‌ఎం వెంకటేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల హాల్‌టికెట్లు విడుదల

ఒంగోలు విద్య, మే 6 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల హాల్ టికెట్లను ఇంటర్మీడియెట్ విద్యా మండలి మంగళవారం విడుదల చేసింది. పరీక్షలు ఈ నెల 12నుంచి ప్రారంభం కానున్నాయి. ఇంటర్ బోర్డు వెబ్‌సైట్ నుంచి విద్యార్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని విద్యా డైరెక్టర్ కృతికశుక్లా తెలిపారు. మనమిత్ర వాట్సాప్ యాప్ 9502300009 నెంబర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.



పరీక్షల షెడ్యూల్ విడుదల

పరీక్షల షెడ్యూల్‌ను కూడా విడుదల చేశారు. 12వ తేదీ నుంచి జరగనున్న పరీక్షలు ఉదయం 9నుంచి 12గంటల వరకు మొదటి సంవత్సరం, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 వరకు ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహిస్తారు. 12న ద్వితీయబాష, 13న ఇంగ్లీషు, 14న గణితం, బోటని, సివిక్స్, 15న గణితం, జువాలజి, హిస్టరీ, 16న ఫిజిక్స్, ఎకనామిక్స్ 17న కెమిస్ట్రీ, కామర్స్ సోషియాలాజీ, ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్, 18న పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, లాజిక్, బ్రిడ్జి కోర్సు 20న మోడ్రన లాంగ్వేజీ, జియోగ్రఫీ సబ్జెక్టులకు పరీక్షలు జరుగుతాయి. ఆదివారం కూడా పరీక్ష జరుగుతుంది.

- సైన్స్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు మే 28నుంచి జూన్ 1వరకు రోజు రెండు సెంటర్లలో ఉదయం 9నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2నుంచి 5గంటల వరకు జరుగుతాయి.
- ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష జూన్ 4న జరుగుతుంది.
- ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్ జూన్ 6న ఉదయం 10నుంచి ఒంటి గంట వరకు జరుగుతుంది. ఒకేషనల్ విద్యార్థులకు కూడా ఇవే తేదీల్లో పరీక్షలు జరుగుతాయి.

నేడు, రేపు ఉచిత శస్త్రపరీక్షలు

ఒంగోలు కలెక్టరేట్, మే 6 (ఆంధ్రజ్యోతి) : గ్రహణం మొర్రి, పెదవి, అంగిలి చీలికకు ఉచిత శస్త్ర పరీక్షలు బుధ, గురువారాల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి. వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 11 గంటలనుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఒంగోలులోని సర్వజన ఆస్పత్రిలో, గురువారం మార్కాపురం సర్వజన ఆస్పత్రిలో పరీక్షలు జరుగుతాయని తెలిపారు. డాక్టర్ సుధా, నాగేశ్వరరావు సహకారంతో ఈ ఉచిత వైద్య పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించం

- పారిశుధ్యం, నీటి సరఫరాలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు
- ఎమ్మెల్యే దామచర్ల హెచ్చరిక
- కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో అజెండాలోని అంశాలన్నీ ఆమోదం
- నగర అభివృద్ధి కోసం సమష్టిగా ముందుకు సాగాలి : ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్


సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, పక్కన ఎమ్మెల్యే విజయ్‌కుమార్, (ఇన్‌సెట్లో) మేయర్ సుజాత

ఒంగోలు కార్పొరేషన్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలో ప్రజలకు ప్రధాన అవసరాలైన తాగునీరు, పారిశుధ్యంలో ఫిర్యాదులు వస్తున్నాయని, అధికారులు పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో పాలకవర్గ సమావేశం మేయర్ గంగాడ సుజాత అధ్యక్షతన జరిగింది. ఎక్స్‌అఫిషియో సభ్యులుగా ఎమ్మెల్యే దామచర్ల, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎస్.విజయ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ తొలిసారిగా అజెండాలో 124 అంశాలు ఉంచగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఇదే సమయంలో తొలిసారిగా కూటమి కార్పొరేటర్లు టీడీపీ, జనసేన సభ్యులు అందరూ హాజరుకావడంతో సమావేశంలో సుదీర్ఘ చర్చ నడిచింది.

నగర అభివృద్ధే ముఖ్యం : దామచర్ల

నగర అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారం, ప్రగతే ముఖ్యమని, అందుకోసం ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సూచించారు. తాగునీరు, పారిశుధ్యంలో ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, ముఖ్యంగా నీటి సరఫరాలో లోపాలను సవరించుకోవాల్సిన బాధ్యత ఇంజనీరింగ్ అధికారులపై ఉందన్నారు. అధికారంలోకి వచ్చి పది నెలలు అవుతున్నా సిబ్బంది పనితీరులో మార్పు కనిపించడం లేదని, ఇంకా పాత విధానంతో పనిచేస్తే కుదరదని హెచ్చరించారు. ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే ఉపేక్షించేది లేదని చెప్పారు. మొక్కుబడి సేవలకు ఫుల్‌స్టాప్ పెట్టాలన్నారు. నగరంలో పారిశుధ్య లోపం స్పష్టంగా కనిపిస్తోందని, కొందరు విధుల్లో మస్టర్ వేయించుకుని పనులకు డుమ్మా కొడుతున్నారని తన దృష్టికి వచ్చిందని, అలాంటి వారిని తొలగించాలని ఆదేశించారు. పారిశుధ్య విభాగంలో 708 కార్మికులు ఉండగా, మరలా 150 మందిని విధుల్లోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. పారిశుధ్యం మెరుగు కోసం అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, అవసరమైతే ఎఫ్ఆర్ఎస్ విధానం అమలు చేయాలని సూచించారు. అలాగే అభివృద్ధి పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు సకాలంలో పనులు పూర్తి చేసేలా చూడాలన్నారు. నెలల తరబడి పనులు ప్రారంభించకపోతే పనులు రద్దు చేయాలన్నారు.

సమన్వయంతో సాగాలి : ఎమ్మెల్యే బీఎస్

పాలకవర్గ సభ్యులు, కార్పొరేషన్ అధికారులు, ఇతర సిబ్బంది సమన్వయంతో పనిచేసి నగర అభివృద్ధిని సాధించాలని ఎమ్మెల్యే బీఎస్.విజయ్‌కుమార్ కోరారు. ఇందుకోసం ఎమ్మెల్యే దామచర్ల సలహాలు, సూచనలతో పాటు కార్యచరణ రూపొందిస్తున్నారన్నారు. తాను ప్రాతినిధ్యం వహించే సంతనూతలపాడు నియోజకవర్గంలోని ఐదు డివిజన్లు ఒంగోలులో భాగస్వామ్యం కాగా, వాటి అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు కేటాయించడం ఆనందంగా ఉందన్నారు.

వైసీపీ కార్పొరేటర్లకు దీటుగా..

అయితే కౌన్సిల్‌లోని నలుగురు వైసీపీ కార్పొరేటర్లు అజెండాలోని అంశాలపై పదే పదే విమర్శలు చేయడంపై టీడీపీ కార్పొరేటర్ దాచర్ల వెంకటరమణయ్య స్పందించారు. టీడీపీ పనితీరును విమర్శించేముందు వైసీపీ పాలనలో చేసిన ప్రగతి ఏమిటో చెప్పాలని, వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని ఘాటుగా సమాధానమిచ్చారు. నగరంలో పారిశుధ్యం పేరుతో కొందరు కార్మికులు ప్రతి ఇంటి నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని వైసీపీ కార్పొరేటర్లు రచ్చ చేయడంతో టీడీపీ కార్పొరేటర్ గిరిజ శాండిల్య మండిపడ్డారు. గత వైసీపీ హయాంలో ఇంటింటి చెత్త సేకరణ వాహనాల రిపేర్లకే రూ.లక్షలు ఖర్చు చేశారని విమర్శించారు. డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి అభివృద్ధి పనుల్లో అన్ని డివిజన్లకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. జనసేన పార్టీ కార్పొరేటర్ మలగా రమేష్ తన డివిజన్‌లో చేపట్టే పనులకు కనీసం సమాచారం కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. కార్పొరేటర్ ఈదర వెంకట సురేష్ బాబు మాట్లాడుతూ హౌసింగ్ బోర్డు కాలనీ, భాగ్యనగర్‌లో తాగునీరు ఎప్పుడొస్తాయో తెలియడం లేదన్నారు. మరో కార్పొరేటర్ యనమల నాగరాజు మాట్లాడుతూ నగరంలోని అద్దంకి బస్టాండ్‌లోని ఓ షోరూం అద్దె బకాయి రూ.15లక్షలు కార్పొరేషన్‌కు చెల్లించాల్సి ఉండగా, ఆ ఫైల్ కనిపించకపోవడం దారుణమని, విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు, టీడీపీ కార్పొరేటర్లు టి.రవితేజ, చింతపల్లి గోపి, పలువురు టీడీపీ, జనసేన, వైసీపీ కార్పొరేటర్లు, కమిషనర్ వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ కమిషనర్ కొండయ్య, ఎంఈ చంద్రయ్య, ఏసీపీ సుధాకర్, ఆర్వో భాస్కర్, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు కలెక్టరేట్, మే 6 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని రంగారాయుడు చెరువు కట్టపై వాకర్ అండ్ జిమ్ మేట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం నగర కమిషనర్ వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో రంగారాయుడు చెరువు కట్టపైకి వచ్చే వాకర్స్‌కు ఈ చలివేంద్రం ఎంతో ఉపయోపడుతుందని తెలిపారు. పైనం మల్లికార్జునరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బాషా, వలి, బంగారయ్య, రాము, శ్రీదేవి, భారతి, లక్ష్మీలీల, శ్యామల, సుజన, హుస్సేన్, శేషయ్య, షాలిని, సామా సుబ్బారావు, వెంకట్రావు, లాయర్ రంగారావు, రమా, ప్రసాద్, వెంకట సత్యనారాయణరెడ్డి, కె.వెంకటేశ్వర్లు, గోపాల్‌రెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై మాగుంట సమీక్ష

ఒంగోలు కలెక్టరేట్, మే 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలపై ఒంగోలు ఎంపీ, గృహ, పట్టణ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ మాగుంట శ్రీనివాసులురెడ్డి సమీక్ష చేశారు. ఢిల్లీలోని పార్లమెంట్ భవన్ కమిటీ హాలులో మంగళవారం జరిగిన సమావేశంలో పలు పథకాలపై సమీక్షించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన, పీఎంఏవైతో పాటు పలు అంశాలపై సంబంధిత అధికారులకు దిశా నిర్దేశంచేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం

నాగులుప్పలపాడు, మే 6 (ఆంధ్రజ్యోతి): నాగులుప్పలపాడులో వేంచేసిన శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షిక ఆరాధనోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం దేవాలయంలో దీక్షా స్వాములకు ఇరుముడి కట్టారు. సాయంత్రం గ్రామ దేవత పోలేరమ్మ తల్లికి పానకము, వడపప్పు, పొంగలి సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వార్లను దర్శించుకుని పూజలు చేశారు. కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ముప్పాళ్లలో నేత్రదానం

ఇంకొల్లు,మే 6,(ఆంధ్రజ్యోతి) : నాగులుప్పలపాడు మండలం ముప్పాళ్ల గ్రామంలో కల్లూరి ఏసుబాబు మంగళవారం మృతి చెందగా ఇంకొల్లు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నేత్రదానం చేశారు. వారి బంధువులు సహకారంతో గుంటూరు శంకర కంటి ఆసుపత్రి వైద్యులు రోటరీ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో నేత్రాలను సేకరించారు. కార్యక్రమంలో రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు జెట్టి స్వామి, రామ్మోహనరావు, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

వ్యవసాయ పరికరాల పరిశీలన

మద్దిపాడు, మే 6(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ పరికరాలపై విజిలెన్స్ అధికారులు మంగళవారం తనిఖీలను చేపట్టారు. మండలంలోని రైతు సేవ కేంద్రాల ద్వారా రైతు గ్రూపులకు అందించిన యంత్ర పరికరాలను సబ్సిడీపై అందించారు. దీనిపై విజిలెన్స్ ఏవో ప్రసాద్, కానిస్టేబుల్ చెన్నకృష్ణ తనిఖీలు చేపట్టారు. కార్యక్రమంలో ఏవో రమేష్‌బాబు పాల్గొన్నారు.

నేటి నుంచి మల్లవరంలో శ్రీవేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు

మద్దిపాడు, మే 6(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు మండలం మల్లవరంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థాన బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం అవుతాయని ఈవో దామా నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. బుధవారం రాత్రి అంకురార్పణ, గురువారం ధ్వజారోహణ, శేషోత్సవం, శుక్రవారం హంసోత్సవం, శనివారం సింహవాహనోత్సవం, 11వ తేదీన హనుమంతోత్సవం, 12న మోహినీ అవతారం, గరుడోత్సవం, 13న గజోత్సవం, వినోద కార్యక్రమాలు, 14వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు స్వామి వారి కల్యాణం, అనంతరం అన్నదానం, 15వ తేదీ అశ్వవాహన సేవ, 16వ తేదీ ధ్వజావరోహణ, 17వ తేదీన చక్రతీర్థం, ఏకాంత సేవ మొదలైన కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. భక్తుల కోసం మల్లవరం నుంచి గుండ్లకమ్మ ఆర్చి వరకు ఉచితంగా ఆటోలు ఏర్పాటు చేసినట్లు శ్రీవారి వనం కమిటీ సభ్యులు తెలిపారు.

వెల్లంపల్లిలో ఆగి సాగిన పొగాకు వేలం

- భారీగా తిరస్కరణకు గురైన బేళ్లు

మద్దిపాడు, మే 6(ఆంధ్రజ్యోతి): వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం వేలం ఆగి సాగింది. వ్యాపారులు సిండికేట్ కావడంతో పాటు రైతులు తీసుకొచ్చిన పొగాకు బేళ్లను తిరస్కరించారు. దీంతో ఆగ్రహించిన రైతులు వేలంను గంటపాటు నిలుపుదల చేశారు. మారెళ్ల క్లస్టర్ రైతులు 572 బేళ్లు తీసుకు రాగా దానిలో 25 శాతం బేళ్లను తిరస్కరించడంతో వేలం కేంద్రం కార్యనిర్వాహణాధికారి కోవి రామకృష్ణ రైతులతో మాట్లాడారు. దీంతో 135 బేళ్లు రైతులు వెనక్కి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు నాణ్యతగా లేకపోవడంతో వ్యాపారులు తిరస్కరించారని చెప్పారు. పొగాకు కిలో గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.230 పలికినట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘ అధ్యక్షులు అబ్బూరి శేషగిరిరావు, నారిపెద్ది వరహాలుచౌదరి, మండవ గోవిందరాజులు, బోయపాటి వెంకయ్యచౌదరి, మండవ శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికలకు పౌష్టికాహారం అందించాలి

ఒంగోలు(రూరల్), మే6(ఆంధ్రజ్యోతి): కిశోర బాలికలకు సంపూర్ణమైన పోషక ఆహారం ఎంతో అవసరమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ డీవీ.రాణి తెలిపారు. ఒంగోలు మండలం యరజర్లలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం కిశోరి వికాసంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రాణి మాట్లాడుతూ కౌమార దశలోని బాలికలకు మంచి పోషక ఆహారం అందించాలన్నారు. బాల్యవివాహాలు చేయడం నేరమని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలికలు పాల్గొన్నారు.

నేడు సర్వేరెడ్డిపాలెంలో ఉచిత వైద్యశిబిరం

ఒంగోలు(రూరల్), మే6(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం సర్వేరెడ్డిపాలెం గ్రామంలో ఈనెల 7వ తేదీన క్విజ్ ఇంజనీరింగ్ కళాశాల, కిమ్స్ వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం జరుగుతుందని నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ, హెల్త్‌కార్డులపై శస్త్రచికిత్సలు తక్కువ చేస్తారన్నారు. గ్రామస్థులుతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

అనాథ బాలలకు అన్నదానం


అన్నదానం చేస్తున్న భార్గవ్

ఒంగోలు(కల్చరల్), మే 6(ఆంధ్రజ్యోతి): పెండ్యాల లక్ష్మయ్య జ్ఞాపకార్థం అతని మనుమడు భార్గవ్ మంగళవారం స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీ బొమ్మరిల్లు అనాథాశ్రమంలో అన్నదానం చేశారు. అక్కడ ఉన్న సుమారు 40 మంది చిన్నారులకు భోజన ఏర్పాట్లు చేసి అనంతరం యూనిఫారం ఏర్పాటుకు ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా భార్గవ్ మాట్లాడుతూ తన మొదటి నెల జీతంతో అనాధ చిన్నారులకు సేవ చేయటం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఖాసిం, రాజ్యలక్ష్మి, భార్గవ్ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యానికి మేలు

ఒంగోలు(కల్చరల్), మే 6(ఆంధ్రజ్యోతి): చిన్నతనం నుంచి యోగా చేయటం ద్వారా ఆరోగ్యవంతంగా జీవించవచ్చని ఉపగ్రంథ పాలకురాలు బొమ్మల కోటేశ్వరి పేర్కొన్నారు. స్థానిక జిల్లా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో భాగంగా మంగళవారం టి.శ్రీనివాసరావు విద్యార్థులతో యోగా చేయించారు. అదేవిధంగా కాలూరి కాశీవిశ్వనాథ్ కథలు, చెప్పటం, వి.వెంకయ్య స్పోకెన్ ఇంగ్లీష్, ఆర్.బిందుమణి హ్యాండ్ రైటింగ్, దాసరి ప్రసాద్ కళలు, శిరీష డ్రాయింగ్, జాలాది మోహన్ పర్సనల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ తరగతులు నిర్వహించారు. విద్యార్థులు వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోటేశ్వరి కోరారు.

మహిళా విభాగాన్ని బలోపేతం చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, మే 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగాన్ని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించారు. మంగళవారం సాయంత్రం ఒంగోలులోని రెవెన్యూ భవన్‌లో మహిళా విభాగం జిల్లా ఛైర్‌పర్సన్ ఎస్.జయలక్ష్మి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరి ఎం.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

రేపు అంబేడ్కర్ నాటక ప్రదర్శన

ఒంగోలు కలెక్టరేట్, మే 6 (ఆంధ్రజ్యోతి): సామాజిక చైతన్య ఉత్సవాల పేరుతో సంఘం శరణం గచ్ఛామి హైదరాబాద్ వారిచే ఈనెల 8,9 తేదీల్లో అంబేడ్కర్ నాటక ప్రదర్శనలు జరుగుతాయని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి రఘురాం తెలిపారు. ఒంగోలులోని ప్రజాసంఘాల కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 8వ తేదీన ఒంగోలులోని అంబేడ్కర్ భవన్‌లో, 9న మద్దిపాడులోని కళాకేంద్రం పంచాయతీ ఆఫీస్ వద్ద ఈ నాటకాలు జరుగుతాయని చెప్పారు. విద్యార్థులు యువకులు, ఉద్యోగులు, మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు అట్లూరి రాఘవులు, మోజేష్, సంజీవరావు పాల్గొన్నారు.

అజీజ్ సాహిత్య సేవలు చిరస్మరణీయం

ఒంగోలు(కల్చరల్), మే 6(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక, సాహిత్య రంగాలలో అజీజ్ అహమ్మద్ అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు కళాకారులు పేర్కొన్నారు. ఇటీవల మరణించిన అజీజ్ సంస్మరణ సభ శ్రీనాగినేని నరసింహారావు మెమోరియల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం స్థానిక సీవీఎన్ రీడింగ్ రూములో జరిగింది. ముందుగా అజీజ్ చిత్రపటానికి కళాకారులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సంస్థ అధ్యక్షుడు మిడసల మల్లిఖార్జునరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మిరియాల వెలుగొండయ్య, సీవీఎన్ రీడింగ్ రూము అధ్యక్ష, కార్యదర్శులు గురునాథరావు, రాధాకృష్ణ, కె.రాఘవులు, కుర్రా ప్రసాద్‌బాబు, నితిన్‌రెడ్డి, వీరప్రతాప్, కరేటి కిరణ్‌బాబు, ఎస్.కోటేశ్వరరావు, సాంబశివరావు, ఎ.ప్రసాద్, మహబూబ్‌జాన్, షేక్ షబ్బీర్, మన్సూర్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం : ఎస్పీ

- పోలీసుల పిల్లలకు సమ్మర్ క్యాంప్ ప్రారంభం



టగ్ఆఫ్‌వార్ పోటీని ప్రారంభిస్తున్న ఎస్పీ దామోదర్

ఒంగోలు క్రైం, మే6(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం పెంపొందిస్తాయని ఎస్పీ ఏఆర్.దామోదర్ పేర్కొన్నారు. మంగళవారం ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలోని క్రీడా మైదానంలో పిల్లలకు స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ క్రీడలతో చిన్నారుల్లో పోటీతత్వం ఏర్పడుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇష్టమైన క్రీడలలో ప్రోత్సహించాలన్నారు. కోరారు. రోజులు పాటు జరిగే ఈ క్యాంప్‌లో పోలీసులు తమ పిల్లలను చేర్పించాలని కోరారు. క్రీడలతో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని చెప్పారు. అదేవిధంగా ఓటమిని స్వీకరించే గుణం వంటి ఎన్నో విషయాలు నేర్చుకుంటారని తెలిపారు. కాగా సమ్మర్ క్యాంప్‌లో భాగంగా ఫుట్‌బాల్, టగ్ఆఫ్‌వార్, షటిల్ బాడ్మింటన్, రన్నింగ్ యోగా వంటి అంశాలపై హెడ్ కానిస్టేబుల్ రాజేంద్ర, జాతీయ క్రీడాకారులు శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, ఆర్ఐలు రమణారెడ్డి, సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టెన్నిస్ కోర్టు ప్రారంభం

పోలీసు మైదానంలో నవీకరించిన టెన్నిస్ కోర్టును ఎస్పీ దామోదర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతే నిత్యం మానసిక ఒత్తిడికి గురయ్యే పోలీసు సిబ్బందికి ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

పశుపోషకులకు 50శాతం రాయితీపై దాణా

- జిల్లాకు 250 మెట్రిక్ టన్నులు సరఫరా
- డీఏహెచ్‌వో బేబీరాణి


పశుపోషకులకు దాణాను అందిస్తున్న డీఏహెచ్‌వో బేబీరాణి

సంతనూతలపాడు, మే 6(ఆంధ్రజ్యోతి): పశుపోషకులకు 50శాతం రాయితీపై దాణాను పంపిణీ చేస్తున్నట్లు జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి (డీఏహెచ్‌వో) డాక్టర్ కె.బేబీరాణి తెలిపారు. మంగళవారం సంతనూతలపాడులోని పశువైద్యశాలలో పశుపోషకులకు రాయితీపై దాణాను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెల్లరేషన్‌కార్డు దారులకు మాత్రమే దాణాను అందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం అందించే దాణాలో 25 శాతం ఆరోగ్యకరమైన మాసంకృత్తులు ఉంటాయన్నారు. ఒక్కో రైతుకు నెలకు 150 కేజీల లెక్కన మూడు నెలలకు 450 కేజీల దాణాను అందించనున్నట్లు తెలిపారు. జిల్లాకు ప్రభుత్వం 250 మెట్రిక్ టన్నుల దాణా అందించినట్లు చెప్పారు. అదేవిధంగా గేదెలకు, ఆవులకు తప్పనిసరిగా ప్రభుత్వం కల్పిస్తున్న 85శాతం రాయితీతో ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పశుపోషకులకు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రతాప్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సీహెచ్‌వోల సమస్యలను పరిష్కరించాలి

- కొనసాగుతున్న సమ్మె


నల్లరిబ్బన్లు కట్టుకుని వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళా ఉద్యోగులు

ఒంగోలు కలెక్టరేట్, మే 6 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కమ్యూనిటీ హెల్త్ అధికారులు (సీహెచ్‌వోలు) స్థానిక కలెక్టరేట్ ఎదుట చేపట్టిన దీక్షలు మంగళవారానికి ఎనిమిదో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ గత రెండేళ్ళుగా వేతనాల కోసం అనేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. నిబంధనల ప్రకారం వేతనాలు ఇచ్చే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. 23శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని, క్లినిక్‌ల అద్దె బకాయిలను చెల్లించాలని, పెండింగ్ ఇన్సెంటివ్‌లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాల్సి వస్తోందని హెచ్చరించారు. కార్యక్రమంలో అనుముల రామకృష్ణ, రాజేష్, జీవనజ్యోతి, ప్రసన్న, రమేష్, దీప్తి, కామేష్, రామాంజనేయులు పాల్గొన్నారు.

మలేరియా, డెంగ్యూ నివారణకు చర్యలు

- డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు

ఒంగోలు కలెక్టరేట్, మే 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మలేరియా, డెంగ్యూ కేసులు నమోదు కాకుండా ప్రత్యేక దృష్టి సారించాలని డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో ఆఫీసులో మంగళవారం సబ్ యూనిట్ ఆఫీసర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ కేసులు నమోదైన గృహాలను సందర్శించి పరిసరాల్లో స్ప్రే చేయాలన్నారు. ప్రతి సబ్ యూనిట్ ఆఫీసర్ విధిగా ఎంఎల్‌డీ యాప్‌తో క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని, తమ పరిధిలో ఉన్న ఆర్ఎంపీలు, పీఎంపీలతో సమావేశం నిర్వహించి కిటక జనిత వ్యాధులు నివారించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా నివారణ అధికారి మధుసూదన్, మాస్‌మీడియా ఇన్‌చార్జి డి.శ్రీనివాసులు పాల్గొన్నారు.


డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న అసోసియేషన్ నాయకులు

జిల్లా వైద్యశాఖాధికారికి సత్కారం

జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లును ఒంగోలు అర్బన్, రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు సత్కరించారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో మంగళవారం వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మెడికల్ ప్రాక్టీషనర్స్ తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్ళారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.వెంకటేశ్వర్లు, పీవీ.కృష్ణారావు, కోశాధికారి జానా శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడు జి.భాస్కరరావు, కమిటీ సభ్యులు ఎస్.రమేష్, పి.నాగరాజు, అద్దంకి లెనిన్‌బాబు, జి.అనిల్, హరినారాయణ, సుధాకర్, కేవీ.సుబ్బారావు, పి.ఖాజావలి, దివాకర్, జి.అంటోని, సీహెచ్.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతుల పరిశీలన

సంతనూతలపాడు, మే 6(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణ తరగతులను మంగళవారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదిలక్ష్మి పరిశీలించారు. విద్యార్థులతో కాసేపు మాట్లాడారు. శిక్షణ తరగతుల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. విద్యార్థులకు సంబంధించిన పుస్తకాలను అందుబాటులో ఉంచాలని గ్రంథాలయ అధికారి కె.సత్యనారాయణకు సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.



విద్యార్థులతో ఆదిలక్ష్మి

పబ్లిక్ నోటీసు

మా క్లయింటు అయిన ప్రకాశం జిల్లా, ఒంగోలు కార్పొరేషన్, బృందావననగర్ నివాసి అయిన బొడ్డు రాధారాణి, భర్త(లేటు) ఆంజనేయులు అనువారు ఇచ్చిన సంజాయిషీ మేరకు ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా.

ఈ దిగువ తెలిపిన షెడ్యూలు దాఖలా అస్తులు నా క్లయింటుకు రావలసిన ప్రామిసరీ నోటుల బాకీలు నిమిత్తము వాయిగండ్ల శ్రీనివాసులు మరణించినందున వారి వారసులు అయిన వాయిగండ్ల లావణ్య, వాయిగండ్ల వేణుసాయి అనువారిపై ఒంగోలు ఫ్యామిలీ కోర్టు(8వ అడిషనల్ జిల్లా కోర్టు)లో ఓ.యస్.నెం.26/2025గా దావా చేసియున్నారు. వాయిగండ్ల శ్రీనివాసులు పేరుపై ఉన్న ఈ దిగువ షెడ్యూలు 1,2 అస్తులను ఐ.ఏ.నెం.592/2025 పిటీషన్ ద్వారా సదరు అస్తులను అటాచ్‌మెంట్ ఆర్డర్‌లు ఇచ్చియున్నారు. కనుక సదరు వాయిగండ్ల శ్రీనివాసులుకు సంబంధించిన షెడ్యూలు 1,2 అస్తులను వారి భార్య అయిన లావణ్య, కుమారుడైన వేణుసాయి అమ్మటకు ప్రయత్నించుచున్నారు అని తెలిసినది. కోర్టువారు అటాచ్‌మెంట్ చేసిన సదరు షెడ్యూలు 1,2 అస్తులను క్రయ విక్రయాలు జరిపినచో చెల్లనేరవని ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.

షెడ్యూలు

ఐటమ్ నెం.1 :- ప్రకాశం జిల్లా, ఒంగోలు సబ్‌రిజిస్ట్రార్ యిలాకా, ఒంగోలు మున్సిపల్ కార్పోరేషన్ ఏరియా, గాంధీరోడ్డు, 3వ వార్డు, బ్లాక్ నెం.6, టి.యస్.నెం.207, డోర్ నెం.23-1-118, అసెస్మెంట్ నెం.1035005131 ఖాళీ స్థలము మరియు ఆర్.సి.సి. బిల్డింగ్‌నకు **హద్దులు : తూర్పు:** పచ్చిపులుసు సుబ్రమణ్యం గారి ఇల్లు, **దక్షిణం:** గుర్రం కృష్ణమూర్తి గారి స్థలం, **పడమర:** వాయిగండ్ల శ్రీనివాసులు గారి ఆస్థి, **ఉత్తరం:** వాయిగండ్ల శ్రీనివాసులు గారి ఆస్థి.

యీ హద్దులలోని విస్తీర్ణం 630 చ॥అ॥లు లేక 70చ॥గ॥లు లేక 8 గదుల 54చ.అ.లు లేక 58.52చ.మీ.ల ఖాళీ స్థలములో 554చ.అ.లులో నిర్మించిన ఆర్.సి.సి గ్రౌండ్ ఫ్లోర్ మరియు సదరు బిల్డింగ్‌కు అమర్చిన యావత్తు విశిష్ట సామానులు మరియు యావత్తు యీజ్‌మెంట్ హక్కులతో సహా.

ఐటమ్ నెం.2 :- ప్రకాశం జిల్లా, ఒంగోలు సబ్‌రిజిస్ట్రార్ యిలాకా, ఒంగోలు మున్సిపల్ కార్పోరేషన్ ఏరియా, గాంధీరోడ్డు, 3వ వార్డు, బ్లాక్ నెం.6, టి.యస్.నెం.207, డోర్ నెం.23-1-115, అసెస్మెంట్ నెం.1035005119, గ్రౌండ్ ఫ్లోర్ (ఆర్.సి.సి.షాప్స్) విస్తీర్ణం 989.67 చ.అ.లు గల ఆర్.సి.సి బిల్డింగ్‌నకు **హద్దులు : తూర్పు:** వస్త్రసాగర్ షాపు, **దక్షిణం:** వి.శ్రీనివాసరావు గారి ఖాళీ స్థలం (ఐటమ్ నెం.1), **పడమర:** నీలం బ్యాంగిల్స్ షాపు, **ఉత్తరం:** గాంధీరోడ్డు.

ఒంగోలు
తేది.06-05-2025

గుంటా శ్రీనివాసరావు, ఎం.ఏ.ఎల్.ఎల్.బి.
ఓగిరాల వెంకట రామానాయుడు
జిల్లా కోర్టు ఎదురు, గ్రౌండ్ ఫ్లోర్ గోల్డెన్ టవర్స్,
ఒంగోలు, ప్రకాశం జిల్లా, సెల్-9948822131.

సాగర్ వాల్ గుంతను పూడ్చారు

స్పందించిన ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

ఎర్రగొండపాలెం రూరల్ మే 6 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదకరంగా సాగర్ వాల్ గుంత అన్న శీర్షికన గత నెల 30న ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై అధికారులు స్పందించారు. స్థానిక కొలుకుల రహదారిలో కంప్లెక్స్ పక్కన సాగర్ నీరు విడుదల చేసే వాల్ గుంత పూడ్చకపోవడంతో ప్రజలు, పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని ఆంధ్రజ్యోతిలో కథనం వెలువడింది. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించారు. ప్రమాదకరంగా ఉన్న సాగర్ వాల్ గుంతను పూడ్చి వాల్ వరకు ఉంచి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేశారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



గుంతను పూడ్చివేయించిన అధికారులు

వీధిలైట్లు వెలగక ఇక్కట్లు

గిద్దలూరు, మే 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు వీధుల్లో వీధిలైట్లు సక్రమంగా వెలుగక పోవడంతో ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. కోటగడ్డవీధి, పోలీసు స్టేషన్ రోడ్డు, బీసీ బాలికల వసతి గృహం వద్ద గత నాలుగైదు రోజులుగా వీధి దీపాలు వెలుగక పోవడంతో రాత్రులందు చిమ్మచీకటిలో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే వీధిదీపాలను పునరుద్ధరించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

పెనుగాలుల బీభత్సం

- నేలకొరిగిన బొప్పాయి తోటలు
- రూ.2 కోట్ల మేర నష్టం





మార్కాపురం పట్టణంలో కురుస్తున్న వాన.. గజ్జలకొండలో పడిపోయిన బొప్పాయి చెట్లను పరిశీలిస్తున్న ఏవో, హెచ్‌వో

తర్లుపాడు, మే 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలో మంగళవారం సాయంత్రం వీచిన ఉరుములు, మెరుపులతో కూడిన పెనుగాలల బీభత్సానికి బొప్పాయి తోటలు నేలకొరిగాయి. దీంతో రూ.2 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కలుజువ్వలపాడు పంచాయతీలోని ఓబాయిపల్లి, లక్ష్మక్కపల్లి, కొండారెడ్డిపల్లెలో ఎక్కువగా బొప్పాయి తోటలు నేలకొరిగాయి. ఓబాయిలపల్లె గ్రామానికి చెందిన ఉడుముల శ్రీదేవి, అన్నపురెడ్డి చెంచులక్ష్మి, అన్నపురెడ్డి చిన్నమ్మ, వెన్నా వెంకటరెడ్డి, యక్కంటి వెంకట సుబ్బారెడ్డి, గంటా వెంకటేశ్వరరెడ్డి, పలువురి బొప్పాయి తోటలు నేలకొరిగాయి. ఓబాయిపల్లెలో సుమారు 60 ఎకరాలు, కొండారెడ్డిపల్లెలో 30, లక్ష్మక్కపల్లెలో 20 ఎకరాలు, దాదాపుగా 200 ఎకరాల్లో బొప్పాయి తోటలు దెబ్బతిన్నట్లు రైతులు పేర్కొన్నారు. ఆరుగాలం శ్రమించి పంట చేతికొచ్చే దశలో పెనుగాలులు, ఉరుములతో చిన్నపాటి వర్షానికి తోటలు పూర్తిగా దెబ్బతినటంతో రైతన్నలు లబోదిబోమంటున్నారు. ఎకరాకు దాదాపుగా రూ.లక్షకు పైగా పెట్టుబడి పెట్టినట్లు రైతులు తెలిపారు. దెబ్బతిన్న బొప్పాయి తోటలకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. బొప్పాయి తోటలను ఉద్యాన శాఖ అధికారులు పరిశీలించి ప్రభుత్వం నుంచి అందేలా చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

ధ్వంసమైన తోటల పరిశీలన

మార్కాపురం రూరల్ : మండలంలోని గజ్జలకొండ గ్రామ పరిధిలో సోమవారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు బొప్పాయి చెట్లు ధ్వంసమయ్యాయి. ధ్వంసమైన బొప్పాయి చెట్లను మంగళవారం వ్యవసాయాధికారి శ్రీనివాసులు, ఉద్యానవన శాఖ అధికారి రమేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పరిధిలో 15 మంది రైతులకు చెందిన బొప్పాయి తోట మొత్తం 38 ఎకరాలు పూర్తిగా ధ్వంసమయ్యాయని తెలిపారు. ఈదురు గాలులకు పడిపోయిన బొప్పాయి తోటలను పరిశీలించినట్లు తెలిపారు. పూర్తిగా నష్టపోయిన బొప్పాయి రైతులకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందించేందుకు వివరాలను సంబంధిత ఉన్నతాధికారులకు పంపించడం జరుగుతుందని తెలిపారు. అధికారుల వెంట గ్రామ సహాయకులు నవీన్, సౌజన్య, రైతులు ఉన్నారు.

విద్యార్థులకు వేసవి శిక్షణ

గిద్దలూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): వేసవి శిక్షణ తరగతులలో భాగంగా వివిధ అంశాలపై ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. శాఖ గ్రంథాలయంలో క్యారమ్స్, చెస్ తదితర ఆటల పోటీలపై శిక్షణ ఇచ్చారు. దేశభక్తి గేయాలను నేర్పించారు. నీతి కథలను విద్యార్థులో చదివించి అర్థాన్ని తెలియజేశారు. కార్యక్రమాల్లో గ్రంథపాలకురాలు ఎన్.లక్ష్మీప్రసన్న, ఉపాధ్యాయుడు శివప్రసాద్ పాల్గొన్నారు.

పెద్ద దోర్నాల : గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా విద్యార్థులు మంగళవారం కోలాట ప్రదర్శన చేశారు.తదనంతరం నృత్యం, చిత్రలేఖనం, క్యారమ్స్‌లో శిక్షణ నిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రంథపాలకుడు వెంకట సుబ్బారెడ్డి శివ మంజులాదేవి పాల్గొన్నారు.



కోలాటం నేర్చుకుంటున్న పిల్లలు



నిర్మాణాలపై సమీక్ష నిర్వహిస్తున్న అధికారులు

క్రమబద్ధీకరణకు చర్యలు

గిద్దలూరు, మే 6 (ఆంధ్రజ్యోతి) : జీవోఎంఎస్-30 ద్వారా అభ్యంతరంలేని ప్రభుత్వ భూములలో 2019 అక్టోబరు 15లోపు నిర్మించిన నిర్మాణాలను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని డిప్యూటీ తహసీల్దార్ నాయబ్‌హుస్సేన్ పేర్కొన్నారు. రెవెన్యూ కార్యాలయంలో వివిధ శాఖల అధికారుల తో ఆయన సమావేశమయ్యారు. ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు ఉన్నవారు వాటికి సంబంధించిన కరెంటు బిల్లులు, ఇంటి పన్ను లు, నీటిపన్నుల వివరాలతో సమీప సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 300 యూనిట్ల కరెంటు బిల్లు దా టని వారు అర్హులన్నారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ శాంతకుమారి, వీఆర్‌వోలు, ప్లానింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


ధర్నాలో పాల్గొనాలి

గిద్దలూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ కోసం ఈనెల 9వ తేదీన ఒంగోలు కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాలో ఉపాధ్యాయులందరూ పాల్గొనాలని ఏపీటీఎఫ్ జోనల్ అధ్యక్షుడు సుబ్బరాయుడు ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ పాఠశాలల మనుగడను ప్రశ్నార్థంగా మారే విధానాలను ప్రతిఘటించేందుకు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు ఈ ధర్నాలో ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు పాల్గొనాలని కోరారు.

నైతిక విలువలు పెంపొందించడమే ధ్యేయం

గిద్దలూరు, మే 6 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులలో నైతిక విలువలు పెంపొందించడమే ధ్యేయంగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐవో నాయకులు పేర్కొన్నారు. స్థానిక చిన్న మసీద్‌లో ఏప్రిల్ 27వ తేదీ నుంచి జరుగుతున్న నైతిక, ఆధ్యాత్మిక, సందేశాత్మక శిక్షణ తరగతులను ఎస్‌ఐవో ఆధ్వర్యంలో ముగింపు సమావేశాన్ని నిర్వహించింది. 50 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. శిక్షణలో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐవో, ఇతర సంఘాల ప్రతినిధులు కదీర్, ఫాజిల్, ఫయాజ్ హుస్సేన్ పాల్గొన్నారు.

శ్రీసాధన కళాశాల గ్రంథాలయానికి పుస్తక వితరణ



గ్రంథాలయానికి అందించిన పుస్తకాలు

మార్కాపురం వన్‌టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : శ్రీ సాధన డిగ్రీ కళాశాలలోని గ్రంథాలయానికి పుస్తక ప్రేమికులు మంగళవారం భారీగా పుస్తక వితరణ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డా. కప్పగంతుల మధుసూదన్ మాట్లాడుతూ.. డా. సీఏ ప్రసాద్, ఆచార్య కె.నాగేశ్వర రావు, కె.శ్రీనివాసరావులు తమ కళాశాల గ్రంథాలయానికి పుస్తకాలను అందజేశారన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేల మంది విద్యార్థులు డిగ్రీ చదువు కుంటూ ప్రభుత్వ, ప్రైవేట్ రంగ పోటీ పరీక్షలలో, వివిధ రంగాల చదువులకు అవసరమైన విజ్ఞానాన్ని సంపాదించేందుకు పుస్తకాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా ఈశ్వరమ్మ వర్ధంతి

మార్కాపురం వన్‌టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : భగవాన్ సత్యసాయి బాబా మాతృమూర్తి ఈశ్వరమ్మ వర్ధంతిని ఎన్ఎస్ నగర్‌లోని సత్య బాబా ఆలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యశాలలో రోగులకు పులిహోర, రొట్టెలు, బిస్కెట్లు, పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామకృష్ణారెడ్డి, గోనుగుంట్ల శ్రీధర్, బాలచెన్నయ్య, గురుస్వామి, రూపేష్ పాల్గొన్నారు.

పొగాకును ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

గిద్దలూరు, మే 6 (ఆంధ్రజ్యోతి) : తెల్ల, నల్ల బర్లీ పొగాకును ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు బాలకోటయ్య డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన ఏరియా సమావేశంలో బాలకోటయ్య మాట్లాడుతూ గిద్దలూరు ప్రాంతంలో పొగాకు ఎక్కువగా సాగు చేసినందున మద్దతు ధర క్వింటాకు రూ.15వేలు చెల్లించి కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. నాయకులు ఆవులయ్య, పూర్ణ, నరసింహులు, థామస్ పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత

గిద్దలూరు, మే 6 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా ఉద్యోగ, కార్మిక సంఘాలు ఈనెల 20న జాతీయ స్థాయిలో సమ్మె చేస్తున్న సందర్భంగా అధికారులకు మంగళవారం సమ్మె నోటీసు అందచేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఆశా వర్కర్లు, మెప్మా రిసోర్స్‌పర్సన్స్ వారివారి శాఖల అధికారులకు 20వ తేదీన చేసే సమ్మె నోటీసులు అందచేశారు. ఆయా ఉద్యోగుల సంఘ ప్రతినిధులు ఫాతిమా, విశ్రాంతమ్మ, సరోజ మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత కార్మిక చట్టాలను సవరణ చేసి కార్మిక హక్కులను హరించే విధంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. వివిధ ప్రభుత్వ పథకాలలో పని చేస్తున్న వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం, పింఛన్‌లు అమలు చేయాలని కోరారు.

పొదిలిలో..

పొదిలి : దేశ వ్యాప్తంగా 20వ తేదీన జరిగే కార్మిక, కర్షక సమ్మెను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు పిలుపునిచ్చారు. మంగళవారం ప్రజా సంఘాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ప్రయత్నాలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఊసా వెంకటేశ్వర్లు, కేజీ మస్తాన్, జిల్లా నాయకులు కంకణాల వెంకటేశ్వర్లు, గుమ్మా బాలనాగయ్య పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రణాళిక సిద్ధం

తాళ్లూరు, మే 6(ఆంధ్రజ్యోతి): ప్రకృతిలోని ప్రతి వనరును ఉపయోగించుకుని నేలను సజీవంగా ఉంచి నాణ్యమైన ఉత్పత్తులు సాధించాలని వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు తెలిపారు. మండలంలోని తూర్పుగంగవరం రైతు సేవా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయం ఖరీఫ్ -2025 ప్రణాళిక సిద్ధం చేయడానికి మంగళవారం పొదుపు సంఘాలు, రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ట్రైనర్ జె.ప్రభాకర్ మాట్లాడుతూ 365 రోజులు భూమి పచ్చని పంటలతో ఉంచేందుకు తగిన ప్రణాళికలను వివరించారు. నవధాన్యాల కిట్‌ను తీసుకుని వేసవి ముందు పొలంలో చల్లినట్లయితే తొలకరి వర్షాలకు మొలకెత్తి సారవంతమవుతుందనితెలిపారు. ప్రకృతి సాగు మండల ఇన్‌చార్జ్ నరసింహులు మాటాడుతూ వీఏవోలు రైతులు సాగు చేసిన పంటల వివరాలను నమోదు చేయాలన్నారు. ప్రకృతి సాగు ప్రాధాన్యతను వివరిస్తూ గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీఆర్పీలు వాణి, రమేష్, రత్నం, అనంత లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.



పైపులైన్ పనులకు భూమి పూజ చేస్తున్న ఎరిక్షన్‌బాబు

పార్టీని నమ్ముకున్నవాళ్లకు సముచిత స్థానం

టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

పెద్దదోర్నాల, మే 6 (ఆంధ్రజ్యోతి) : టీడీపీని నమ్ముకొని పనిచేసేవారికి సముచిత స్థానం లభిస్తుందని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. శివ సదన్‌లో టీడీపీ సంస్థాగత కమిటీల ఎంపిక కార్యక్రమంలో భాగంగా మండల కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో నియోజకవర అభివృద్ధికి శక్తి వంచన లేకుండా పని చేస్తున్నానని, అదే విధంగా పార్టీని బలోపేతం చేసేవారికి న్యాయం జరుగుతుందన్నారు. 18వ తేదీ లోపు మండల కమిటీల ఎంపిక పూర్తి చేయాలని ఎరిక్షన్‌బాబు సూచించారు.

పైపులైను పనులకు భూమి పూజ

దోర్నాల పర్యటనలో భాగంగా సుందరయ్య కాలనీ నీటి సమస్యను పరిష్కరించేందుకు పైపులైను ఏర్పాటు పనులకు ఎరిక్షన్ బాబు భూమి పూజ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ చిత్తూరి హారిక, కార్యదర్శి శివ కోటేశ్వరరావు, ఎంపీడీవో నాసర్ రెడ్డి, టీడీపీ నాయకులు షేక్ మాబు, బట్టు సుధాకర్ రెడ్డి, దొడ్డా శేషాద్రి, ఈదర మల్లయ్య, చంటి, షేక్ సమ్మద్ భాష, చల్లా వెంకటేశ్వర్లు, షేక్ ఇస్మాయిల్, షేక్ మంజూర్ భాష, కె సుబ్బారెడ్డి,ఎలకపాటి చంచయ్య, రఫీ, మౌలాలి పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సేవలను ఉపయోగించుకోవాలి

మార్కాపురం వన్‌టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : మాతా శిశు సంరక్షణ కోసం అంగన్‌వాడీ కేంద్రాలు అందిస్తున్న సేవలను ఉపయోగించుకోవాలని సీడీపీవో సుశీలాదేవి అన్నారు. కిశోర వికాసం వేసవి శిక్షణలో భాగంగా తూర్పువీధిలో గల అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సుశీలాదేవి మాట్లాడుతూ.. కిశోర బాలికలంతా చదువుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. బాల్య వివాహాలు చేయడం నేరమన్నారు. వివిధ ఆటల పోటీలు నిర్వహించి బహుమతులను అందించారు. సూపర్‌వైజర్ బుజ్జి, రవికుమారి, అంగన్‌వాడీలు, ఆశాలు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : అంగన్వాడీ కేంద్రాల్లో పాఠశాల సంసిద్ధత ఉత్సవాన్ని ఎంఈవో ఆంజనేయులు, సీడీపీవో ఎం.పద్మావతి మంగళవారం ఎర్రగొండపాలెంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల సంసిద్ధత ర్యాలీని ఎర్రగొండపాలెంలోని ప్రధాన వీధులలో నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాల్లో, పాఠశాల సంసిద్ధత ఉత్సవ ప్రాముఖ్యతపై తల్లిదండ్రులు, గ్రామస్థులకు ఆహ్వాన పత్రికలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ వెంకట్రావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మజ, కేవీ సుబ్బమ్మ, హైమావతి, మరియకుమారి, పాధ్యాయులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ కోసం సమర్థవంతంగా పనిచేయాలి

గిద్దలూరు టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): గ్రామ స్థాయిలో పార్టీ పటిష్టతకు సమర్థంతంగా కృషి చేయాలని టీడీపీ నాయకులు ముత్తుముల కృష్ణకిశోర్ రెడ్డి అన్నారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని మండల ముఖ్యనాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ తమ పరిధిలో సమర్థవంతంగా పనిచేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలని, పథకాలు అర్హులకు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీల అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి, కే యోగానంద్, తోట శ్రీనివాసులు, బోనేని వెంకటేశ్వర్లు, వడ్లమూడి ఆంజనేయులు, సయ్యద్ షానేషావలి, నాయకులు పూనూరు భూపాల్‌రెడ్డి, బైలడుగు బాలయ్య, కేతం శ్రీనివాసులు, ముత్తుముల సంజీవరెడ్డి, గుంటక నరసింహ, సొసైటీ బ్యాంక్ చైర్మన్లు గోపిరెడ్డి జీవన్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేత కృష్ణకిశోర్‌రెడ్డి

వైభవంగా వాసవీ మాత జయంతి ఉత్సవాలు



వాసవీ మాత మూలవిరాట్

మార్కాపురం వన్‌టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం పట్టణంలోని వెలసిన శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో వాసవీ మాత జయంతి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా అర్చకులు మంగళవారం అమ్మవారి మూలవిరాట్‌కు సుప్రభాత సేవ, క్షీరాభిషేకం, సహస్ర నామార్చన, వెండి చీర అలంకరణ కార్యక్రమాలు నిర్వహించారు. సామూహిక కుంకుమార్చన, వాసవీ పారాయణం, లలిత సహస్ర నామస్తోత్ర పారాయణం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, కార్యదర్శి సూరె సుబ్బారావు, కోశాధికారి రామడుగు రమేష్, సభ్యులు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

ఘనంగా సీతా నవమి

మార్కాపురం వన్‌టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం పట్టణంలో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూ బజార్‌లోని పాండురంగ స్వామి ఆలయంలో సీతా నవమి (సీతమ్మ పుట్టినరోజు) కార్యక్రమం మంగళవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో సీతా మాతను ఆదర్శంగా తీసుకుని ఇలా ఉండాలి కుటుంబ విలువలు పిల్లలకు ఎలా తెలియజేయాలని వీహెచ్‌పీ మార్కాపురం జిల్లా దుర్గా వాహిని సంయోజక అపర్ణ తెలిపారు. సమాజ శ్రేయస్సు కోసం మహిళలు ముందుకు రావాలన్నారు. ప్రతి మహిళా కొంత సమయాన్ని కేటాయించాలన్నారు. కార్యక్రమంలో గుంటక వనజాక్షి, నారాయణం లావణ్య, వరలక్ష్మి, ప్రసన్న, రాధారాణి పాల్గొన్నారు.



వేడుకలను నిర్వహిస్తున్న మహిళలు

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

వ్యవసాయ పరికరాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి



వ్యవసాయ యంత్రాలను రైతులకు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తున్నదని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి స్పష్టం చేశారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో రైతులకు వ్యవసాయ పరికరాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలకరి చినుకులు పడగా రైతులకు పెట్టుబడి సహాయం కింద రూ.7వేలను ప్రభుత్వం అందిస్తుందన్నారు. తరువాత రెండు విడతల్లో రూ.7వేలు, రూ.6వేలను అందిస్తుందని తెలిపారు. వైసీపీ పాలనలో రైతులకు చేసిందేమీ లేదని, పంట నష్టం అందించిన దాఖలాలు లేవన్నారు. 96 రకాల వ్యవసాయ పరికరాలను నియోజకవర్గంలో సబ్సిడీపై రైతులకు అందించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, వ్యవసాయ సహాయ సంచాలకులు బాలాజీనాయక్, సొసైటీ బ్యాంక్ చైర్మన్ దుత్తా బాలీశ్వరయ్య, మండల పార్టీల అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి, సయ్యద్ షానేషావలి, బోనేని వెంకటేశ్వర్లు, సోరెడ్డి మోహన్‌రెడ్డితోపాటు టీడీపీ నాయకులు బైలడుగు బాలయ్య, పూనూరు భూపాల్‌రెడ్డి, గోడి ఓబులరెడ్డి, రైతు సంఘం అధ్యక్షులు బిజ్జం రవీంద్రరెడ్డి, కేతం శ్రీను, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నారాయణ

సీపీఐ మహాసభలను జయప్రదం చేయండి

ఎర్రగొండపాలెం, మే 6 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ రాష్ట్రమహాసభలు ఆగస్టు 20 నుంచి 24 వరకు ఒంగోలు జరుగనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ తెలిపారు. రాష్ట్ర మహాసభల ప్రోత్సాహక సన్నాహక సమావేశాన్ని మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. మహాసభలను విజయవంతం చేయాలని నారాయణ కోరారు. కార్యక్రమంలో సీపీఐ కార్యదర్శి డి శ్రీనివాస్, సీపీఐ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య, కేవీ కిష్టగౌడ్ పాల్గొన్నారు.



మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న గౌతంరాజు

ఆర్టీసీ బస్టాండ్‌లో చలివేంద్రం ఏర్పాటు

పెద్ద దోర్నాల, మే 6 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్టాండు ఆవరణలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎర్రగొండపాలెం జనసేన పార్టీ ఇన్‌చార్జి, ఏపీ టూరిజం డైరెక్టర్ డాక్టర్ పాకనాటి గౌతం రాజు మంగళవారం ప్రారంభించి మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయనను స్థానిక జనసేన పార్టీ నాయకులు శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింతగుంట్ల మల్లికార్జునరావు, కమ్మా వెంకటేశ్వర్లు, చల్లాగిరి, కేవీ నాయుడు, ఫణీంద్ర, రాహుల్, కిట్టు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణోత్సవం

తర్లుపాడు, మే 6 (ఆంధ్రజ్యోతి) : తర్లుపాడులోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవం సందర్భంగా స్వామి వారికి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఉదయం 11 గంటలకు ఆలయ ప్రధానార్చకులు అలుగు వీరబ్రహ్మం ఆధ్వర్యంలో గోవిందాంబ సమేత శ్రీ మద్విరాట్ వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణ మహోత్సవాన్ని చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తిలకించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

దర్శి, మే 6(ఆంధ్రజ్యోతి): సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షుడు కె.శింకరరామిరెడ్డి విజ్ఞప్తి చేశారు. దర్శిలో జరిగే మహాసభల కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 21, 22, 23 తేదీల్లో మూడు రోజుల పాటు దర్శిలో సీపీఐ జిల్లా మహసభలు జరుగుతాయని చెప్పారు. ఈ మహాసభలకు జిల్లా వ్యాప్తంగా అధికసంఖ్యలో కార్యకర్తలు, నాయకులు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మాడపాకుల రమేష్‌బాబు, హనుమంతరావు, ఆర్.కరుణానిధి, ఎస్. రామాంజియాదవ్, ఎస్.శ్రీనివాసరావు, కల్లూరి పెద్ద ఆంజనేయులు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతిరైతు ఫార్మర్ ఐడీ చేసుకోవాలి

దొనకొండ, మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రతిరైతు తప్పనిసరిగా ఫార్మర్ ఐడీ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ స్పష్టం చేశారు. మంగళవారం మండలంలోని మల్లంపేట, వల్లపునేనిపల్లి గ్రామాల్లో ఫార్మర్ ఐడీ నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 9243 మంది రైతులకు గాను 5063 మందికి ఫార్మర్ ఐడీలను ఆన్‌లైన్‌లో రైతు సేవా కేంద్రం సిబ్బంది నమోదు చేసినట్లు తెలిపారు. ఇంకా 4180 మంది రైతులు ఫార్మర్ ఐడీ చేయించుకోవాలని తెలిపారు. వెంటనే రైతుసేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మట్టి నమూనాలు సేకరించాలి

పామూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో 1058 మట్టి నమునాలు సేకరించడమే లక్ష్యమని ఏడీఏ వెంకటరమణ తెలిపారు. ఒక్కో ఆర్‌ఎస్‌కే పరిధిలో 60 మట్టినమూనాలు సేకరించాలన్నారు. మంగళవారం మండలంలోని దూబగుంట ఆర్‌ఎస్కే పరిధిలో రైతులకు భూసార పరీక్షల ప్రాముఖ్యత గురించి ఆయన వివరించారు. భూసార పరీక్షలతో నాణ్యమైన అధిక దిగుబడులు పొందవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో ఏవో కె.రాధ, ఏఈవో నగేష్, వీపీఏ బి.అవినాష్, మాజీ సర్పంచ్ పి.వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు జరిపితే కఠినచర్యలు

సీఎస్‌పురం(పామూరు), మే 6 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు జరిపితే చట్టపరమైన చర్యలు తప్పవని ఐసీపీఎస్ లీగల్ అధికారి రత్నప్రసాద్ తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సీడీపీవో దేవకృపావరం అధ్యక్షతన మహిళా పోలీసులకు, ఎంపీహెచ్‌లు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు, వీవోఏ లకు కిశోరి వికాసంంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రత్న ప్రసాద్ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో గ్రామాల్లో కిశోరి బాలికలను గుర్తించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ వెంకటలక్ష్మి, షేక్ నాయబ్‌రసూల్, తదితరులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత

పామూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఈనెల 20న జరగనున్న సార్వత్రిక సమ్మెలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని సీఐటియు జిల్లా కార్యదర్శి కొమ్మలపాటి మాల్యాద్రి పిలుపునిచ్చారు. కార్మికులకు కనీసవేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కార్మిక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని తదితర డిమాండ్‌లతో సమ్మె చేస్తున్నట్టు తెలిపారు. ఈసందర్భంగా అంగన్‌వాడీలు సూపర్‌వైజర్ జి.పద్మజకు, ఆశా కార్యకర్తలు డాక్టర్ విజయకుమార్‌కు, సివిల్ సప్లయిస్ ముఠా కార్మికులు తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ అజయ్‌కుమార్‌కు, పంచాయతీ కార్మికులు కార్యదర్శి జీవీ అరవిందకు మంగళవారం సమ్మె నోటీసులు అందజేశారు.

కళారూపాలతో అంటువ్యాధులపై అవగాహన

పామూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని ఈవోపీఆర్డీ బీవీ అరవిందారెడ్డి అన్నారు. కళాజాత రూపాల్లో కళాకారులు పామూరు పంచాయతీ ఆధ్వర్యంలో స్థానిక మమ్మీడాడి సెంటర్‌లో అంటువ్యాధులపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా కళాకారులు ప్రదర్శించిన బుర్రకథ ప్రజలకు ఆకట్టుకుంది. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి రజనీకాంత్, రత్నకుమార్, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

నేడు వాసవీ జయంతి

దొనకొండ, మే 6(ఆంధ్రజ్యోతి): దొనకొండలోని శ్రీపట్టాభిరాములు వారి దేవాలయంలో బుధవారం శ్రీ వాసవీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘం కార్యనిర్వాహకులు తెలిపారు. ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవతో ప్రత్యేక పూజలు ప్రారంభమవుతాయని తెలిపారు. అనంతరం మంగళ వాయిద్యాలతో హంస వాహనంపై పురవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నప్రసాద కార్యక్రమం జరుగుతుందన్నారు. మండలంలోని అన్నిగ్రామాలకు చెందిన ఆర్యవైశ్యులందరూ ఈ వేడుకల్లో పాల్గొని జయప్రదం చేసి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు విజ్ఞప్తి చేశారు.

దర్శిలో నిలిచిన తాగునీటి సరఫరా

- పైప్‌లైన్లు పగలడంతో అంతరాయం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



దర్శి పట్టణంలో ఓవర్‌హెడ్ ట్యాంకు ట్యాపు వద్ద నీటిని పట్టుకుంటున్న ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు



దర్శి-కురిచేడు రోడ్డులో పది అడుగుల లోతులో పగిలిన పైపులైన్‌కు మరమ్మతులు

దర్శి, మే 6(ఆంధ్రజ్యోతి): ఎన్‌ఏపీ రక్షిత మంచినీటి పథకం ప్రధాన పైపులైన్లు పగిలిపోవటంతో ప్రజలు తీవ్ర తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా దర్శి పట్టణంలోని అనేక ప్రాంతాలకు ఎన్‌ఏపీ నీరు అందటం లేదు. దీంతో ఇతర ప్రాంతాల ప్రజలు దర్శి పట్టణంలోని తూర్పుచౌటపాలెం రోడ్డులోని ఒవర్‌హెడ్ ట్యాంకు వద్దకు వచ్చి ట్యాపు వద్ద మంచినీళ్లు పట్టుకొని వెళ్తున్నారు. సుమారు 45 సంవత్సరాల క్రితం నిర్మించిన పైపులైను సామర్థ్యం కోల్పోయి పగిలిపోతున్నాయి. కురిచేడు రోడ్డులో పది అడుగుల లోతులో ఉన్న పగిలిన పైపులైన్ గుర్తించి ఎట్టకేలకు మరమ్మతులు చేశారు. దర్శి-పొదిలి రోడ్డులో పగిలిన పైపులైన్‌కు మరమ్మతులు చేశారు. ఒకచోట మరమ్మతులు చేసేలోపు మరోచోట పగులుతుండటంతో సిబ్బంది పగిలిన పైపులైన్ ప్రదేశాన్ని కనుగొనేందుకు నానా అవస్థలు పడాల్సి వస్తుంది. పైపులైన్ పగిలిన ప్రతిసారి రోజులు తరబడి మంచినీటి సరఫరా నిలిచిపోవటంతో దర్శి పట్టణంతో పాటు అనేక గ్రామాల ప్రజలు తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. ఈ వేసవిలో మంచినీరు అందుబాటులో లేకపోతే ప్రజలు మరింత ఇబ్బంది పడాల్సి వస్తుంది. అధికారులు తాగునీటి సమస్య తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

చెత్త నుంచి సంపదకు కార్యాచరణ

- కేంద్రాల్లో సేంద్రియ ఎరువుల తయారీ
- పంచాయతీలకు ఆదాయం



చెత్త సంపద కేంద్రంలో వర్మిని చల్లుతున్న ఈవోఆర్డీ ఆదాం షఫీ, గ్రామ కార్యదర్శి కృష్ణమూర్తి

దొనకొండ, మే 6(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో చెత్తనుంచి సంపద సృష్టించేందుకు టీడీపీ కూటమి ప్రభుత్వం చొరవతో ఇప్పుడిప్పుడే అడుగులు ముందుకు పడుతున్నాయి. 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం చెత్తనుంచి సంపద సృష్టించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈమేరకు అన్నీ గ్రామ పంచాయతీల్లో చెత్త సంపద కేంద్రాలు నిర్మించి తడి, పొడి చెత్తను సేకరిస్తారు. వీటి ద్వారా సేంద్రియ ఎరువును తయారుచేసి గ్రామ పంచాయతీలకు కొంత మేర ఆదాయం చేకూర్చేలా కార్యాచరణ రూపొందించారు. తదనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం సంపద తయారీకేంద్రాలను పక్కన పడేయటంతో నిరుపయోగంగా మారాయి.

ప్రస్తుతం అధికారం చేపట్టిన టీడీపీ కూటమి ప్రభుత్వం చెత్తనుంచి సంపదను సృష్టించేందుకు కార్యచరణ సిద్ధం చేయటంతో మళ్లీ ఆకేంద్రాలు జీవం పోసుకుంటున్నాయి. చెత్త నుంచి సంపద సృష్టించేందుకు అడుగులు ముందుకు పడుతున్నాయి. ఈమేరకు దొనకొండలోని చెత్తసంపద కేంద్రానికి గ్రామ కార్యదర్శి కృష్ణమూర్తి చుట్టూ రక్షణగా ఐరన్ మెష్ ఏర్పాటుచేయించారు. కేంద్రంలోని తొట్లలో ఆకులు, పేడ, ఇతర వ్యర్థాలను ఇళ్ల నుంచి సేకరించిన వ్యర్థాలను మూడు లేయర్లు వేసి వాటిపై ఇతర ప్రాంతాల నుంచి తెప్పించిన వర్మీ చల్లించారు. దానిపై పట్టలు కప్పి సేంద్రియ ఎరువు తయారీకి చర్యలు చేపట్టారు. మండలంలో మరికొన్ని గ్రామ పంచాయతీల్లోనూ సేంద్రియ ఎరువు తయారీకి చర్యలు చేపట్టారు.

ఈసందర్భంగా దొనకొండ గ్రామ కార్యదర్శి పొట్ల కృష్ణమూర్తి మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్య కార్మికుల ద్వారా చెత్తను సేకరించి దాని నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తాం. ఆతర్వాత చెత్త సంపద కేంద్రంలో వ్యర్థాలతో సేంద్రియ పద్ధతిలో వానపాములతో ఎరువుల తయారీకి చర్యలు చేపట్టామన్నారు. ఈఎరువుపై రైతులకు అవగాహన కల్పించి తక్కువ ధరకు ఇస్తాం. దీనిద్వారా గ్రామ పంచాయతీకి కొంతమేర ఆదాయం చేకూరుతుందని తెలిపారు.

మండుతున్న ఎండలు

- బయటకు రావాలంటే భయపడుతున్న ప్రజలు
- నిర్మానుష్యంగా రోడ్లు



పామూరులో నిర్మానుష్యంగా రహదారి

పామూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): ప్రపంచభానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. రోహిణి కార్తె రాక ముందే ఎండలు మండుతున్నాయి. గత వారం రోజుల నుంచి విపరీతమైన వడగాలులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఏదైన ముఖ్యమైన అవసరాలు ఎంటే తప్ప ప్రజలు బయటకు రావడం లేదు. దాంతో పట్టణంలోని ప్రధాన రోడ్లన్నీ జన సంచారం లేక నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఒకవైపు ఎండ వేడిమి, మరో వైపు ఉక్కపోతతో అల్లాడుతున్నారు. ఉదయం పది గంటలకే ఎండ తీవ్రత అధికమవుతుండటంతో ప్రజలు రోడ్లపైకి రావాలంటేనే భయపడుతున్నారు. రాత్రి 7 గంటల వరకు వడగాలుల ప్రభావం కనిపిస్తుంది.

ఈ ఏడాది ఎండలు ముందుగానే ప్రారంభమవడంతో వృద్ధులు, చిన్నపిల్లలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ప్రయాణాలు చేసేవారు ఎక్కువగా తెల్లవారు జామున, సాయంత్రం పూట చేస్తున్నారు. వేసవిలో ఎక్కువ సేపు తిరగకుండా అత్యవసర పని ఉంటేనే ప్రజలు బయటకు వస్తున్నారు. అత్యవసర పనిమీద బయటకు వస్తే గొడుగుగాని, టోపీగాని ధరించాలని వైద్యులు సూచిస్తున్నారు. పలుచటి వస్త్రాలు ధరించాలన్నారు. మంచినీరు, మజ్జిగ ఎక్కువగా తీసుకుంటే వడదెబ్బ బారి నుండి తప్పించుకోవచ్చునని వైద్యులు సూచిస్తున్నారు.

లింగన్నపాలెంలో ఎంఎస్‌ఎంఈ పార్క్

- నేడు శంకుస్థాపన
- పాల్గొననున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి



ఎంఎస్‌ఎంఈ పార్క్‌కు కేటాయించిన భూమి

పీసీపల్లి, మే 6(ఆంధ్రజ్యోతి): ప్రతి నియోజకవర్గంలో యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు పరిశ్రమలు ఏర్పాటుచేయాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇందులోభాగంగా ఎంఎస్‌ఎంఈ పార్క్‌లను ఏర్పాటుచేస్తుంది. జిల్లాలో కనిగిరి నియోజకవర్గంతో పాటు మార్కాపురం నియోజకవర్గం కలుజువ్వలపాడు, దర్శి నియోజకవర్గం చందలూరులో పార్క్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతిచ్చింది. కనిగిరి నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు శాసనసభ్యుడు డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి సూచన మేరకు పీసీపల్లి మండలం పెదయిర్లపాడు రెవెన్యూలో గల లింగన్నపాలెం గ్రామ సమీపంలో ఎంఎస్‌ఎంఈ పార్క్ ఏర్పాటు చేసేందుకు ఏపీఐఐసీ సన్నద్ధమైంది. ఎంఎస్‌ఎంఈ(మైక్రో, స్మాల్ , మీడియం ఎంటర్‌ప్రైజెస్)పార్క్ ఏర్పాటుకు సర్వేనెంబరు 1459లో 20ఎకరాల భూమిని రెవెన్యూ అధికారులు ఏపీఐఐసీకి అప్పజెప్పారు. ఇక్కడ రూ.7 కోట్లతో ఎంఎస్‌ఎంఈ పార్క్ ఏర్పాటు చేయనున్నారు. బుధవారం ఎంఎస్‌ఎంఈ పార్క్ ఏర్పాటుకు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర, పరిశ్రమల శాఖ అధికారులు శంకుస్థాపన చేయనున్నారు. ఇందుకుసంబంధించి మంగళవారం ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ స్వర్ణలత, ప్రాజెక్టు ఇంజనీర్ మహేంద్రలు అక్కడ జరుగుతున్న భూమి చదునుచేసే పనులను పరిశీలించి శంకుస్థాపనకు ఏర్పాట్లు చేయించారు.

ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలి

- డీఎస్పీ సాయిఈశ్వర్‌యశ్వంత్



ట్రాఫిక్ సిబ్బందికి కూలింగ్ గ్లాస్‌లు పంపిణీ చేసిన డీఎస్పీ

కనిగిరి, మే 6 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని డీఎస్పీ సాయిఈశ్వర్‌యశ్వంత్ అన్నారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో మంగళవారం ట్రాఫిక్ సిబ్బందికి వైట్‌హ్యాట్, కూలింగ్ గ్లాస్‌లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ఎండలకు సిబ్బంది ఇబ్బందులు పడకుండా వీటిని ఇచ్చినట్టు చెప్పారు. పట్టణంలోని ప్రధాన సెంటర్లలో రోడ్డు ఆక్రమణలను ఎప్పటికప్పుడు క్లియర్ చేయాలని ఆదేశించారు. షాపులకు వచ్చే వివిధ రకాల వస్తువులను ఊరి బయట గోడౌన్‌లలో ఏర్పాటుచేసుకుని చిన్న, చిన్న వాహనాల్లో రాత్రి పది గంటల తర్వాత షాపులకు తరలించుకునేలా యజమానులకు సూచనలు ఇవ్వాలన్నారు. రోడ్డుపక్కన ఉన్న తోపుడు బండ్లు ఒకేచోట ఉంచకుండా వారు సంచరిస్తూ అమ్ముకునేలా చర్యలు తీసుకోవాలని సీఐ ఖాజావలి, ఎస్‌ఐ శ్రీరాంను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలన్నారు. విధి నిర్వహణలో ఉత్తమంగా వ్యవహరించి ప్రజామన్ననలు పొందే సిబ్బందికి శాఖాపరంగా గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీఐ ఖాజావలి, ఎస్‌ఐ శ్రీరాం, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

పామూరులో భారీవర్షం

పామూరు మే 6 (ఆంధ్రజ్యోతి) : పామూరు, సీఎస్‌పురం మండలాల్లో మంగళవారం సాయంత్రం ఉరుములు మెరుపులు, గాలులతో కూడిన భారి వర్షం కురిసింది. పామూరు పట్టణంలోని పలు ప్రాంతాల్లో రోడ్లపై నీరు ప్రవహించింది. పగలంతా ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు రాత్రి వర్షంతో ఉపశమనం పొందారు. ముందుగా గాలులు వీచడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సుమారు గంటపాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో డ్రైనేజీల్లోని మురికినీరు రోడ్లపై ప్రవహించింది. లోతట్టు ప్రాంతాల్లో వర్షంనీరు ఇళ్లలోకి చేరింది. పట్టణంలో పలుచోట్ల ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు గాలుల దాటికి నెలకొరిగాయి. గంటసేపు ప్రజాజీవనం స్తంభించింది. రాత్రి 8 నుంచి 9 గంటల వరకు వర్షం కురిసింది.



పామూరులో వర్షానికి రోడ్లపై ప్రవహిస్తున్న నీరు



గంగమ్మ తల్లికి పూజలు చేస్తున్న డాక్టర్ లక్ష్మి, లలిత్‌సాగర్ దంపతులు

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

తాళ్లూరు, మే 6(ఆంధ్రజ్యోతి): పవిత్ర పుణ్యక్షేత్రం గుంటిగంగ ఆలయంలోని గంగమ్మ తల్లిని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. రాజంపల్లికి చెందిన టీడీపీ నేత గంగమ్మ తల్లికి మొక్కుబడి కార్యక్రమం చేపట్టగా, వారు పాల్గొన్నారు. బ్రాహ్మణ పూజారి కామేశ్వరశర్మ డాక్టర్ లక్ష్మి, లలిత్ సాగర్ దంపతుల గోత్రనామ పూజలు నిర్వహించారు. ఈవో వాసుబాబు డాక్టర్ లక్ష్మికి గంగమ్మ చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, సానె సాయి, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రణాళిక సిద్ధంచేయాలి

తాళ్లూరు, మే 6(ఆంధ్రజ్యోతి): ప్రకృతిలోని ప్రతి వనరును ఉపయోగించుకుని నేలను సజీవంగా ఉంచి నాణ్యమైన ఉత్పత్తులు సాధించాలని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు తెలిపారు. మండలంలోని తూర్పుగంగవరం రైతు సేవా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయం ఖరీఫ్ -2025 ప్రణాళిక సిద్ధం చేయడానికి మంగళవారం పొదుపు సంఘాలు, రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ట్రైనర్ జె.ప్రభాకర్ మాట్లాడుతూ 365 రోజులు భూమి పచ్చని పంటలతో ఉంచేందుకు తగిన ప్రణాళికలను వివరించారు. నవధాన్యాల కిట్‌ను తీసుకుని వేసవి ముందు పొలంలో చల్లినట్లయితే తొలకరి వర్షాలకు మొలకెత్తి సారవంతమవుతుందనితెలిపారు. ప్రకృతి సాగు మండల ఇన్‌చార్జ్ నరసింహులు మాట్లాడుతూ వీఏవోలు రైతులు సాగు చేసిన పంటల వివరాలను నమోదు చేయాలన్నారు. ప్రకృతి సాగు ప్రాధాన్యతను వివరిస్తూ గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీఆర్పీలు వాణి, రమేష్, రత్నం, అనంత లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రం పరిశీలన

పీసీపల్లి,మే6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెళ్ల గ్రామంలో మంగళవారం చెత్తసంపద కేంద్రాన్ని ఎంపీడీవో ప్రభాకరశర్మ, డిప్యూటీ ఎంపీడీవో రాంప్రసాద్ పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నాడప్ తొట్లలో తడి, పొడి చెత్తలను వేరుగా వేయాలన్నారు. ప్రతిరోజు చెత్తసంపద కేంద్రాన్ని పరిశీలించాలని పంచాయతీ కార్యదర్శి షర్మిలను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

అలాగే, ఐవీఆర్‌ఎస్ కాల్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. మండలంలోని కొన్ని గ్రామాల నుంచి కొంతమంది లబ్ధిదారులు ఎన్నిసార్లు ఐవీఆర్‌ఎస్ కాల్స్ వచ్చినా ఒకేలా తప్పుగా జవాబు ఇస్తుండడంతో విచారించాలని ఉన్నతాధికారుల నుంచి ఎంపీడీవోకు ఆదేశాలు వచ్చాయి. దీంతో ఎంపీడీవో ప్రభుత్వ పథకాలు పొందుతున్న లబ్ధిదారులకు ఐవీఆర్‌ఎస్ కాల్స్ వచ్చినప్పుడు ఇవ్వాల్సిన సమాధానాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

కేంద్ర విధానాలను కార్మికులు వ్యతిరేకించాలి

కనిగిరి, మే 6 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా అమలుచేస్తున్న, అనుసరిస్తున్న విధానాలపై గళమెత్తాలని సీఐటీయూ నాయకుడు కేశవరావు అన్నారు. మంగళవారం స్థానిక సుందరయ్య భవనంలో జరిగిన సీఐటీయూ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 20న జరిగే సమ్మెను జయప్రదం చేయాలన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ విధానాలను నిరసిస్తూ దేశ వ్యాప్తంగా సమ్మె నిర్వహించనున్నట్టు చెప్పారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు నరేంద్ర, సీహెచ్ ప్రసాద్, ఏడుకొండలు, ప్రసన్న, శాంతకుమారి, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వీల్‌చైర్లు పంపిణీ



దివ్యాంగులకు వీల్‌చైర్లు పంపిణీ చేస్తున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ, సీఐ రామారావు, పాల్గొన్న సభ్యులు

దర్శి, మే 6(ఆంధ్రజ్యోతి): దర్శి రోటరీక్లబ్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు మంగళవారం సాయంత్రం వీల్‌చైర్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ, సీఐ వై.రామారావు ఆరుగురు దివ్యాంగులకు వీల్‌చైర్లు పంపిణీ చేశారు. ఇద్దరు మహిళలకు కుట్టుమిషన్లు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రోటరీక్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపట్టటం, పేదలకు అండగా నిలవటం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు పి.కోటేశ్వరరావు, కార్యదర్శి ఏ.నారాయణరెడ్డి, సభ్యులు సానికొమ్ము తిరుపతిరెడ్డి పేరెడ్డి, దుర్గారెడ్డి, శివకోటిరెడ్డి, రెడ్డిమాసు శ్రీనివాసులు, సత్యనారాయణరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దర్శిలో టీడీపీ కమిటీల ఎంపిక

దర్శి, మే 6(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలో టీడీపీ కమిటీల ఎంపిక దాదాపు పూర్తయింది. మంగళవారం ఆరో వార్డు అధ్యక్షుడిగా పఠాన్ సుభాని, ఉపాధ్యక్షుడిగా దశరథరామయ్యను ఎంపిక చేశారు. నూతనంగా ఎన్నికైన సభ్యులను నియోజకవర్గ నాయకుడు డాక్టర్ లలిత్‌సాగర్ అభినందించారు.

కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, పుల్లల చెరువు చిన్నా, యాదగిరి వాసు, దారం సుబ్బారావు, శోభారాణి, జూపల్లి కోటేశ్వరరావు, ఫణిదపు వెంకటరావు, శివసోములు తదితరులు పాల్గొన్నారు.

నేడు వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన

దొనకొండ, మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరవల్లిపాడు గ్రామంలోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవాల యంలో ఆరాధన మహోత్సవ వేడుకలు బుధవారం వైభవంగా నిర్వహించేందుకు అన్నిఏర్పాట్లు చేశారు. బ్రహ్మంగారి మాలధారణ చేపట్టిన స్వాములు మంగళ వారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఇరుముడులు కట్టుకొని బ్రహ్మంగారి మఠానికి బయలుదేరారు. తెలుగుదేశం పార్టీకి చెందిన మూడు విద్యుత్ ప్రభలు, వైసీపీకి చెందిన ఒక విద్యుత్ ప్రభ ఏర్పాటుచేసి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

పామూరులో.. పామూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): పామూరు పట్టణంలోని విరాట్‌నగర్ కాలనీలోగల శ్రీగోవిందమాంబ సమేత జగద్గురు వీరబ్రహ్మేంద్ర స్వాములవారి 332వ ఆరాధన గురుపూజ మహోత్సవాలు బుధవారం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన నిర్వాహకులు తెలిపారు. ఉదయం విశేషపూజా కార్యక్రమాలు, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం గ్రామోత్సవం జరుగుతుందని తెలిపారు.

పీసీపల్లిలో.. పీసీపల్లి, మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పడమటిపల్లి, మలినేనివారిపల్లి గ్రామాల పరిధిలో ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో బుధవారం ఆరాధన మహోత్సవం నిర్వహిస్తున్నారు. మంగళవారం వీరబ్రహ్మేంద్రస్వామి గోవిందమాంబల కల్యాణం నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వ హించారు. ఉపాధి కోసం వలస వెళ్లినవారంతా ఈ ఆరాధనా మహోత్సవం సందర్భంగా రెండురోజులు ముందుగానే గ్రామాలకు చేరు కున్నారు.



ఉష్ణోగ్రత (అంచనా)

7-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	39	27
తెనాలి	38	27
నరసరావుపేట	39	27
బాపట్ల	37	27
రెంటచింతల	39	27
చీరాల	37	27

బర్లీ కొనేవారేరి?



● ఉప్పుటూరు గ్రామంలో పొగాకు బేళ్లు

◆ సరైన ధర లేక రైతుల ఆవేదన
◆ కొనుగోళ్లకు ముందుకు రాని వ్యాపారులు
◆ మూడు జిల్లాల్లో 96 వేల ఎకరాల సాగు
◆ ఆదుకోవాలని బర్లీ పొగాకు రైతుల వేడుకోలు

(బాపట్ల,పర్చూరు ఆంధ్రజ్యోతి)

ఆశాజనకంగా దిగుబడులు.. మార్కెట్‌లో మంచిధర.. సంప్రదాయ పంటల సాగుతో పోల్చుకుంటే లాభాలతో.. ఇటు బాపట్ల జిల్లాలో అత్యధికంగా, అటు పల్నాడు, గుంటూరు జిల్లాలో కొంతమేర రైతులు ఈ సీజన్‌లో బర్లీ పొగాకు సాగు బాట పట్టారు. పత్తి, మిర్చి పంటల సాగుకు ఎక్కువ పెట్టుబడి అవుతుండడంతో పాటు దిగుబడులు అంతంతమాత్రంగా ఉండడంతో వాటిని కాదని బర్లీ సాగు వైపు పెద్దసంఖ్యలో రైతులు ఆకర్షితులయ్యారు. ఈ పరిస్థితుల్లో గతేడాదితో పోలిస్తే సాగు రెట్టింపయినట్లు గణాంకాలు చెబుతున్నాయి. గంపెడాశలతో సాగు చేపట్టిన రైతులు ప్రస్తుతం బర్లీ పొగాకు కొనే దిక్కు లేక అల్లాడుతున్నారు. గడచిన రెండేళ్లతో పోలిస్తే దిగుబడుల్లో 30 శాతం క్షీణత నమోదు కాగా ధర అమాంతం సగానికి సగం పడిపోవడంతో రైతుల కుదేలయ్యారు. ధర విషయంలో పరిష్కారం చూపి ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. పర్చూరు మండలం వీరన్నపాలెం గ్రామానికి చెందిన పొగాకు కౌలు రైతు ఒకరు మంగళవారం ఆత్మహత్య చేసుకోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ప్రభుత్వం ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యమని రైతులు వాపోతున్నారు.

గతేడాది క్వింటా రూ.16,000 వరకు

గతేడాది బ్లాక్, వైట్ బర్లీ పొగాకు ధర క్వింటా రూ.16,000 వరకు పలికింది. వ్యాపారులు అడ్వాన్సులు ఇచ్చి మరీ బుక్ చేసుకున్నారు. ఈ నేపథ్యంలో రైతులు ఇతర పంటలను కాదని బర్లీ పొగాకు సాగు వైపు గణనీయంగా మళ్లడంతో పొగనారుకు పెద్దఎత్తున డిమాండ్ కూడా ఏర్పడింది. గతేడాది బాపట్ల జిల్లాలో బర్లీ సాగు 40,000 ఎకరాలకు పరిమితమైతే ఈ ఏడాది అది దాదాపు 70,000 వరకు పెరిగింది. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో సైతం 26,000 ఎకరాల వరకు సాగైంది. ప్రస్తుతం 96 వేల ఎకరాల్లో దిగుబడులు వస్తున్నాయి. అయితే ధర క్వింటాలకు పదివేలకు దిగువనే ఉంది. పైగా దిగుబడులు కుచించుకుపోవడం, అకాల వర్షాలు గోరుచుట్టు మీద రోకలిపోటులా మారడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. అయినకాడికి అమ్ముకుందామన్నా వ్యాపారులు కన్నెత్తి చూడటంలేదని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం తీసుకునే చర్యల మీదే ఆశతో రైతులు ఎదురుచూస్తున్నారు.

ప్రభుత్వ ఆదేశాలు పట్టని వ్యాపారులు

బర్లీ పొగాకు, నాటు పొగాకు తమ పరిధిలోకి రావని పొగాకు బోర్డు చేతులెత్తేసింది. రైతులను ఆయా కంపెనీల దయదాక్షిణ్యాల మీదనే వదిలేసింది. వర్జీనియా పొగాకు సాగు చేస్తున్న రైతులకు టుబాకో బోర్డు కొన్ని ప్రత్యేక రక్షణలు కల్పిస్తున్నది. కానీ అవేవీ కూడా బర్లీ పొగాకు రైతులకు వర్తించకపోవడమే ప్రస్తుత దుస్థితికి కారణంగా ఉంది. పొగాకు బోర్డు చేతులెత్తేయడంతో రెండు వారాల క్రితమే ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఆయా కంపెనీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి రైతులకు న్యాయం చేయాలని సూచించింది. కానీ క్షేత్రస్థాయిలో ఆ నిర్ణయాలు అమలు చేయడంతో వ్యాపారుల నిర్లక్ష్యం బర్లీ రైతులకు శాపంగా పరిణమించింది. ప్రభుత్వం వైపు నుంచి కంట్రోల్ రూం ఏర్పాటు చేయడం మొదలుకుని వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శిని క్షేత్రస్థాయి పర్యటనకు పంపినా వ్యాపారుల్లో చలనం లేదు. గతంలో లాభాల పంట పండించుకున్న కంపెనీలు ప్రస్తుతం ఈ సమస్య తమది కాదన్నట్లుగా వ్యవహరిస్తున్నాయి.

కొనుగోలు చేసేలా చర్యలు

వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి రాజశేఖర్

బర్లీ రైతులు ఆధైర్య పడాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. బాపట్ల జిల్లా పర్చూరు మండలం, ఉప్పుటూరు గ్రామంలో మంగళవారం ఆయన పొగాకు రైతులతో ముఖాముఖి నిర్వహించారు. వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీరావుతో కలసి క్షేత్రస్థాయిలో పొగాకు తోటలను అధికారులతో కలసి పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం గ్రామంలోని జడ్పీ హైస్కూల్‌లో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

నీటి సంఘాలు.. నిర్వీర్యం

ఉత్సవ విగ్రహాల్లా నీటి సంఘాల అధ్యక్షులు

● వారి అధికారాలను హరిస్తోన్న అధికారులు
● సమావేశాల ఏర్పాటుకు ఇష్టపడని జలవనరులశాఖ
● కాల్వల మరమ్మతులు.. నీటి పంపిణీలో భాగస్వామ్యం లేదాయే

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

◆ నీటి సంఘం సమావేశం నిర్వహిద్దామని ఓ డీసీ అధ్యక్షుడు ఓ అధికారిని కోరగా.. మొబైల్ ద్వారా మాట్లాడుతున్నారుగా. ఇక ప్రత్యేకంగా సమావేశంతో పనేముందని సమాధానం.

◆ సమావేశం గురించి మాట్లాడేందుకు ఓ నీటి సంఘం అధ్యక్షుడు ఓ అధికారికి ఫోన్ చేయగా.. బీజీగా ఉన్నాను.. తర్వాత మాట్లాడతాను.. అని సమాధానమిచ్చి ఇంతవరకు స్పందించలేదు.

◆ నీటి సంఘాల బాధ్యతలను చూసే ఓ అధికారిని సమావేశం గురించి ప్రశ్నిస్తే చూద్దాం లేండి.. అని సమాధానం.

..ఇదీ గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని నీటి సంఘాల అధ్యక్షులతో అధికారులు వ్యవహరిస్తున్న తీరు. అధికారుల సమాధానాలతో నీటి సంఘాల అధ్యక్షులు కంగుతింటున్నారు. అధికారుల తీరుతో నీటి సంఘాల బాధ్యులు ఆందోళన చెందుతున్నారు. అసలు తాము నీటి సంఘాల అధ్యక్షులమా కాదా.. తమకు అధికారాలు ఉన్నాయా లేవా.. అని అయోమయంలో ఉన్నారు. ఓ పథకం ప్రకారం నీటి సంఘాలను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఆందోళన ఎన్నికైన వారిలో వ్యక్తమవుతోంది. అధ్యక్షుల పరిస్థితి ఉత్సవ విగ్రహాల చందాన ఉందన్న ఆరోపణలు ఉన్నాయి.

ప్రభుత్వ లక్ష్యాల మేరకు కాల్వల నిర్వహణలో, నీటి పంపిణీలో భాగస్వాములను చేయాలని సంఘాల అధ్యక్షులు కోరుతున్నారు. సకాలంలో వర్షాలు కురిసి ప్రాజెక్టుకు నీరు వస్తే జూలైలో నీటి సరఫరా చేసే అవకాశం ఉంటుంది. ఈ లోగా కాల్వల మరమ్మతులు పూర్తి చేయాల్సి ఉంది. ఏ కాల్వలో.. ఏ పనులు చేయాలనే విషయంలో సంఘాలకు పూర్తి అవగాహన ఉంటుంది. రైతుల ద్వారా సమస్యలు తెలుసుకుని పనులు చేపడితే సాగుదారులకు నీటి ఇబ్బందులు ఉండవు. అయితే ఈ దిశగా జలవనరుల శాఖ స్పందించడంలేదు. కనీసం నీటి సంఘాలతో సమావేశాలు నిర్వహించేందుకు కూడా సదరు అధికారులు ఇష్టపడటం లేదని పలువురు అధ్యక్షులు వాపోతున్నారు. నీటి సంఘాలను నిర్వీర్యం చేసేలా అధికార యంత్రాంగం వ్యవహరిస్తోందన్న విమర్శిస్తున్నారు.

ప్రభుత్వ లక్ష్యానికి విరుద్ధంగా అధికారులు

సాగునీటి వ్యవస్థను బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం ఐదు నెలల క్రితం నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించింది. కాల్వల నిర్వహణ.. సాగునీటి పంపిణీలో సంఘాలను భాగస్వాములను చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. రైతులకు దగ్గరగా ఉంటూ సాగు నీటి సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు కాల్వల మరమ్మతులు, చివరి భూమి వరకు సాగునీటిని అందించడంలో కీలక పాత్ర పోషించాలని ప్రభుత్వం సంఘాలకు సూచించింది. ఇది నిజమే కదా అని ఆయా పనులు చక్కపెట్టేందుకు ప్రయత్నిస్తున్న సాగునీటి సంఘాలకు జలవనరుల శాఖ అధికారుల నుంచి అవమానాలే ఎదురవుతున్నాయని కొందరు అధ్యక్షులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాల్వల నిర్వహణ పనులను గుర్తించడం, నీటి తీరువా వసూళ్లలో నీటి సంఘాలను భాగస్వాములను చేయాలని ప్రభుత్వం సూచిస్తోంది. అయితే ప్రభుత్వ లక్ష్యాల ను జలవనరుల శాఖ తుంగలో తొక్కుతుందన్న విమర్శలున్నాయి.

నిధులు.. అధికారాలు లేవు

రైతులు ఏటా చెల్లించే నీటి తీరువాలో 80 శాతం నిధులను నీటి సంఘాలకు కేటాయించాలి. ఈ ప్రక్రియను అమలు చేసే పరిస్థితులు కానరావడంలేదని అధ్యక్షులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాగునీటి వినియోగదారుల సంఘాలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ప్రాజెక్టు కమిటీలకు నిర్దిష్టమైన అధికారాలను ప్రభుత్వం కల్పించినా వాటిని కొందరు హరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. పైగా అధికారుల తీరు సంఘాలను అవమానించేలా ఉన్నాయన్న విమర్శలున్నాయి.



లింగంగుంట్లలోని జలవనరుల శాఖ కార్యాలయాలు

కార్యాలయాలు అప్పగించలేదు

ప్రపంచ బ్యాంకు నిధులతో సాగర్ కాల్వల ఆధునికీకరణ పనులు చేశారు. ఈ సందర్భంగా కార్యాలయాల నిర్మాణానికి నిధులు కేటాయించారు. ఈ నేపథ్యంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు చాలా చోట్ల కార్యాలయాలు నిర్మించారు. ఆయా కార్యాలయాలను డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు అప్పగించాల్సి ఉంది. అయితే ఈ విషయాన్ని నెలలు గుడుస్తున్నా అధికారులు పట్టించుకోలేదు.

ఆ లేవుట్లను ఏమిచేద్దాం?



చీరాల : దేవాంగపురి పంచాయతీలో నిబంధనలకు విరుద్ధంగా వేసిన లే అవుట్ (పాత చిత్రం)

● జిల్లాలో 285 అక్రమ లే అవుట్లు గుర్తింపు
● వాటిపై చర్యల విషయంలో ఇప్పటికీ లేని స్పష్టత
● త్వరలో మరోసారి సమావేశం కానున్న అధికారులు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

అక్రమ లేఅవుట్లను గుర్తించారు.. నోటీసులు ఇచ్చారు.. అయితే ఇదంతా జరిగి ఎనిమిది నెలలు అవుతున్నా ఇంకా వాటిని ఏమి చేయాలనే విషయంపై అధికారులు ఎటూ తేల్చలేకపోతున్నారు. వైసీపీ హయాంలో, అంతకుముందు వేసిన అనధికారిక లే అవుట్లపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. రేపల్లె, బాపట్ల, చీరాల మున్సిపాలిటీలతో పాటు బాపట్ల, ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో భాగమై ఉన్న అక్రమ లే అవుట్ల వివరాలను సేకరించింది. ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో ఉన్న లే అవుట్లలో ఎటువంటి క్రయ విక్రయాలు జరపడానికి వీల్లేదని కూడా తెలిపింది. త్వరలోనే వాటి క్రమబద్ధీకరణకు మార్గదర్శకాలు జారీ చేస్తామని ప్రభుత్వం చెప్పింది. అది మొదలు ఇప్పటి వరకు అక్రమ లే అవుట్లపై చర్యల విషయంలో ఎటువంటి కదలిక లేదు. మరో వైపు ప్రభుత్వం ప్రకటించిన అక్రమ లే అవుట్ల జాబితాలో ఉన్న ప్లాట్లలో దాదాపు 80 శాతం అమ్మకాలు జరిగిపోయాయి. వాటిని కొనుక్కున్న వారు లబోదిబో మంటున్నారు. ఎనిమిది నెలల వ్యవధిలో మూడు సార్లు అక్రమ లే అవుట్లపై సమీక్ష జరిపిన అధికారులు ఎటువంటి నిర్ణయానికి రాలేకపోయారు. ఇటీవల బావుడాకు అధికారాలు కట్టబెడుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో ఈ అంశం మరోమారు తెరపైకి వచ్చింది. నిబంధనలకు విరుద్ధంగా వేసిన లే అవుట్లపై ఎలాంటి వైఖరి అవలంబించాలనే విషయంపై తాజాగా కలెక్టర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. అయితే ఇక్కడ కూడా ఏదీ తేల్చకుండానే ముగిసింది. వాటిపై చర్యల విషయంలో రాష్ట్రస్థాయిలోని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి రిఫర్ చేశామని యంత్రాంగం చెబుతోంది. త్వరలోనే మరోమారు సమావేశమై అనధికారికంగా వేసిన లే అవుట్లపై చర్యల విషయంలో ఓ నిర్ణయానికి వస్తామని అధికారులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో అటు ప్లాట్లు కొనుక్కున్న వినియోగదారుల్లో కానీ, లేక జరిమానాలు కట్టి క్రమబద్ధీకరణ చేయించుకోవడానికి సిద్ధంగా ఉన్న రియల్టర్లు కానీ ప్రస్తుతం త్రిశంకు స్వర్గంలో ఉన్నారు.

ఇబ్బడిముబ్బడిగా..

గత ప్రభుత్వంలో ఎటువంటి అనుమతులు లేకుండా రాజకీయ అండదండలతో ఇష్టారాజ్యంగా లే అవుట్లు వేశారు. అధికారులు నోటీసులు జారీ చేయడం వాటిని పట్టించుకోకపోవడం ఓ ప్రహసనంలా నడిచింది. బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ పరిధిలో ఉన్న రేపల్లె, బాపట్ల నియోజకవర్గాల పరిధిలో 104 అక్రమ లే అవుట్ల వివరాలను గతేడాది ఆగస్టులోనే ప్రభుత్వం వెల్లడించింది. బాపట్ల మున్సిపాలిటీ పరిధిలో 39, రేపల్లెలో 40, ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ పరిధిలో 102 అనధికారిక లే అవుట్లను ప్రభుత్వం గుర్తించి జాబితా విడుదల చేసింది. వీటిలో 80 శాతం అమ్మకాలు జరిగి ఉండడం వల్ల యజమానులకు ఇబ్బంది లేకుండా జరిమానాలు విధిస్తామని ప్రభుత్వం తెలిపింది. కానీ అమ్ముడయిన వాటి విషయంలో యజమానులు ఎందుకు స్పందిస్తారనే దానికి ప్రభుత్వం వైపు నుంచి సమాధానం కొరవడింది. పైగా క్రయవిక్రయాలు నిషేధమని ప్రకటించినప్పటికీ ఈ ఎనిమిది నెలల కాలంలో యథేచ్ఛగా రిజిస్ట్రేషన్లు జరుగుతూనే ఉన్నాయి. ఇదే విషయంపై సదరు విభాగం వివరణ కోరగా తమకు ఉన్నతాధికారుల నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదని చెప్పడం గమనార్హం. జాబితా ప్రకటించిన దగ్గర నుంచి ఇప్పటి వరకు దాదాపు 430 వరకు ప్లాట్ల రిజిస్ట్రేషన్లు జరిగినట్లు తెలుస్తోంది.

సాల్ట్ భూములకు.. ధర నిర్ణయించాలి

● పరిశీలనకు జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు
● అధికారులను ఆదేశించిన కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, మే 6 (ఆంధ్రజ్యోతి): సాల్ట్ భూములను పరిశీలించి వాటికి మార్కెట్ ధరలను నిర్ణయించాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. సాల్ట్‌భూముల పరిశీలన, ధరల నిర్ధారణపై అధికారులతో మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పరిశీలనకు జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. చిన్నగంజాం మండలంలో 2,486 ఎకరాల భూములు సాల్ట్‌కమిషన్ ఆధీనంలో ఉన్నాయన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆభూములను సర్వే చేయాలన్నారు. భూమి ప్రస్తుత పరిస్థితిపై సమగ్రనివేదిక రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్, చీరాల ఆర్డీవో చంద్రశేఖర్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారులు పాల్గొన్నారు.

● ప్రజాసమస్యల పరిష్కారవేదిక ద్వారా నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయంలో ఫిర్యాదు చేసుకునే అవకాశాన్ని రాష్ట్రప్రభుత్వం కల్పించిందని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. సమాజంలో నిరాధరణకు గురయ్యే గిరిజన, దివ్యాంగుల కోసం ప్రతినెలలో నాలుగో శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వినతిపత్రాల ద్వారా వారి సమస్యలను తన దృష్టికి తీసుకురావచ్చని చెప్పారు. ప్రజలు సమస్యలను నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయంలో ఫిర్యాదు చేయడానికి కాల్‌సెంటర్ 1100ను వినియోగించుకోవా లన్నారు. ప్రజలు చేసే ప్రతి ఫిర్యాదును తక్షణమే రిజిస్ట్రేషన్ చేసి రశీదు అందజేస్తామన్నారు. సమస్య పరిష్కారమవ్వగానే ఫిర్యాదు దారుడికి ధ్రువీకరణపత్రం అందజేస్తామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

● మనమిత్ర పేరుతో రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా వాట్సాప్ గవర్నెన్స్‌ను ఏర్పాటు చేసిందని కలెక్టర్ తెలిపారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా సుమారు 200 ప్రభుత్వ సేవలను ప్రజలకు అందిస్తున్నామన్నారు. ప్రజలు మొబైల్ నుంచి 919552300009కు హాయ్ అని మెసేజ్ పంపి సేవలను పొందవచ్చన్నారు.

డిపాజిట్ల పేరుతో బురిడి

● పరారీలో సొసైటీ నిర్వాహకుడు
మహిళ ఫిర్యాదుతో కేసు నమోదు

వేమూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): ఫిక్స్‌డ్ డిపాజిట్లు.. నెలవారీ స్కీమ్‌లు .. రికరింగ్ డిపాజిట్లు.. బంగారం తాకట్టుపై రుణాలు.. అంటూ బురిడీ కొట్టి రూ.3 కోట్లతో ఎగనామం పెట్టి పారిపోయిన ఓ సొసైటీ నిర్వాహకుడి ఉదంతమిది. మండలంలోని చావలి గ్రామంలో మణికంఠ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీని ఎనిమిదేళ్ల క్రితం ప్రారంభించిన తెనాలికి చెందిన కొల్లూరు ఉదయవెంకటేశ్వరరావుపై కేసు నమోదు చేసినట్లు వేమూరు ఎస్‌ఐ రవికృష్ణ తెలిపారు. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు సొసైటీలో సభ్యులుగా చేరి ఆయా స్కీముల్లో చేరి పెద్దమొత్తంలో నగదు కడుతున్నారు. కాగా గత నెల 30న సొసైటీ కార్యాలయానికి తాళాలు వేసి వెంకటేశ్వరరావు పరారీలో ఉన్నాడు. దీంతో దేవరకొండ కోటేశ్వరమ్మ అనే బాధితురాలు మంగళవారం వేమూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. 32 గ్రాముల బంగారం వస్తువులను సొసైటీలో తాకట్టు పెట్టి రుణం తీసుకున్నానని తిరిగి వాటిని విడిపించేందుకు సొసైటీకి వెళ్లగా వెంకటేశ్వరరావు పరారీలో ఉన్నట్లు తెలిసిందని తనకు న్యాయం చేయాలని ఆమె ఫిర్యాదులో కోరారు. సంబంధిత సొసైటీలో గ్రామానికి చెందిన 100 మందికి పైగా సభ్యులు చీటీ డబ్బులు కడుతున్నారని, దాదాపు రూ.3 కోట్ల దాకా చెల్లించి ఉంటారని గ్రామస్తులు చెబుతున్నారు. బాధితులు ఎవరికి వారు మోసపోయామంటూ రోధిస్తున్నారు.

తెలుగు మీడియం లేకపోవడం దారుణం



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

బాపట్ల, మే 6 (ఆంధ్రజ్యోతి): తెలుగురాష్ట్రాలలో తెలుగుమీడియం లేకపోవడం దారుణమని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. బాపట్ల మున్సిపల్ హైస్కూల్‌లో మంగళవారం యూటీఎఫ్ కార్యకర్తల జిల్లా స్థాయి శిక్షణా తరగతుల్లో ఆయన ప్రసంగించారు. మొదటి భాషాప్రయుక్త రాష్ట్రం, ప్రాచీన భాషగా తెలుగు విరాజిల్లిన ప్రాంతంలోని పాఠశాలల్లో తెలుగుభాష నేర్చుకునే పరిస్థితి లేకపోవడం ఆక్షేపణీయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ మీడియం చదువుకోవాలో స్వేచ్ఛ పిల్లలకు ఉండేలా చూడాలన్నారు. పదో తరగతి పరీక్షలలో సుమారు 60 వేల మంది విద్యార్థులు తెలుగుమీడియంలో మాత్రమే పరీక్ష రాశారనే విషయాన్ని ప్రభుత్వం, విద్యాశాఖాధికారులు గుర్తించాలన్నారు. జీవో 117 రద్దు అంటే దానికి ముందు ఉన్న విద్యావిధానం అమలు చేయాల్సి ఉండగా జీవో 117కు మార్పులు మాత్రమే చేస్తున్నట్లు ఉందన్నారు. సమాంతర మీడియం కొనసాగించాలని, హైస్కూల్‌లో 1:45 ఆధారంగా సెక్షన్ ఉండాలన్నారు. మోడల్ ప్రైమరీ పాఠశాలను స్వాగతిస్తూనే మిగిలిన ప్రాథమిక పాఠశాలలను యధాతథంగా కొనసాగించాలని యూటీఎఫ్ డిమాండ్ చేయగా దానికి భిన్నంగా విద్యాశాఖ కసరత్తు చేస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి ఎన్.నవకోటేశ్వరరావు, రాష్ట్ర ప్రచురణ విభాగం ఛైర్మన్ ఎం.హనుమంతరావు, జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు జె.వినయ్‌కుమార్, ఎ.శ్రీనివాసరావు, పాపారావు, బిక్షాలుబాబు, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి హైవేలో.. హల్‌చల్

ఈపూరుపాలెం పోలీసుల అదుపులో ముగ్గురు

ఈపూరుపాలెం(చీరాల), మే 6 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి 216పై సోమవారం అర్ధరాత్రి పక్క నియోజకవర్గంలో పోలీసుశాఖలో పనిచేస్తు న్న ఓ ఉద్యోగి కుమారుడు, మరో నలుగురు యు వకులతో కలిసి హల్‌చల్ చేశాడు. కర్రలు, రాడ్లతో విచక్షణ రహితంగా దాడి చేశారు. ఆ సమయంలో అటుగా వెళ్తున్న ఓ మాజీ ప్రజాప్రతినిధి చొరవతో బాధితులను రక్షించి. దాడికి పాల్పడిన వారిలో ముగ్గుర్ని ఈపూరుపాలెం స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు.. పాపా యిపాలేనికి చెందిన ఓ వ్యక్తి, కీర్తివారిపాలేనికి చెందిన ఓ బంధువుతో కలిసి సోమవారం రేపల్లె లోని ఓ శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తూ బాపట్ల మండలం వెదుళ్లపల్లి సమీపంలో ఓ దాబా వద్ద ఆగారు. ఆ సమయంలో ఓ పోలీసు ఉద్యోగి కుమారుడు, కొందరు యువకులు అక్కడ పుట్టిన రోజు వేడుక చేసుకుంటున్నారు. అయితే వారిద్దరూ తమను కామెంట్ చేశారని భావించిన యువకులు కారులో బైక్‌పై వెళ్తున్న వారిని వెంబడించారు. ఈపూరుపాలెం మలుపు కాల్వ వద్ద బైక్‌పై ఉన్న వారిని అడ్డగించి పొలాల్లోకి లాక్కుని వెళ్లి రాడ్లు, కర్రలతో దాడి చేశారు. ప్రాణాలు కాపాడుకునే క్రమంలో ఆ ఇద్దరు పరిగెత్తుతూ రోడ్డుపైకి వచ్చారు. ఆ సమయంలో వేటపాలెం వైపు కారులో వెళుతున్న మాజీ ప్రజాప్రతినిధిని, బాపట్ల మండలం కంకట పాలెం నుంచి వస్తున్న ట్రాక్టర్‌ను ఆపి సహాయం కోసం అర్థించారు. దీంతో దాడికి పాల్పడిన వారి లో ముగ్గుర్ని ట్రాక్టర్‌లోని వారు, మాజీ ప్రజా ప్రతినిధి పట్టుకోగా మరో ఇద్దరు పరా రయ్యారు. ఆ ముగ్గుర్ని ఈపూరుపాలెం పోలీసులకు అప్ప గించారు. ఈ ఘటనపై పోలీసులు రహస్యంగా దర్యాప్తు చేస్తున్నారని సమాచారం. నిందితుల కుటుంబ సభ్యులు మధ్యవర్తుల ద్వారా రాజీ ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది.

అవీ..ఇవీ..

రావినూతల రోడ్డుకు మరమ్మతులు


అంచులకు గ్రావెల్ తోలించిన కాంట్రాక్టర్

మేదరమెట్ల, మే 6 (ఆంధ్రజ్యోతి): మేదరమెట్ల నుండి రాచపూడి వరకు ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు అంచులు గుంటలు పడ్డాయి. అయినప్పటికీ, నిత్యం వేలాది వాహనాలు ఈ రోడ్డుపై ప్రయాణిస్తుంటాయి. కొరిశపాడు మండలంలోని మేజర్ పంచాయతీలను కలుపుతున్న ప్రధానమైన రోడ్డు ఇది. ఆటోలు, మోటర్ సైకిళ్లు కార్లు వేలాదిగా ప్రయాణించే ఈ రోడ్డు పూర్తిగా గుంటలు పడిపోయింది. మేదరమెట్ల రాచపూడి మధ్య 18 కిలో మీటర్లు పొడవు ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డు ఇది. ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్డుపై ఉన్న గుంటలకు తారుతో మరమ్మతులు చేశారు. పమిడిపాడు, రాచపూడి మధ్య కొంత దూరం పూర్తిగా తారురోడ్డు నిర్మాణం చేశారు. మేదరమెట్ల పమిడిపాడు మధ్య తారురోడ్డు మార్జిన్‌లు కోసుకుపోయి, వాహనాలు రోడ్డు మార్జిన్ దిగడానికి , ఎ క్కడానికి ఇబ్బందికరంగా మారాయి. కొన్నిసార్లు ద్విచక్రవాహనదారులు రోడ్డు మార్జిన్‌నుండి ఎక్కడానికి ప్రయత్నించి ప్రమాదానికి గురయ్యారు. ఎదైన వాహనం ఎదురుగా వచ్చినప్పుడు రోడ్డు దిగడానికి వీలు లేకుండా ఉంది. దీంతో ఆర్అండ్‌బీ అధికారులు మంగళవారం రోడ్డు మార్జిన్ గుంటలకు ఎర్రమట్టిని తోలారు. ఇది ఎక్కువ కాలం ఉండకపోయిన ప్రమాదాలు జరగకుండ కొంత వరకు కాపాడుతుంది.

14న మండల సర్వసభ్య సమావేశం

మేదరమెట్ల, 6 మే(ఆంధ్రజ్యోతి): కొరిశపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం 14వ తేది మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో రాజ్యలక్ష్మి తెలిపారు. సమావేశానికి మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు హజరు కావాలని ఆమె తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ

● విరిగిన స్తంభం, నిలిచిన కరెంట్ సరఫరా


విరిగిన విద్యుత్‌స్తంభం

బల్లికురవ, మే 6(ఆంధ్రజ్యోతి): మండలం లోని అంబడిపూడి వద్ద మంగళవారం విద్యుత్ స్తంభాన్ని గ్రానైట్ లారీ ఢీ కొనడంతో విద్యుత్ స్థంభం విరిగిపడింది. దీంతో విద్యు త్ సరఫరా నిలిచిపోయిం ది. అద్దంకి వైపు నుంచి వస్తున్న గ్రానైట్ లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టడంతో విరిగి సుమారు 200 మీటర్ల దూరం స్తంబాన్ని ఈడ్చుకు వచ్చింది. దీంతో అంబడిపూడి, గుంటుపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మండలంలోని బల్లికురవ-చెన్నుపల్లి మధ్య విద్యుత్ తీగ తెగిపడటంతో మంగళవారం రాత్రి రెండు గంటల పాటు మండల కేంద్రమైన బల్లికురవ లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

మే చివరి వారంలో అన్నదాత సుఖీభవ

అద్దంకిటౌన్, మే 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మే నెల చివరి వారంలో అ ర్హులైన రైతులందరికి అన్నదాత సుఖీభవ అందిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ మంగళవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. మండలంలో 19599 మంది రైతులు వెబ్‌ల్యాండ్‌లో నమోదు అయ్యారన్నారు. రైతుసేవా కేంద్రాలలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఈ డేటాను తనిఖీ చేసి చనిపోయిన వారిని, ప్రభుత్వ ఉద్యోగులను, ఆదాయ పన్ను చెల్లించేవారిని, కోర్టు కేసులలో ఉన్నవారిని, ప్రజాప్రతినిధులు, పది వేలకు పైగా పెన్షన్ తీసుకునే వారిని అనర్హులుగా గుర్తించి అర్హుల జాబితాను ప్రచురించినట్లు తెలిపారు. కావున రైతులు మీ గ్రామంలోని రైతుసేవా కేంద్రాలలో ఆధార్, పట్టాదారు పాస్ పుస్తకాలతో సంప్రదించాలని ఏవో తెలిపారు.

మూడు పంచాయతీలకు అవార్డులు

అద్దంకిటౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కుష్టు, క్షయ, ఎయిడ్స్ వ్యాధి నివరణ చర్యలుకు అనుగుణంగా జిల్లా స్థాయిలో క్షయ నిర్మూలను తీసుకున్న చర్యలకు గాను బాపట్ల జిల్లా స్థాయిలో పలు పంచాయతీలకు అవార్డులను ప్రకటించింది. మంగళవారం వాటిని బాపట్ల జిల్లాలో జరిగిన కార్యక్రమంలో అ వార్డులను అందజేశారు. అందులో భాగంగా అద్దంకి మండలంలోని గోపాలపురం పంచాయతీకి వెండి, పేరాయపాలెం, ఉప్పలపాడు పంచాయతీలకు రజిత అవార్డులను ప్రకటించగా ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు అవార్డులను అందుకున్నట్లు ఎంపీడీవో బత్తిన సింగయ్య తెలిపారు. అవార్డులు అందుకున్న కార్యదర్శులు ఎంపీడీవో, ఈవో ఆర్డీ ప్రసాదరావు ఇతర అధికారులు అభినందించారు.

20న దేశవ్యాప్త సమ్మె

అద్దంకిటౌన్, మే 6(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం కార్మిక చట్టలను రద్దు చేయడం, లేబర్ కోడ్ బిల్లును తీసుకొచ్చిందని కార్మికులకు నష్టం కలిగించే ఈ చట్టలను రద్దు చేయాలని ఈ నెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం స్థానిక గాజులపాలెం అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జయసింహకు ఆశా కార్యకర్తలు సమ్మె నోటిస్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఆశాలు లక్ష్మి, ధనమ్మ, మరియమ్మ, రత్నకుమారి, మస్తాన్‌బి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోండి

మేదరమెట్ల, 6 మే (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయంపై అ వగాహన పెంచుకోవాలని యూనిట్ ఇన్‌చార్జి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం పి. గుడిపాడులో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అ వగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఖరీఫ్ కార్యాచరణ అ వగాహన కల్పించారు. నవధాన్యాల సాగు ఫలితాల గురించి ప్రకృతి వ్యవసాయ స్లోకాలను రైతులకు వి వరించారు. ఈ కార్యక్రమంలో సునీత, మౌనిక, అంజలిదేవి, కరిమూన్, ప్రియాంకతో పాటు రైతులు పాల్గొన్నారు.

ఊడిన టిప్పర్ టైర్లు... తప్పిన ప్రమాదం


రోడ్డు వెంబడి అడ్డంగా నిలిచిన లారీ

అద్దంకి, మే 6(ఆంధ్రజ్యోతి): బెంగ ళూరు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు కు గ్రావెల్ తరలించే టిప్పర్ వెనుక యాక్సిల్స్ ఊడి పోయి టైర్లు ఒకదాని పై మరొకటి ఎక్కాయి. స్థానికుల కథనం మేరకు అద్దంకి పట్టణంలోని కలవకూరు రోడ్డు లో మంగళవారం రాత్రి ధర్మవరం వైపు నుండి వస్తున్న టిప్పర్ వెనుక యాక్సిల్స్ ఊడిపోయాయి. దీంతో టిప్పర్ వెనుక టైర్లు ఒకదానిపై మరొకటి చేరి రోడ్డు కు అడ్డంగా నిలిచిపోయింది. అయితే ఆ సమయంలో రోడ్డు పై ఎలాంటి వాహనాలు రాకపోవటం తో ప్రమాదం తప్పిపోయింది.

అక్రమంగా గ్రావెల్ తవ్వుతున్న వ్యక్తిపై కేసు

మార్టూరు, మే6(ఆంధ్రజ్యోతి):అక్రమంగా కొండ పోరంబోకు ప్రాంతంలో ఎర్ర గ్రావెల్ ను తవ్వుతున్న వరికల్లు ఆంజనేయులు అనే వ్యక్తిపై మంగ ళవారం స్టేషన్ లో పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని బొల్లా పల్లి గ్రామానికి చెందిన ఆంజనేయులు తన పొలానికి ఉత్తరాన కొండపో రంబోకు ప్రాంతంలో గ్రావెల్ ను తవ్వడానికి ప్రయత్నించారు.

వైభవంగా పోలేరమ్మ తిరునాళ్ల


భారీగా తరలి వచ్చిన భక్తులు

భారీగా తరలివచ్చిన భక్తులు

తోటవారిపాలెం (చీరాల), మే 6 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని తోటవారిపాలెంలో వేంచేసిన పోలే రమ్మ అమ్మవారి 56వ వార్షికోత్సవ తిరునాళ్ల అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకాశాన్ని తాకుతున్న ప్రభలు, విద్యుత్ దీపాల అలంకరణలో, వివిధ రకాల సాంఘిక నాటికలు, భక్తి పరమైన కార్యక్రమాలతో ఆలయ పరిసరాలు మార్మో గాయి. ఉదయం నుండి భక్తులు అధికసంఖ్యలో బారులుతీరి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరునాళ్ల సందర్భంగా కొంతమేరకు ట్రాఫిక్ సమస్య తలెత్తింది. అయితే శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలుగకుండా డీఎస్పీ ఎండీ.మొయిన్, సీఐ శేషగిరిరావు, ఎస్సై చంద్రశేఖర్‌లు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

చినగంజాం, మే 6(ఆంధ్రజ్యోతి) : మండలంలోని సోపిరాల గ్రామంలో వేంచేసిన పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్లను మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. తిరునాళ్లను పురస్కరించుకుని ఆలయ పూజారి అమ్మవారి ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు విశేష పూజలు జరిపి, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు వినియోగం చేశారు. ఉదయం గ్రామంలోని మహిళలు చద్ది, వడపప్పు, పానకం, పసుపు నీళ్ల బిందె లను తీసుకొని మేళతాళలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయం వద్దకు చేరుకుని పూజలు నిర్వహించి, అమ్మ వారికి జలాభిషేకం చేశారు. గ్రామంలోని పుర వీధులలో అమ్మవారి ప్రభను కనక తప్పెట్లు, మేళతాళాలతో, బాణా సంచాలతో ఊరేగింపుగా ఆల యం వద్ద తీసుకొని వెళ్లారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ విద్యుత్ ప్రభల వద్ద నిర్వహించిన శ్రీలలితా రామకోటేశ్వర భజన మండలి వారు నిర్వహించిన కోలాటం, మాధవ్ ఈవెంట్స్ వారి పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వ హించారు. సోపిరాల గ్రామంలో పల్లపోలు వంశీయులు, గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహిం చారు. తిరునాళ్లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన లు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.





విశేష అలంకరణలో పోలేరమ్మ, ఆలయం వద్ద విద్యుత్ దీప అలంకరణ, చిన్నగంజాంలో ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు, ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ

అధైర్య పడొద్దు..అండగా ఉంటాం

పొగాకు రైతులకు వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి రాజశేఖర్ హామీ


రైతులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న రాజశేఖర్

ఉప్పుటూరు(పర్చూరు), మే 6 (ఆంధ్రజ్యోతి) :బర్లీ రైతులు అధైర్య పడాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి బి. రాజ శేఖర్ అన్నారు. బాపట్ల జిల్లా, పర్చూరు మండలం, ఉప్పుటూరు గ్రామంలో మంగళ వారం ఆయన పొగాకు రైతులతో ముఖా ముఖి నిర్వహించారు. కార్యక్రమంలో, వ్యవ సాయశాఖ కమిషనర్ డిల్లీరావుతో కలసి ఆయన పాల్గొన్నారు. తొలుత క్షేత్రస్థాయిలో స్థానికంగా సాగుచేసిన బర్లీ పొగాకు తోటలను అధికారులతో కలసి పరిశీలించారు. రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉప్పుటూరు గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ముఖాముఖిలో పొగాకు రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి మాట్లాడుతూ బర్లీ పొగాకు రైతుల సమస్యను స్థానిక శాసన సభ్యులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లార న్నారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకోవాలని తమకు ఆదేశాలు ఇచ్చారన్నారు. ఆయా కంపె నీల ద్వారా కొనుగోలు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ముఖ్యమంత్రి స్పష్టత ఇచ్చినట్లు వెల్లడించారు. ఇప్పటికే పొగాకు కొనుగోలుకు కంట్రోల్ రూంను కమిషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశామన్నారు. పర్చూరు మండలంలోని 15గ్రామాల్లో అత్యధికంగా 25వేల ఎకరాల్లో పొగాకు సాగు చేశారన్నారు. అందులో గరిష్టంగా 3వేల పైచిలుకు ఉప్పుటూ రులో సాగుచేయడంతో ఈ గ్రామంలోనే రైతులతో ముఖముఖి కార్యక్రమం నిర్వహించి నట్లు డిల్లీరావు అన్నారు. కార్యక్రమంలో బాపట్ల ఆర్డీవో గ్లోరియా, తహసీల్దార్ పి.బ్రహ్మ య్య, రామాంజనేయులు, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

నేడు ఇన్‌చార్జ్ మంత్రి పర్యటన

చినగంజాం, మే 6(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, సమాచార పౌరసంబంధాలు, గృహ నిర్మాణ శాఖామాత్యులు కొలుసు పార్థసారిధి, పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివ రావులు బుధవారం పలు శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నట్లు టీడీపీ మండల అధ్యక్షులు పొద వీరయ్య మంగళవారం తెలిపారు. మంత్రి, ఎమ్మెల్యేల పర్యటన వివరాలు ఇలా బుధవారం ఉదయం 10.30గంటలకు ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాల యంలో సీఎం ఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ అనంతరం మధ్యా హ్నం 12 గంటలకు సోపిరాల డొంక బజా రులో రూ.26.50లక్షల రూపాలయలతో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్డు ప్రారంభోత్సవం, 12.30 గంటలకు స్థానిక కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో కోటి న్నర రూపాయిల వ్యయంతో నిర్మించనున్న అదనపు తరగతి గదులకు భూమిపూజ, రూ.36లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన ప్రహరీగోడ ప్రారంభోత్సవం, 1గంటకు చినగంజాం గ్రామంలో రూ.6లక్షల రూపాయిలతో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్డు ప్రారంభోత్సవం, మధ్యాహ్నం 1.30గంటకు చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని రామకోటేశ్వరకాలనీలో పిడుగు పాటుతో మృతిచెందిన గడ్డం బ్రహ్మయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సాయం అందజేస్తారన్నారు. 2గంటలకు సోపిరాలలో మధ్యాహ్న భోజనం అనంతరం 2.30గంటలకు నీలాయపాలెంలో బస్సు ప్రమాద బాధితులను పరామర్శించి, ఆర్థిక సాయం అందజేయనున్నట్లు తెలిపారు.

ఏబీవీపీ నిరసనలో స్వల్ప ఉద్రిక్తత


విద్యాశాఖమంత్రి లోకేష్ దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకుంటున్న పోలీసులు

ఒంగోలు కలెక్టరేట్, మే 6 (ఆంధ్రజ్యోతి) : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఒంగోలు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఒంగోలులో నిర్వహించిన నిరసన స్వల్ప ఉద్రిక్తతకు దారితీసింది. జీవో నంబర్ 77ను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక లాయర్‌పేటలోని ప్రకాశం పంతులు విగ్రహం వద్ద విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ఏబీవీపీ కార్యకర్తలు ప్రయత్నించారు. దీన్ని పోలీసులు అడ్డుకు న్నారు. దీంతో తోపులాట జరిగింది. ఈ సందర్భంగా ఏబీవీపీ నెల్లూరు విభాగ్ కన్వీనర్ రాజశేఖర్ మాట్లాడుతూ 77 జీవోను రద్దు చేయకుండానే ఈనెల 7న ఐసెట్ పరీక్షలు నిర్వహించడం తగదన్నారు. గత ఎన్నికలకు ముందు లోకేష్ ఇచ్చిన హామీ మేరకు ఆ ఉత్తర్వులను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ అంకిరెడ్డి పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం : ఎస్పీ

● పోలీసుల పిల్లలకు సమ్మర్ క్యాంప్ ప్రారంభం



టగ్‌ఆఫ్‌వార్ ఆటల పోటీని ప్రారంభిస్తున్న ఎస్పీ

ఒంగోలు క్రైం, మే6(ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు శరీరక దారుఢ్యం పెంపొదిస్తాయని ఎస్పీ ఏఆర్.దామోదర్ పేర్కొ న్నారు. మంగళవారం ఒంగోలులోని జిల్లా పోలీ సు కార్యాలయం ఆవరణలోని క్రీడా మైదానం లో పిల్లలకు స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో సమ్మర్ కోచింగ్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ క్రీడలతో చి న్నారుల్లో పోటీతత్వం ఏర్పడుతుందన్నారు. త ల్లిదండ్రులు తమ పిల్లలకు ఇష్టమైన క్రీడలలో ప్రోత్సహించాలని అన్నారు. కోరారు. రోజులు పా టు జరిగే ఈ క్యాంప్‌లో పోలీసులు తమ పిల్ల లను చేర్పించాలని కోరారు. క్రీడలతో క్రమశిక్ష ణ, నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని చె ప్పారు. అదేవిధంగా ఓటమిని స్వీకరించే గు ణం వంటి ఎన్నో విషయాలు నేర్చుకుంటారని తెలిపారు. కాగా సమ్మర్ క్యాంప్‌లో భాగంగా ఫుట్‌బాల్, టగ్‌ఆఫ్‌వార్, షటిల్ బాడ్మింటన్, ర న్నింగ్ యోగా వంటి అంశాలపై హెడ్ కానిస్టేబుల్ రాజేంద్ర, జాతీయ క్రీడాకారులు శి క్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె. నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, ఆర్ఐలు రమణారెడ్డి, సీతారామి రెడ్డి పాల్గొన్నారు.

టెన్నిస్ కోర్టు ప్రారంభం

పోలీసు మైదానంలో నవీకరించిన టెన్నిస్ కోర్టును ఎస్పీ దామోదర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతే నిత్యం మా నసిక ఒత్తిడికి గురయ్యే పోలీసు సిబ్బందికి ఇ ది ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

వెల్లంపల్లిలో ఆగి సాగిన పొగాకు వేలం

● భారీగా తిరస్కరణకు గురైన బేళ్లు

మద్దిపాడు, మే 6(ఆంధ్రజ్యోతి): వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రంలో మంగళవారం వేలం ఆగి సాగింది. వ్యాపారులు సిండికేట్ కావడంతో పాటు రైతులు తీసుకొచ్చిన పొగాకు బేళ్లను తిరస్కరించారు. దీంతో ఆగ్రహించిన రైతులు వేలంను గంటపాటు నిలుపుదల చేశారు. మారెళ్ల క్లస్టర్ రైతులు 572 బేళ్లు తీసుకు రాగా దానిలో 25 శాతం బేళ్లను తిరస్కరించడంతో వేలం కేంద్రం కార్యనిర్వాహణాధికారి కోవి రామకృష్ణ రైతులతో మాట్లాడారు. దీంతో 135 బేళ్లు రైతులు వెనక్కి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పొగాకు నాణ్యతగా లేకపోవడంతో వ్యాపారులు తిరస్కరించారని చె ప్పారు. పొగాకు కిలో గరిష్ట ధర రూ.280, కనిష్ఠ ధర రూ.230 పలికినట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘ అధ్యక్షులు అబ్బూరి శేషగిరిరావు, నా రిపెద్ది వరహాలుచౌదరి, మండవ గోవిందరాజులు, బోయపాటి వెంకయ్యచౌ దరి, మండవ శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

12న డీఆర్‌సీ సమావేశం

ఒంగోలు, మే 6 (ఆంధ్రజ్యోతి) : అత్యంత కీలకమైన జిల్లా సమీక్ష మండలి (డీఆర్సీ) సమావేశం ఈ నెల 12న జరగనుంది. ఆ రోజున ఉదయం 11 గంటలకు ప్రకాశం భవనంలోని పీజీఆర్ఎస్ హాలులో దీన్ని నిర్వ హించనున్నారు. వాస్తవానికి గతనెల 23న డీఆర్సీ జరగాల్సి ఉంది. అయితే 22వతేదీ రాత్రి జిల్లాకు చెందిన టీడీపీ ముఖ్యనేత, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి దారుణహత్యకు గురయ్యారు. ఆ మరుసటి రోజున అమ్మనబ్రోలులో ఆయన అంత్యక్రియలు జరగ్గా, నివాళులర్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వచ్చారు. దీంతో 23వ తేదీ జరగాల్సిన డీఆర్సీ సమావేశాన్ని వాయిదా వేశారు. తాజాగా ఈనెల 12న నిర్వహించాలని ఇన్‌చార్జి మంత్రి నిర్ణయించా రు. ఆ మేరకు అధికారులకు సమాచారం ఇచ్చారు. కీలక అంశాలపై సమావేశంలో చర్చించనున్నారు. ప్రధానంగా జిల్లాలో ప్రస్తుతం జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనుల పురోగతి, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వేసవిలో తాగునీటి సమస్య పరిష్కారం, విద్యుత్ రంగంలో పీఎం సూర్యఘర్ పథకం తీరు, రాష్ట్రప్రభుత్వం అత్యంత ప్రధాన్యతగా భావిస్తున్న ప్రజావినతుల పరిష్కారం తదితర అంశాలపై చర్చించేలా అజెండాను రూపొందిస్తున్నట్లు తెలిసింది.

పుస్తక పఠనంతో విజ్ఞానం


మాట్లాడుతున్న హెచ్ఎం రత్నకుమారి

చినగంజాం, మే 6(ఆంధ్రజ్యోతి) : పుస్తక పఠనంతో విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునని చినగంజాం జడ్పీ పాఠశాల హెచ్.ఎం. డి.రత్నకుమారి అన్నారు. స్థానికశాక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో శిక్షణ తరగతుల్లో భాగంగా మంగళవారం వివిధ అంశాలపై ఇచ్చిన శిక్షణలో విద్యార్థులు ఉత్సహంగా పాల్గొన్నారు. పుస్తక పఠనం దాని అవశ్యకత, పుస్తకాలు చదవడం వలన కలిగే ప్రయోజనాలను గురించి హెచ్.ఎం వివరించారు. తదనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. బ్రైట్ మైండ్స్ ఫర్ చిల్డ్రన్ అనే అంశంపై శిక్షణ తీసుకున్న విద్యార్థి తాళ్లూరి తనీష్‌రామ్ కళ్లకు గంతలు కట్టుకొని వస్తువు రంగుని గుర్తుపట్టే సృజనాత్మక కృత్యాన్ని ప్రదర్శించినట్లు గ్రంథపాలకులు మోహనలక్ష్మీనరసింహాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లు ఎస్.నరసింహారావు, వై.రామాంజనేయులు, పల్లపోలు శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

పౌష్టికాహార ప్రయోజనాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

అద్దంకిటౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): పౌ ష్టి కా హా ర ం తీసుకోవడం వలన కలిగే ప్రయోజనాల పై ప్రతి కిశోర బాలిక అవగాహన కలిగి ఉండాలి ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఇందిర అన్నారు. మంగళ వారం కలవకూరు సెక్టర్ పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాలలో కిశోర వికాసం కార్యక్రమంలో భాగంగా కిశోర బాలికలకు పోషకాహారం, రక్తహీనత, పరిశుభ్రత పై అవగాహన కలించారు. వ్యక్తిగత పరిశుభ్రత, రక్తహీనతకు గురికాకుండా తీసుకోవాల్సిన పోషకాహారం గురించి తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

స్టడీ అవర్లను పరిశీలించిన డిప్యూటీ డీఈవో

చినగంజాం, మే 6(ఆంధ్రజ్యోతి) : చినగంజాం, రాజుబంగారుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో జరిగిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు నిర్వహిస్తున్న స్టడీ అవర్లను పర్చూరు డిప్యూటీ డీఈవో గంగాధర్ మంగళవారం పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను ఆయన పరిశీలించి, ఉపాధ్యాయులకు పలు సూచనలు అందజేశారు. విద్యార్థులు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. తదనంతరం చినగంజాం జడ్పీ పాఠశాలలోని స్టాక్ రూములోని జేవీకే కిట్ల నిల్వలను డిప్యూటీ డీఈవో పరిశీలించారు. విద్యార్థినీ విద్యార్థులకు వచ్చిన బెల్టులను నాణ్యాతాపరంగా ఎలా ఉన్నది పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్.ఎంలు డి.రత్నకుమారి, రంగని శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు ఎస్.నరసింహారావు, ఎన్.సూర్యనారాయణ, పి.బ్రహ్మయ్య, ఎంఐఎస్ కోఆర్డినేటర్ ఎం.మురళి, సీఆర్పీ సీ.హెచ్.సురేంద్రకుమార్, ఎం.ఆశిష్‌కుమార్‌లు పాల్గొన్నారు.

స్వతంత్రంగానే ఐఎల్‌టీడీ యూనియన్ వర్కర్స్

చీరాల, మే 6 (ఆంధ్రజ్యోతి) : ఇకపై ఏపీ ఫెడరేషన్ ఆఫ్ ఐఎల్‌టడీ కంపెనీ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు స్వతంత్రంగా ముందుకు సాగనున్నారు. గతంలో సీఐటీయూకు అనుబంధంగా ఉండి వివిధ కారణాతో వేరయింది. ఈక్రమంలో నూతన ఫెడరేషన్ రాష్ట్ర అధ్యకులు చిప్పలపల్లి శివరాజు ఆధ్వర్యం లో కమిటి ప్రతినిధులు కంపెనీ మేనేజర్ శ్యాంసుందర్‌కు అందుకు సంబంధించిన పత్రాన్ని అందజేశారు. ఇటీవల ఈపూరుపాలెం ఆటోనగర్‌లో మహాసభలు జరిగిన తరుణంలో దీనిపై ఒప్పందం జరిగినట్లు ప్రతినిధులు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులతో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గంట సుధీర్, కోశాధికారిగా పఠాన్ నాగుల్, మరో 22 మందితో నూతన కమిటీ ఏర్పడినట్లు ప్రతినిధులు తెలిపారు.

అనుచిత వ్యాఖ్యలపై నిరసన

పంగులూరు, మే 6(ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీలల్లో విధులు నిర్వహించే ఏఎన్ఎంలు, సూపర్ వైజర్లు, ఆశా వర్కర్ల పట్ల ఎం.ఎల్.పి.హెచ్. (సిహెచ్.ఓ.)లు సోషల్ మీడియా వేదికగా చేసిన అనుచిత వ్యాఖ్యల చేయడంపై వారు నిరసన వ్యక్తం చేశారు. ఏఎన్ఎంలు సూపర్ వైజర్లకు వృత్తిపరంగా ఏబీసీడీలు కూడా తెలియవని, జీతాలు మాత్రం పొందుతున్నారని సోషల్ మీడియా వేదికగా అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీనిపై పంగులూరు పి.హెచ్.సి. ఎదుట మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎంఎల్‌పీహెచ్ఎస్.లపై చర్యలు చేపట్టాలని కోరుతూ వైద్యాధికారిణి డాక్టర్ బాల రాజేశ్వరికి వినతి పత్రం అందజేశారు.

అజీజ్ సాహిత్య సేవలు చిరస్మరణీయం

ఒంగోలు(కల్చరల్), మే 6(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక, సాహిత్య రంగాలలో అజీజ్ అహమ్మద్ అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు కళాకా రులు పేర్కొన్నారు. ఇటీవల మరణించిన అజీజ్ సంస్మరణ సభ శ్రీనాగినేని నరసింహారావు మెమోరియల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం స్థానిక సీవీఎన్ రీడింగ్ రూములో జరిగింది. ముందుగా అజీజ్ చిత్రపటా నికి కళాకారులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సంస్థ అధ్యక్షుడు మిడసల మల్లికార్జునరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మిరియాల వెలుగొండయ్య, సీవీఎన్ రీడింగ్ రూము అధ్యక్ష, కార్యదర్శులు గురునాథరావు, రాధాకృష్ణ, కె.రాఘవులు, కుర్రా ప్రసాద్‌బాబు, నితిన్‌రెడ్డి, వీరప్రతాప్, కరేటి కిరణ్‌బాబు, ఎస్.కోటేశ్వరరావు, సాంబశివరావు, ఎ.ప్రసాద్, మహబూబ్‌జాన్, షేక్ షబ్బీర్, మన్సూర్ పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో ముప్పాళ్లలో నేత్రదానం

ఇంకొల్లు,మే 6,(ఆంధ్రజ్యోతి) : ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం ముప్పాళ్ల గ్రామానికి చెందిన కల్లూరి ఏసుబాబు మంగళవారం మృతిచెందగా ఇంకొల్లు రోటరీక్లబ్ ఆధ్వర్యంలో నేత్రదానం చేశారు. వారి బంధువులు సహకారంతో గుంటూరు శంకర కంటి ఆసుపత్రి వైద్యులు రోటరీ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో నేత్రాలను సేకరించారు. కార్యక్రమంలో రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు జెట్టి స్వామి, రామ్మోహనరావు, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేయాలి

ఇంకొల్లు, మే6,(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని రైతుఉత్పత్తిదారుల సంఘాలను బలోపేతం చేయాలని ఏపీఎం అనూరాధ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం రైతు ఉత్పత్తిదారుల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీవో బుల్లియ్య మాట్లాడుతూ రైతు సంఘాలకు ప్రభుత్వం అందజేస్తున్న రాయితీలను, వడ్డీలేని రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాయితీలో షేడ్‌నెట్‌లు పొందడం, ఉద్యాన పంటలు పండించే వారికి ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో బోర్డు ఆఫ్ డైరెక్టర్లు, సీసీలు పాల్గొన్నారు.

కాలుష్యం కోరల్లో మున్సిపాలిటీ

- డివైడర్ల మధ్య కనిపించని పచ్చదనం
- నెరవేరని లక్ష్యం, అధికారుల్లో నిర్లక్ష్యం
- దృష్టిసారించని పాలకవర్గాలు




డివైడర్‌పై అరకొరగా ఉన్న మొక్కలు, పచ్చదనం లేని చీరాల పట్టణం వ్యూ

చీరాల, మే 6 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీని కాలుష్యంభూతం ఆవహివిస్తోంది. దీన్ని నివారించేందుకు ప్రభుత్వమైనా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని, నిత్యం హెచ్చరిస్తూనే ఉన్నాయి. అలాగే అందుకు సంబంధించి వ్యయ ప్రయాసలకోర్చి అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా... ఆచరణలో మాత్రం అమలుకావడం లేదు. ఏటా వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించి లక్షలు మొక్కలు నాటుతున్నట్లు అధికారులు లెక్కల్లో ఉన్నాయి. కానీ క్షేత్రస్థాయిలో వాస్తవాలు భిన్నంగా ఉంటున్నాయి.

చీరాల పురపాలక సంఘం పరిధిలో 33 వార్డులు ఉన్నాయి. అందులో సుమారు రెండు లక్షలు వరకు జనాభా ఉండగా, సుమారు 20 కిలోమీటర్లు మేర డివైడర్‌లు ఉన్నాయి. అయితే అందులో మొక్కలు మాత్రం అంతంతమాత్రంగానే ఉన్నాయి. మున్సిపాలిటీకి ఈ శాపం గత పభుత్వం పాపంగా చెప్పవచ్చు. గతంలో విధుల్లో ఉన్న అధికారులు నిర్లక్ష్యం కారణంగా పర్యవేక్షణ లోపించింది. దీంతో మొక్కలు అరకొరగా మార్గాల్లో దర్శనమిస్తున్నాయి. దీంతో కాలుష్యం తాండవిస్తోంది. కనీసం ఈ ప్రభుత్వమైనా మున్సిపాలిటీపై దృష్టి సారించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

వెలుగు కార్యాలయంగా మారని పేరు



బల్లికురవ మండల కార్యాలయంలో మారని పేరు

బల్లికురవ, మే 6 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వం ప్రభుత్వ కార్యాలయాలకు ఇష్టానుసారంగా తమ సొంత పేర్లను కార్యాలయాలకు పెట్టుకుంది. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే గతంలో ఉన్న పేర్లను తొలగిస్తూ, ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గతంలో పొదుపు సంఘాల మహిళలు వినియోగించే మండల సమాఖ్య కార్యాలయానికి వైసీపీ ప్రభుత్వం వైఎస్ఆర్ క్రాంతి పథం అంటూ పేరును ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం ఈ పేరుకు తొలగిస్తూ, వెలుగు కార్యాలయంగా మార్పు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. అయితే బల్లికురవలో మాత్రం ప్రభుత్వం వచ్చి పది నెలలు గడుస్తున్నప్పటికీ, ఇంకా వైఎస్ఆర్ క్రాంతిపథంగానే వెలుగు కార్యాలయం పనిచేస్తోంది. వైఎస్ఆర్ పేరు ఇంకా తొలగించకపోవడంపై సర్వత్ర విమర్శలు వినిపిస్తున్నాయి. తక్షణమే పేరును సరిచేయాలని పలువురు మహిళలు పేర్కొంటున్నారు.

ఉపాధి కూలీలు బీమా పథకంలో నమోదు చేయించుకోవాలి

ఎంపీడీవో కుసుమకుమారి

బల్లికురవ, మే 6 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకంలో గ్రామాలలో పనులు చేస్తున్న కూలీలు అందరు బీమా పథకంలో పేరు నమోదు కావాలని ఎంపీడీవో కె. కుసుమ కుమారి కోరారు. మంగళవారం మండలంలోని కొణిదెన గ్రామంలో ఉపాధి హామీ పథకం కూలీలకు ఎంపీడీవో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ వేసవి ఎండల వలన పలు చోట్ల కూలీలు అనారోగ్యం బారిన పడి పలువురు మృతి చెందుతున్నారన్నారు. కూలీలకు బీమాసౌకర్యం ఉందని తెలిపారు. ప్రధాన మంత్రి బీమాయోజన, ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా పథకాలను కూలీలు ఉపయోగించుకోవాలన్నారు. ప్రతి కూలీ రూ.20, రూ.436లను బ్యాంకులలో చెల్లిస్తే ఎవరైన కూలీలు ప్రమాదవశాత్తు మరణిస్తే వారికి రెండు లక్షల బీమా నగదు అందుతుందన్నారు. ఉపాధి హామీ పథకం సిబ్బంది కూడా కూలీలకు బీమా పథకాలపై అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో అన్ని గ్రామాల ఉపాధి పథకం క్షేత్రసహాయకులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జాబుకార్డులు కలిగి ఉన్న కూలీలు అందరిని బీమా పథకంలో నమోదు చేయించే కార్యక్రమం వెంటనే చేపట్టాలని ఎంపీడీవో సూచించారు.

12న సర్వసభ్య సమావేశం

అద్దంకిటౌన్, మే 6(ఆంధ్రజ్యోతి): అద్దంకి మండల ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 12న ఉదయం 11 గంటలకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల అధ్యక్షురాలి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బత్తిన సింగయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా శాఖలపై సమీక్ష నిర్వహించనున్నట్లు సభ్యులు, శాశ్వత ఆహ్వానితులు, మండల స్థాయి అధికారులు అందరు తప్పక హాజరు కావాలన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో వీల్ చైర్స్ బహూకరణ



వీల్‌చైర్స్ అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

పంగులూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): మండ ల కేంద్రమైన పంగు లూరులో రోటరీక్లబ్ ఆఫ్ పంగులూరు వారి ఆధ్వర్యంలో మంగళ వారం ఇరువురు వ్యక్తులకు వీల్‌చైర్స్ అందజేశారు. పంగు లూరు ముస్లిం కాలనీకి చెందిన పఠాన్ ఇమామ్, కొండమంజులూరు గ్రామానికి చెందిన భానుప్రసాద్‌లకు వీల్‌చైర్స్ బహూకరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ కాలేషావలి, విశ్రాంత ప్రొఫెసర్ బత్తుల వీరనారాయణ, మెడికల్ క్యాంప్ ఇన్‌చార్జ్ వీరరాఘవయ్య, విశ్రాంత ఆర్మీ సైంటిస్ట్ రాయిణి రామారావు క్లబ్ ప్రతినిధులు ఐ.సుబ్బారావు, గుర్రం ఆంజనేయులు, జాగర్లమూడి సుబ్బారావు, పోతిన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గుంటుపల్లి సర్పంచ్‌కి కృష్ణకుమారి ప్రశంసాపత్రం

బల్లికురవ, మే 6 (ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధి నిర్మూలనకు అంకితభావంతో పనిచేసినందుకు గాను మండలంలోని గుంటుపల్లి గ్రామసర్పంచ్ మాదాల కృష్ణకుమారికి జిల్లా అధికారులు మంగళవారం ప్రశంసపత్రం అందజేసి ఘనంగా సత్కరించారు. బాపట్ల జిల్లా కేంద్రంలో డీపీవో ప్రభాకరరావు, టీబీ జిల్లా అధికారి షేక్ మహ్మద్‌సాధిక్‌రావుల చేతుల మీదుగా టీబీ ముక్త్ పంచాయతీ 2024- 25 సంవత్సరాలకు గాను ఉత్తమ పంచాయతీ సర్పంచ్ ఎంపికైన మాదాల కృష్ణకుమారికి ప్రశంసపత్రం అందజేశారు. సమాజంలో టీబీ అనే వ్యాధి లేకుండా ప్రతి ఒక్కరు ప్రత్యేక కృషి చేయాలని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. గుంటుపల్లి పంచాయతీ కార్యదర్శి నూర్ అహ్మద్‌ను అధికారులు ప్రశంసించారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి ఇరుముడులు



గ్రామోత్సవంలో పాల్గొన్న దీక్షదారులు

బల్లికురవ, మే 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చినఅంబడిపూడి గ్రామంలో మంగళవారం వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఇరుముడుల మహోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అంబడిపూడి గ్రామంలో ఏటా కొందరు భక్తులు వీర బ్రహ్మేంద్ర స్వామి మాలధారణ దీక్ష 40 రోజుల పాటు పూర్తి చేసి బ్రహ్మంగారి మఠానికి వెళ్లి ఇరుముడులు చెల్లించి వస్తుంటారు. ఈ ఏడాది కూడా గ్రామంలోని కొందరు బ్రహ్మంగారి మాలదారణ చేసి బ్రహ్మంగారి మఠానికి బయలుదేరారు. ఈ సందర్భంగా గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ప్రజల సమస్యలపై నిర్లక్ష్యాన్ని ఉపేక్షించం



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

మార్టూరు, మే6 (ఆంధ్రజ్యోతి): రైతుల భూసమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలందరికీ అందాలన్నారు. మంగళవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఆయన ప్రజల నుండి వివిధ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఏలూరి మాట్లాడుతూ గ్రామాలలో అభివృద్ధిపనులకు అధికారులు ఒక ప్రణాళికను తయారుచేయాలన్నారు. గ్రామాలలో సిమెంటురోడ్ల నిర్మాణాలను వేగవంతంగా, నాణ్యతాపరంగా పూర్తి చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. యువత నైపుణ్యాలను పెంచుకోవడం ద్వారా మెరుగైన ఉపాధిని పొందుతారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 20 లక్షల మందికి ఉద్యోగాల కల్పనకు ప్రణాళికను సిద్ధం చేస్తున్నదన్నారు. రాజధాని అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు సారధ్యంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలోని ఎంతో మందికి అమరావతిలో ఉపాధి లభిస్తుందన్నారు. ప్రస్తుతం ఎంతోమంది కార్మికులకు అమరావతిలో చేతినిండా పనిదొరుకుతుందన్నారు. వ్యాపార, వాణిజ్య పరంగానే గాకుండా, విద్య, ఆరోగ్యం, యువతకు ఉపాధి పరంగా అమరావతిని దేశంలోనే గుర్తింపు ఉన్న రాజధానిగా చంద్రబాబు తీర్చిదిద్దుతారన్నారు. మరో మూడేళ్లలో అమరావతిలో అద్భుత నిర్మాణాలను మనం చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తాటి నాగేశ్వరరావు, కామినేని జనార్దన్, మిన్నెకంటి రవికుమార్, కామేపల్లి హరిబాబు, గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షులు పత్తిపాటి సురేష్, ఇంటూరి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

శింగరకొండ మారుతీభవన్‌కు కొత్త హంగులు

- దాతల సహకారంలో గదులలో వసతుల కల్పన
- అద్దె తగ్గించడంతో పెరిగిన డిమాండ్



విరాళం చెక్కును అందజేస్తున్న నాగసూరి హనుమంత్‌ప్రసాద్

అద్దంకి,మే6(ఆంధ్రజ్యోతి): శింగరకొండలో మారుతీ భవన్‌లో బస చేసే భక్తుల సంఖ్య పెరిగింది. దాతల సహకారంతో మారుతీ భవన్‌లో గదులలో ఏసీలు, డబుల్‌కాట్ మంచం, బెడ్, వేడినీటి కోసం గ్రీజర్ తదితర వసతులు కల్పించారు. మొత్తం 30 గదులు ఉండగా ఇప్పటికే 25 గదులకు సంబంధించి దాతల సహకారంతో అభివృద్ధి చేశారు. ఆయా గదులపై దాతల పేర్లు కూడా ఏర్పాటు చేస్తున్నారు. గతంలో మారుతీభవన్‌లో గదులు తీసుకునే భక్తులసంఖ్య అతి తక్కువగా ఉండేది. అత్యధిక శాతం ఆయా సామాజిక వర్గాల అన్నదాన సత్రాలలో గదులు తీసుకునే భక్తులే ఎక్కువగా ఉండే వారు. దీనికి కారణం మారుతీ భవన్‌లో గదుల అద్దె ఎక్కువగా ఉండడంతో పాటు వసతులు లేకపోవడమే. గతంలో రోజు కు ఏసీ గది అద్దె వెయ్యి రూపాయలు, నాన్ ఏసీ 500 రూపాయలుగా ఉండేది. ప్రస్తుతం ఏసీ గది రూ.500 నాన్ ఏసీ రూ.300లకు తగ్గించారు. మహాకుంభాభిషేకముకు గదులు అవసరం కావడం, భవిష్యత్తులో భక్తులు కు అన్ని వసతులు కల్పించాలన్న ఉద్దేశ్యంతో ఈవో తిమ్మానాయుడు ప్రత్యేక దృష్టిసారించి దాతల సహకారంలో అన్ని గదులలో వసతుల కల్పన ప్రారంభించారు. నెల రోజుల వ్యవధిలోనే 25 మంది దాతలు ముందుకు వచ్చి ఆయా గదులలో వసతుల కల్పనకు విరాళాలు అందజేశారు.

విరాళాలు అందజేత

మారుతీభవన్‌లో గదులు ఆధునీకరణకు మంగళవారం అద్దంకికి చెందిన మారుతీ ఫ్యాషన్స్ ప్రొప్రైటర్ షేక్ రఫీ, సైదాబీ దంపతులు, మేడగం అంజిరెడ్డి, వెంకటరాజ్యం దంపతులు, నాగసూరి హనుమత్‌ప్రసాద్, పుష్పావతి దంపతులు విరాళాలను తిమ్మానాయుడుకు అందజేశారు.

రాతి ముఖమండపానికి లక్ష రూపాయల విరాళం

అద్దంకి,మే6(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి ముఖమండపం నిర్మాణానికి ధర్మవరపు భాస్కరరావు, సుజాతల తరపున మామ అద్దంకికి చెందిన రిటైర్డ్ దేవాదాయశాఖ అధికారి మేకా వెంకటేశ్వర్లు మంగళవారం 1,01,116 రూపాయలను ఈఓ తిమ్మానాయుడుకు అందజేశారు.

మహాకుంభాభిషేకానికి కావేరి నది నీరు



శ్రీరంగం వద్ద కావేరి నదిలో నీటిని సేకరిస్తున్న అర్చకులు సత్యం

అద్దంకి : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో 19వ తేది జరిగే మహాకుంభాభిషేకానికి దేశంలోని ఐదు నదుల నుంచి పవిత్ర జలాలను తీసుకొని వచ్చే క్రమంలో మంగళవారం శ్రీరంగం వద్ద కావేరీ నది జలాలను పూజారి సత్యం సేకరించినట్లు ఈవో తిమ్మానాయుడు తెలిపారు.

మరో రెండు రోజులు నీటి సరఫరా బంద్

మార్టూరు, మే6 (ఆంధ్రజ్యోతి): మరో రెండురోజులు మార్టూరులో రక్షిత మంచినీటి సరఫరాకు ఆటకం ఏర్పడింది. చెరువునుంచి గ్రామంలో పంపిణీ చేసేందుకు నాలుగురోజుల నుంచి మండల కాంప్లెక్స్ వద్ద వంతెన క్రింద నూతనంగా పైపులైను వేస్తున్నారు. మరో రెండురోజులులో పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. అందువలన రెండు రోజుల తర్వాత గ్రామంలో మంచినీటిని సరఫరా చేస్తామని పంచాయతీ ఈవో తన్నీరు శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. కార్యక్రమాలు పూర్తయిన తర్వాత ఫిల్టరుబెడ్లు మరమ్మతు చర్యలు చేపడతామన్నారు. అందుకోసం మైనింగ్ నిధులు రూ.31 లక్షలు మంజూరయ్యాయన్నారు. వాటితో ఫిల్టరు బెడ్లనుండి ఇసుకను తోడివేసి, మరల కొత్తగా ఇసుకను నింపుతామన్నారు.అంతేగాకుండా ఫిల్టరు బెడ్ల నుంచి కొంతమంది తాగునీటిని తీసుకువెళుతూ నీటిని కలుషితం చేస్తున్నారన్నారు. అందుకని ఫిల్టరు బెడ్ల చుట్టూ పెన్సింగ్‌ను ఏర్పాటుచేస్తామన్నారు. దీనికి తోడు అక్కడ మొక్కల పెంపకం చేపడతామన్నారు.

ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	39.6	27.8
కావలి	36	28
ఆత్మకూరు	39	28
ఉదయగిరి	39	27
కందుకూరు	38	28

నిఘా నేత్రానికి

దొరికాయ్!

మూడు పులులు, 60కిపైగా చిరుతల పరుగులు



సీసీ కెమెరాకు చిక్కిన పెద్దపులి

ఎలుగుబంట్లు, నక్కలు, ముళ్లపందులు

సర్వేలో వెలుగులోకి వచ్చిన ఎన్నో రకాల వన్యప్రాణులు

టైగర్ కారిడార్‌తో అధికారుల అప్రమత్తం

నెల్లూరు (వెంకటేశ్వరపురం), మే 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పెద్దపులుల గాండ్రింపులు పెరిగినట్లు అటవీ శాఖ అధికారులు గుర్తించారు. నాలుగేళ్లకోసారి జరిగే టైగర్ సర్వేలో పెద్దపులులతోపాటు చిరుతలు, ఎలుగుబంట్లు ఇలా ఎన్నో రకాల జంతువులు, వన్యప్రాణులను గుర్తించారు. రాపూరు, ఆత్మకూరు, ఉదయగిరి రేంజ్‌ల పరిధిలోని సుమారు లక్ష హెక్టార్ల అటవీ ప్రాంతంలో ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం శేషాచలం టైగర్ కారిడార్‌గా గుర్తించింది. ఈ నేపథ్యంలో తాజాగా జరిగిన టైగర్ సర్వేలో పెద్దపులుల కదలికలు వేగంగా పెరిగినట్లు అటవీ శాఖఅధికారులు గుర్తించారు. ఈ మూడు రేంజ్‌ల పరిధిలోని అటవీ ప్రాంతంలో దాదాపు 250 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. మార్చి 5 నుంచి ఏప్రిల్ 20వ తేదీ వరకు 45 రోజులపాటు కెమెరాలతో నిఘా పెట్టి సర్వే చేశారు. ఈ సర్వేలో పెద్దపులులతోపాటు చిరుతల కదలికలూ పెరిగినట్లు గుర్తించారు. అలాగే ఎలుగుబంట్లు, రేసుకుక్కలు, నక్కలు, జింకలు, కణితలు, ముళ్లపందులు, అడవి పందులు, కుందేళ్లు, కోతులు, అడవి పిల్లులు, కొండ ముచ్చుల సంఖ్య విపరీతంగా పెరిగినట్లు గుర్తించారు.

● టైగర్ కారిడార్‌తో మరింత రక్షణ

జిల్లాలో టైగర్ కారిడార్ ఏర్పాటు కావడంతో వన్యప్రాణుల సంరక్షణపై అటవీ శాఖ మరింత దృష్టి సారించనున్నది. కారిడార్ ఏర్పాటుతో అటవీ ప్రాంతంలో అనేక చోట్ల నీటి వసతులు పెంచాల్సి ఉంది. అటవీ ప్రాంతం మీదుగా వెళ్లే రహదారుల వెంబడి పులులు ఉన్నట్లు బోర్డులను ఏర్పాటు చేయనున్నారు. అలాగే చెట్లను నరకకుండా చర్యలు తీసుకోవడంతోపాటు అటవీ విస్తీర్ణం పెంచాల్సి ఉంటుంది. అదేవిధంగా సమీప గ్రామాల్లోని ప్రజలకు టైగర్ కారిడార్, వాటి సంరక్షణ గురించి అవగాహన కల్పించాల్సి ఉంటుంది.

మరిన్ని సౌకర్యాలు కల్పిస్తాం

ఇప్పటికే మూడు రేంజ్‌ల పరిధిలోని సూమారు లక్ష హెక్టార్లలో శేషాచలం టైగర్ కారిడార్‌లో కలిపాము. ఈ ప్రాంతాల్లో పెద్దపులల కదలికలు ఉన్నాయి. రోజుకు వందల కి.మీ దూరం తిరుగుతూ ఉంటాయి. వాటికి అవసరమైన ఆహారం సమృద్ధిగా ఉన్నప్పుడే పులి కారిడార్ ప్రాంతంలో నిలుస్తుంది. ఇక పులులతోపాటు చిరుతలు కూడా ఎక్కువగా ఉన్నాయి. అందువల్ల వాటికి కావాల్సిన నీటి వసతులు, పొదల్లాంటి చెట్లను పెంచడం ఇలా అనేక ప్రత్యేక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నాము.

- మహబూబ్‌బాషా, డీఎఫ్‌వో





గుర్తించిన జంతువులు, వన్యప్రాణులు	పులులు మూడు	చిరుతలు 60	ఎలుగుబంట్లు 140	రేసుకుక్కలు 250	రుడ్డ ముంగిసలు 20	నక్కలు 100

ఇదిగో మరో హత్య!

- వేదాయపాలెం స్టేషన్ పరిధిలో ఘాతుకం
- అర్ధరాత్రి ఇంట్లోకి చొరబడిన అగంతకులు
- నిద్రపోతున్న రియల్టర్ ముఖంపై నరికి హత్య
- మృతుడికి స్వగ్రామంలో వివాదాలు, కేసులు
- పలు కోణాల్లో విచారిస్తున్న పోలీసులు
- వరుస ఘటనలతో భీతిల్లుతున్న నగరవాసులు

8 లో..



సోఫాపై చిన్నయ్య మృతదేహం

వరుస హత్యలతో నగరం అట్టుడుకుతోంది. రోజుల వ్యవధిలోనే నగరంలో ఏదో ఒకమూల అమాయకుల ప్రాణాలను బలిగొంటున్నారు. ఈ నెలలో ఆరు రోజుల వ్యవధిలో మంగళవారం రెండో హత్య వెలుగు చూసింది. వెంకటరెడ్డినగర్‌లో సోమవారం అర్ధరాత్రి ఓ ఇంట్లోకి జొరబడిన అగంతకులు ఓ వ్యక్తిని నిర్ధాక్షిణ్యంగా నరికి చంపారు. ఆ తర్వాత ఎంచక్కా పరారయ్యారు. అయితే, మృతుడికి ఆర్థిక లావాదేవీలు, భూ వ్యవహారాలు తదితర అంశాలపై ప్రత్యర్థులతో విభేదాలు ఉన్నాయి. ఈ కారణాలతోనే ఎవరైనా సుఫారీ ఇచ్చి ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారా!? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రోజుల వ్యవధిలో హత్యలు జరుగుతుండటంతో నగరవాసుల్లో భయాందోళన నెలకొంది. ఇటీవల జరిగిన జంట హత్యలపై రాష్ట్ర పోలీస్‌బాస్ జిల్లా పోలీస్ యంత్రాంగంపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ తర్వాత మేల్కొన్న పోలీసులు కొన్ని రోజుల పాటు తనిఖీల పేరుతో హడావుడి చేసి ఆ తర్వాత చేతులెత్తేశారు.



ఇష్టానుసారం

- అవసరానికి మించి ఎరువులు, పురుగు మందుల పిచికారీ
- రైతులకు పెరిగిపోతున్న వ్యవసాయ ఖర్చులు
- మనుషులు, పశువుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం

వాడేస్తున్నారు!

నెల్లూరు (వ్యవసాయం), మే 6 (ఆంధ్రజ్యోతి) : ఎంత ఎక్కువగా ఎరువులు వినియోగిస్తే పంట దిగుబడులు అంత బాగుంటాయి. పురుగు మందులు ఎంత ఎక్కువ వాడితే పంటలకు పురుగుల తాకిడి అంతగా తగ్గుతాయి.. ఎరువులు, పురుగుల మందుల వాడకంపై రైతుల నుంచి సాధారణంగా వినిపించే అభిప్రాయాలు. ఈక్రమంలో అన్నదాతలు ఇష్టానుసారంగా ఎరువులు, పురుగు మందులు వినియోగిస్తున్నారు. అయితే మోతాదుకు మించి ఎరువుల వాడకం వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండకపోగా మట్టి చౌడుగా మారే ప్రమాదం ఉందన్న విషయంపై వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతోంది. దీంతో వ్యవసాయంలో పెట్టుబడులు పెరిగిపోతున్నాయి.

● అవసరం లేకపోయినా...

ఎరువుల వినియోగం ప్రతి సంవత్సరం పెరిగిపోతోంది. దీనికి వ్యవసాయ శాఖ వద్ద ఉన్న లెక్కలే నిదర్శనం. ఎకరా పొలంలో 70కేజీల యూరియా, 50 కేజీల డీఏపీ, 27 కేజీల పొటాష్ ఎరువులు వినియోగం సరిపోతుందని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సిఫారసు చేస్తున్నారు. కాంప్లెక్స్ ఎరువులను కేవలం దుక్కిలో మాత్రమే వాడాలి. అయితే క్షేత్రస్థాయిలో అంతకుమించి ఎరువుల వినియోగం జరుగుతోంది. కాంప్లెక్సు ఎరువులు పంటల సాగులోనూ వినియోగిస్తున్నారు. రైతులకు ఏవైనా సందేహాలు వస్తే నేరుగా వ్యాపారులను ఆశ్రయించడం కూడా అధిక ఎరువుల వినియోగానికి ఒక కారణంగా కనిపిస్తోంది. పైరుకు చీడపీడలు సోకకుండా ముందస్తుగా ఈ మందు స్ప్రే చేయండంటూ వ్యాపారులు సలహాలు ఇస్తుంటారు. దీంతో అవసరం లేకపోయినా పైరు పాడవుతుందన్న ఆందోళనతో రైతులు కొనుగోలు చేసి వాడేస్తున్నారు. అదీనూగాక రైతుల వద్ద పెట్టుబడులు లేకపోవడం, అవసరమైన సమయంలో ఎరువులు, పురుగు మందులు వ్యాపారులు అప్పులకు ఇవ్వడంతో వారి సలహాలను తీసుకునే పరిస్థితి నెలకొందని పలువురు అధికారులు, రైతులు చెబుతున్నారు.



● పెరిగిన వ్యవసాయ ఖర్చులు

పంటల సాగులో రైతులు అవలంబిస్తున్న పద్ధతుల్లో కొన్ని మార్పులు వచ్చాయే తప్ప అధిక శాతం మంది ఒకే పద్ధతిలో సాగు చేస్తున్నారు. ఎరువుల వినియోగంపై ఐదేళ్లుగా వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు చేస్తున్న సిఫారసుల్లో పెద్దగా మార్పులేవీ లేవు. గతంలో ఎకరా పొలంలో వరి సాగుకు దాదాపు రూ.16వేల నుంచి 20వేల వరకు ఖర్చయ్యేది. ఇందులో సగం ఎరువులు, వాటిని పిచికారీ చేసే కూలీల ఖర్చే. ఇప్పుడు రూ.25వేల నుంచి 30వేల వరకు ఖర్చవుతోంది. ఇందులోనూ ఎరువులకే అధిక మొత్తం ఖర్చవుతోంది. బస్తాలకు బస్తాలు ఎరువుల వినియోగించడమే కారణం. మోతాదుకు మించి ఎరువులు వినియోగించడం వల్ల తెగుళ్ల నాశనమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. పైగా కొత్త కొత్త తెగుళ్ల పుట్టుకొస్తున్నాయి. దీంతో ప్రతి ఏడాది అంతకు మించి ఎక్కువ శక్తి కలిగిన ఖరీదైన మందుల వాడకం అవసరమవుతోంది. దీంతో అన్నదాతలకు పెట్టుబడి ఖర్చులు విపరీతంగా పెరిగిపోతున్నాయి.

ఐదేళ్లలో ఎరువుల వినియోగం ఇలా.. (మెట్రిక్ టన్నులలో)

సంవత్సరం	యూరియా	డీఏపీ	ఎంఓపీ	కాంప్లెక్సు	ఎస్ఎస్పీ
2020-21	155805	26306	108550	28355	14255
2021-22	131011	11104	83574	20617	12628
2022-23	112911	80232	83946	26505	14286
2023-24	133276	80673	87902	24135	12320
2024-25	112460	21454	22382	74002	13132

భూసార పరీక్షలకు అనుగుణంగానే..



ఇష్టానుసారంగా ఎరువులు, పురుగు మందుల పిచికారీతో రైతుకు అదనపు ఖర్చులు పెరుగడమే తప్ప ఎలాంటి ప్రయోజనం లేదు. భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి. వాటి ఫలితాల ఆధారంగానే ఎరువులను వినియోగించాలి. అదేవిధంగా పంటల సాగులో వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటించాలి. మోతాదుకు మించి ఎరువులు, పురుగు మందులు వాడటం వల్ల చీడపీడల ఉధృతి పెరుగుతుంది.

- పి.సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి

అనారోగ్య సమస్యలు తప్పవు



పంటల సాగులో మోతాదుకు మించి ఎరువులు, పురుగు మందుల పిచికారీ జరుగుతోంది. కూరగాయలు ఇతరత్రా వాటిలో క్రిమి సంహారక మందుల అవశేషాలు ఎంతో కొంత ఉంటున్నట్లు పలు నివేదికలు కూడా చెబుతున్నాయి. వీటి వల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి.. అధికంగా గ్యాస్ట్రిక్ సమస్యలు వస్తున్నాయి. అలర్జీలు, కళ్లలో మంటలు, తల తిరగడం, కొన్ని రకాల కేన్సర్లు మహిళల్లో ముఖ్యంగా హార్మోన్ల స్థాయిల్లో అసమతుల్యత ఎక్కువగా ఉంటోంది. ముఖ్యంగా వ్యాధి నిరోధకశక్తి తగ్గిపోతోంది.

- డాక్టర్ బి.కృష్ణమూర్తి, అసోసియేట్ ప్రొఫెసర్

తాగునీటి ఎద్దడి లేకుండా చూడండి

● జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరు (జడ్పీ), మే 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈ వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ గ్రామీణ నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. తాగునీటి పథకాల నిర్వహణపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో మంగళవారం ఆమె చాంబర్‌లో సమీక్ష జరిపారు. ఎక్కడైనా మోటర్లు, పైప్ లైన్లు మరమ్మతులకు గురైతే వెంటనే బాగు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మరమ్మతు పనులకు సంబంధించిన బిల్లులను వెంటనే తెప్పించుకుని నిధులు మంజూరు చేయాలన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో విద్యారమ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకట రమణ, ఈఈలు, డీఈలు పాల్గొన్నారు.



ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్షిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

అన్నీ సక్రమమేనా!?

- అక్రమ లేఅవుట్లపై సర్వే ప్రారంభం
- 17 మంది.. 17 మండలాల్లో ఆరా

నెల్లూరు (జడ్పీ), మే 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అక్రమ లే అవుట్లపై రాష్ట్ర టౌన్‌ప్లానింగ్ అధికారులు సర్వే ప్రారంభించారు. అక్రమ లేవుట్ల క్రమబద్ధీకరణకు ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలన్న దానిపై మోడల్‌గా జిల్లాలో సర్వేకు రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర టౌన్ ప్లానింగ్ విభాగంలోని 17 మంది అధికారులను నియమించి, నగరం, మున్సిపాలిటీలతోపాటు మండలాల్లో సర్వే చేయాలని ఆదేశించారు. దీంతో జిల్లాకు వచ్చిన అధికారులు మంగళవారం సర్వేకు శ్రీకారం చుట్టారు. 17 మంది అధికారులు 17 మండలాల్లో తొలిగా స్థానిక అధికారులతో కలిసి సర్వే చేస్తున్నారు. అక్రమ లేఅవుట్లు ఎన్ని ఉన్నాయి, వాటి పరిస్థితి ఏమిటి? ఇళ్లు నిర్మించారా!? లేదా!? ప్రభుత్వ భూములు ఆక్రమించారా!? క్రమబద్ధీకరణ ఎలా చేయవచ్చు? అదితర అంశాలపై ఆరా తీస్తున్నారు. అలాగే నుడా నిబంధనలకు అనుగుణంగా లేఅవుట్ల ఉన్నాయా!? లేదా అనికూడా పరిశీలిస్తున్నారు.



మృత్సంగ్రహణం కార్యక్రమం నిర్వహిస్తున్న అర్చకులు

అంకురార్పణతో

ఆరంభం

అట్టహాసంగా వేదగిరి బ్రహ్మోత్సవాలు

నెల్లూరు రూరల్ (ఆంధ్రజ్యోతి) : వేదగిరి క్షేత్రంలో లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా మొదలయ్యాయి. మంగళవారం అంకురార్పణ ఘట్టాన్ని అర్చక బృందం నిర్వహించింది. ముందుగా కంకణాలు, దీక్షా వస్త్రాలను లాంఛనప్రాయంగా స్వీకరించారు. అనంతరం మృత్సంగ్రహణం, యాగశాల ప్రవేశం జరిగాయి.

న్యూస్ బాక్స్

కోడి పందేల స్థావరంపై పోలీసుల దాడి

ఉలవపాడు, మే 6(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కరేడు గ్రామం రెడ్డిపాలెం శివారు ప్రాంతంలో జరుగుతున్న కోడి పందేల స్థావరంపై మంగళవారం సాయంత్రం తన సిబ్బందితో కలిసి ఎస్‌ఐ అంకమ్మ దాడులు చేశారు. 10 మంది కోడి పందెం జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 4 పందెం కోళ్లు, 10 బైకులు, రూ.18,500 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

కిశోరి వికాసంతోనే సమాజాభివృద్ధి

వలేటివారిపాలెం, మే 6(ఆంధ్రజ్యోతి) : కిశోరి బాలికల వికాసంతోనే సమాజాభివృద్ధి సాధ్యమని ఐసీడీఎస్ కందుకూరు ప్రాజెక్టు సీడీపీవో శర్మిష్ట తెలిపారు. మండలంలోని బడేవారిపాలెం, నూకవరం అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం కిశోరి బాలికల వికాశంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత, కార్యకర్తలు మృదుల, సుమలత, ఏఎన్ఎంలు లావణ్య, అనీత, తదితరులు పాల్గొన్నారు.

బాలికల స్వీయ రక్షణపై అవగాహన ఉండాలి

కలిగిరి, మే 6(ఆంధ్రజ్యోతి): కిశోరి బాలికల స్వీయ రక్షణపై అవగాహన కలిగి ఉండాలని వింజమూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి పద్మజకుమారి పేర్కొన్నారు. మండలంలోని పెదకొండూరులో మంగళవారం జరిగిన కిశోరి వికాసంపై అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ హైమావతి, అంగన్‌వాడీ వర్కర్ షాహిదా, కిశోర బాలికలు, పాల్గొన్నారు.

గ్రామ సచివాలయంలో ఎంపీడీవో తనిఖీ

వలేటివారిపాలెం, మే 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నేకునాంపురం గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఎంపీడీవో నరేంద్ర దేవ్ ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టరు, మూమెంట్ రిజిస్టరును తనిఖీ చేశారు. ఈ సమయంలో వీఆర్వో మినహా మిగిలిన సిబ్బంది అందరూ విధుల్లో ఉన్నట్లు తెలిపారు.

లైవ్‌స్టాక్ అసిస్టెంట్ అనుపమకు పదోన్నతి

వలేటివారిపాలెం, మే 6(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోకూరు పశువైద్యశాలలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బొప్పరాజు అనుపమకు జూనియర్ వెటర్నరీ ఆఫీసర్‌గా పదోన్నతి లభించింది. దీంతో ఆమెను ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం కొలసానకోట గ్రామీణ పశువైద్యశాలకు బదిలీ చేశారు.

మోటారు, కేబుల్ చోరీపై పోలీసులకు ఫిర్యాదు

కొండాపురం, మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని గరిమెనపెంట పంచాయతీ తాగునీటి పథకంకు సంబంధించిన మోటారు, కేబుల్ గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల మేరకు.. జలజీవన్ మిషన్ కింద మూడు వాటర్ స్కీములు ఉండగా గరిమెనపెంట గ్రామానికి చెందిన నీటి సరఫరాకు స్థానిక పిల్లాపేరువాగులో ఉన్న 5 హెచ్‌పీ మోటారు, కేబుల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

లింగసముద్రం, మే 6(ఆంధ్రజ్యోతి): లింగసముద్రంలో పారిశుధ్యం మెరుగుకు సర్పంచు పులి రాఘవులు, పంచాయతీ కార్యదర్శి ఎం మాధవరావు మంగళవారం చర్యలు చేపట్టారు. గత ఏడాది డిసెంబరులో పంచాయతీలోని పలు గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. ప్రస్తుతం మురుగు కాలువల్లో చెత్తా చెదారం పేరుకొని పోయి దుర్వాసన వస్తుండడంతో పాటు దోమలు వ్యాపించడంతో ప్రజల వినతి మేరకు కాలువల్లో పారిశుధ్య కార్మికులు మురుగు, చెత్తాచెదారం తొలగించారు. పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ మరో రెండు, మూడు రోజులు లింగసముద్రంతో పాటు పంచాయతీలోని వాకమళ్లవారిపాలెం, జంపాలవారిపాలెం, బలిజపాలెం, జంగంరెడ్డిపాలెం గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టిన అనంతరం బ్లీచింగ్ చల్లించి, ఎబేట్ మందు స్ప్రే చేయిస్తామని చెప్పారు.

ఇన్‌చార్జి ఏపీవోగా దయా సాగర్

లింగసముద్రం, మే 6 (ఆంధ్రజ్యోతి) : ఉపాధిహామీ పథకం మండల ఇన్‌చార్జి (ఎఫ్ఏసీ) ఏపీవోగా దయాసాగర్ నియమితులయ్యారు. ఆయన మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏపీఓగా పని చేస్తున్న షేక్ సమీర్‌బాషా ఈనెల 4వ తేదీ నుంచి 45 రోజుల పాటు సెలవుపై వెళ్లిపోయారు. అలాగే లింగసముద్రం ఉపాధిహామీ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్లుగా పని చేస్తున్న రేఖ సెలవుపై వెళ్లగా, మధు అనే మరో కంప్యూటర్ ఆపరేటర్ బదిలీపై వెళ్లారు. దీంతో జలదంకి మండలం ఉపాధి హామీ కార్యాలయంలోని కంప్యూటర్ ఆపరేటర్ కె.మల్లికార్జునను నియమించగా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.



అడవిరాజుపాలెంలో అలంకారప్రాయంగా ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకు

రక్షిత మంచినీటి పథకానికి

రాజకీయ గ్రహణం!?

గుడ్లూరు, మే 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవిరాజుపాలెంలో తాగునీటి పథకం పనులకు రాజకీయ గ్రహణం పట్టింది. లక్షలాది రూపాయలతో చేపట్టిన పనులు చివరి దశలో అర్థాంతరంగా ఆగిపోవడంతో ప్రజలు తాగునీటికి కటకటలాడుతోన్నారు. ఈ క్రమంలో ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి వినియోగించుకొంటున్నారు. అయినా అధికారులు తమకెందుకులే అన్నట్లు చోద్యం చూస్తున్నారు. దీంతో దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించడు అన్నచందంగా మారింది గ్రామస్థుల పరిస్థితి. వివరాల మేరకు... అడవిరాజుపాలెంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం 2023-24 ఆర్థిక సంవత్సరంలో జలజీవన్ మిషన్ కింద రూ.43 లక్షల మంజూరయ్యాయి. ఆ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ 80 శాతం పనులు పూర్తి చేశారు. మిగిలిన 20 శాతం పనులు ముందుకు సాగనివ్వకుండా అధికారులే అడ్డంకులు సృష్టిసున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. గత ఆరేడు నెలలుగా జలజీవన్ మిషన్ పనులు నిలిచిపోవటంతో లక్షలు వెచ్చించినా ప్రయోజనం లేకుండాపోయిన దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులు అనుగ్రహిస్తే రెండు మూడు రోజుల్లో పనులు పూర్తి చేసి గ్రామంతో పాటు ఎస్సీ, బీసీ కాలనీలకు కొరతలేకుండా నీరందిస్తానని గ్రామసర్పంచు వారిచుట్టూ తిరుగుతున్నా ప్రయోజనం లేకపోవడంతో ప్రజలకు అవస్థలు తప్పటం లేదు. టెండర్ దక్కించుకున్న గ్రామ సర్పంచు వీ.నాగేశ్వరరావు గ్రామంలో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణంతో పాటు కొంతమేర ప్రధాన పైపులైన్లు, నీటి ఆధారంగా ఉన్న బావి, బోర్ల నుంచి ఓవర్ హెడ్‌ట్యాంకు వరకు పైపులైను నిర్మాణ పనులు కూడా పూర్తి చేయించారు. ఇక చేయాల్సిందల్లా ఎస్సీ, బీసీ కాలనీలకు రమారమి 3 కిలో మీటర్ల మేర పైపులైన్లు నిర్మాణం, కనెక్టివిటీ పనులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. వీటికి కూడా అవసరమైన పైపుల కొనుగోలు, పైప్‌లైన్ల నిర్మాణం కోసం ఎర్త్‌వర్క్ లాంటి పనులు కూడా ఆరునెలల క్రితమే పూర్తయ్యాయి. అయితే మిగిలిన ఈ పనులు తాము చేయాల్సిందేనంటూ ఎస్సీ కాలనీకి చెందిన ఇద్దరు టీడీపీ నాయకులు పట్టుబట్టడంతో పనులు నిలిచిపోయాయి. టెండర్ అగ్రిమెంటు అంతా జరిగి 80 శాతం పనులు పూర్తవటమే గాక మిగిలిన పనికి అవసరమైన మెటీరియల్ కూడా కొనుగోలు చేసి ఉన్న దశలో అదిసాధ్యం కాదని వారికి వాస్తవ పరిస్థితిని వివరించి త్వరితగతిన పనులు చేయించి ప్రజలకు తాగునీరందించాల్సిన అధికారులు అదంతా మాకెందుకులే అన్నట్లు పనులు నిలిపివేయించి కూర్చోవడంపై పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఫలితంగా ప్రజలు మండుటెండల్లో దాహార్తితో అల్లాడిపోతుండటమేగాక గృహ అవసరాలకు కూడా నీటిని కొనుగోలుచేసి ట్యాంకర్లతో తోలించుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. అధికారులు, పాలకులు తగినచర్యలు తీసుకుని అడవిరాజుపాలెం గ్రామస్థుల దాహం తీరేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పూడిపోతున్న పైపులైన్ల కోసం తీసిన గోతులు



అధికారులు అనుమతించకపోవడంతో పక్కన పడేసిన పైపులు

త్వరలో పనుల ప్రారంభానికి చర్యలు

అడవిరాజుపాలెంలో గతంలో అగ్రిమెంటు జరిగి 80 శాతం పనులు కూడా పూర్తయ్యాయి. అయితే ఇటీవల స్థానికంగా ఒకరిద్దరు ఆపని మేము చేయాలని అడ్డంకులు సృష్టిస్తుండగా అది సాధ్యం కాదని చెప్పాం. దీంతో సమస్య వచ్చి పనులు నిలిచిపోయాయి. ఈ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి రెండు మూడు రోజుల్లో పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటాం. త్వరలోనే ప్రజల తాగునీటి కష్టాలు తీరుస్తాం.

- రాజశేఖర్, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్

సోషల్ మీడియాపై అవగాహన తప్పనిసరి

● ఉమాశంకర్, ఎస్ఐ



కలిగిరి, మే 6(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో ప్రతి విషయాన్ని సోషల్ మీడియా వేదికగా ప్రజలకు చేరువ అవుతోంది. అలాంటి సోషల్ మీడియాపై స్మార్ట్‌ఫోన్ వాడే ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ ఉమా శంకర్ తెలిపారు.

? సోషల్ మీడియాపై అవగాహన లేకపోతే తలెత్తే ఇబ్బందులేవి.

! ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్ వాడే ప్రతి ఒక్కరు సోషల్ మీడియాలో వచ్చే విషయాలపై అవగాహన కలిగి ఉండాలి. వ్యక్తిగత ప్రతిష్టకు భంగం కలిగించే వార్తలను ఫార్వర్డ్ చేస్తే చట్టప్రకారం శిక్షింపబడుతారు.

? సైబర్ నేరాలకు ఎలా పాల్పడతారు.

! సైబర్ నేరగాళ్లు ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకొని బ్యాంక్ నుంచి కాల్ చేస్తున్నాం.. మీ బంధువులు అరెస్టు అయ్యారు.. మీకు లాటరీ తగిలింది.. పోస్టు ఖర్చులు పంపిస్తే బహుమతి ఇంటి వద్ద అందుతుంది. మీరు చట్టవిరుద్ధమైన వస్తువులు కలిగి ఉన్నారు.. జరిమానా చెల్లించాల్సి ఉంటుంది.. అంటూ అపరిచిత వ్యక్తులు చేసే ఫోన్‌కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి.

? సైబర్ నేరగాళ్ల నుంచి ఎలా తప్పించుకోవాలి.

! సైబర్ నేరగాళ్ల నుంచి బెదిరింపు కాల్స్ వచ్చినప్పుడు ధైర్యంగా ఉండాలి. అకౌంట్ నెంబర్లు, ఓటీపీలు చెప్పకూడదు. బ్యాంకు ఖాతా నుంచి నగదు పోతే వెంటనే 1930కి కాల్ చేస్తే అకౌంట్‌ను హోల్డ్ చేస్తారు. బ్యాంకు వద్దకు వెళ్లి తగిన ఆధారాలు చూపితే నగదు తిరిగి అకౌంట్‌కు జయచేయడానికి చర్యలు తీసుకుంటారు.



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నిరసనన తెలుపుతున్న ఆశా వర్కర్లు

వైద్య సిబ్బందికి 'హంస' అండగా ఉంటుంది

కలిగిరి, మే 6(ఆంధ్రజ్యోతి): వైద్య శాఖలో పనిచేసే సిబ్బందికి ఏపీ హంస అసోసియేషన్ అండగా ఉంటుందని ఆ అసోసియేషన్ నెల్లూరు జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కప్పా నారాయణ పేర్కొన్నారు. రేపల్లె అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంగా పనిచేస్తూ పని ఒత్తిడికి గురై ఆత్మహత్యకు పాల్పడిన సింగోటి కోటేశ్వరమ్మకు స్థానిక పీహెచ్‌సీలో సిబ్బంది మంగళవారం శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఏపీ హంస అసోసియేషన్ వింజమూరు తాలూకా సభ్యులు ఎస్ సాయిలక్ష్మి, తిరుపతిరావు, నలిశెట్టి లక్ష్మీప్రసాద్, షేక్ రియాజ్, ఆశా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే పూర్తి చేయాలి : డీఐవో

కందుకూరు, మే 6(ఆంధ్రజ్యోతి): ఆశా యాప్‌లో పొందుపరిచిన ఇంటింటి సర్వేను ఆశా వర్కర్లు తక్షణం పూర్తి చేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టరు ఉమామహేశ్వరి తెలిపారు. ఆశా డే కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆమె పట్టణంలోని అడ్వాన్స్‌డ్ హెల్త్ సెంటర్లు, మాచవరం పీహెచ్‌సీలను సందర్శించి ఆశా సర్వే రికార్డ్స్ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ఆశాలు నూరు శాతం విజయవంతంగా నిర్వహించేలా వారికి అవగాహన కల్పించటంతో పాటు వైద్యాధికారులు, నోడల్ ఆఫీసర్లు బాధ్యతతో పర్యవేక్షించాలని కోరారు.



కందుకూరు : మాట్లాడుతున్న డీఐవో డాక్టరు ఉమామహేశ్వరి



బిట్రగుంట : ఆశా వర్కర్లతో మాట్లాడుతున్న డాక్టర్ నిత్యప్రశాంతి

మాతా శిశు సంరక్షణపై అవగాహన

బిట్రగుంట : మాతా శిశు సంరక్షణ, వారు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పించాలని వైద్యాధికారి నిత్యప్రశాంతి పేర్కొన్నారు. బోగోలు మండలం కోవూరుపల్లి పీహెచ్‌సీలో ఏఎన్ఎం, ఆశాలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వేసవి కాలంలో గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ప్రవీణ్‌కుమార్, రాజశేఖరన్, పీహెచ్‌వో సులోచన, తదితరులు పాల్గొన్నారు.

కొత్త యాప్‌లో సర్వే వివరాలు

లింగసముద్రం : కొత్తగా రూపొందించిన యాప్‌లో అన్ని రకాల సర్వే వివరాలను ఆశా వర్కర్లు నమోదు చేయాలని లింగసముద్రం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ .రమేష్ చెప్పారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే సందర్భంగా ఆశా వర్కర్లతో నిర్వహించిన సమావేశంలో కొత్త యాప్‌పై ఆయన అవగాహన కల్పించారు. ఆశాలు ఇంటింటి సర్వే నిర్వహించి గర్భిణులు, బాలింతలు, జనన మరణాల సర్వేతో పాటు సంక్రమిత, అసంక్రమిత వ్యాధుల వివరాలను నమోదు చేసి కొత్త యాప్‌లో అప్లోడ్ చేయాలన్నారు. అలాగే జాతీయ కార్యక్రమాలన్నింటిలో నూరు శాతం లక్ష్యాలను సాధించాలని చెప్పారు.

ఐడీఎస్‌ఎంటీ ప్లాట్ల కేటాయింపుపై సమీక్ష

కావలి, మే 6(ఆంధ్రజ్యోతి) : కావలి పట్టణం బాహూజీనగర్‌లో గతంలో మున్సిపాల్టీ వేసిన లేఅవుట్‌లో మిగిలి ఉన్న 79 ఇంటిగ్రేటెడ్ డవలప్‌మెంట్ ఆఫ్ స్మాల్ అండ్ మీడియం టన్ (ఐడీఎస్ఎంటీ) ప్లాట్లు కేటాయింపుపై లోకల్ లెవల్ కోఆర్డినేషన్ కమిటీ (ఎల్ఎల్‌సీసీ) మంగళవారం కావలి మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో సమావేశమైంది. కమిటీ అధ్యక్షుడైన గుంటూరు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డైరెక్టర్ హరికృష్ణ, సభ్యులు గుంటూరు రీజనల్ డైరెక్టర్ టౌన్‌ప్లానింగ్ మధుకుమార్, కావలి ఆర్డీవో ఎం. సన్నీ వంశీకృష్ణ, నెల్లూరు పబ్లిక్ హెల్త్ సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, కావలి మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్‌లు సమావేశమై ప్లాట్లు ఏ ప్రాతిపదికన ప్రజలకు కేటాయించాలనే దానిపై సుదీర్ఘంగా చర్చించారు. ముందుగా క్షేత్రస్థాయిలో సర్వే చేసి వాటి స్థితిగతులు తెలుసుకున్న తర్వాతనే తదుపరి కార్యాచరణ చేపట్టాలని నిర్ణయించారు. అయితే గతంలో ఆ ప్లాట్ల కేటాయింపు కోసం కొంత మంది అప్పటి వాటి విలువలో 10 శాతం డిపాజిట్ కట్టి ఉన్నారు. అయితే కోర్టు వివాదాల కారణంగా కేటాయింపులు ఆగిపోయాయి. అయితే ప్రస్తుతం వాటి మార్కెట్ విలువ విపరీతంగా పెరగడంతో మార్కెట్ ధర ప్రకారం వాటి రేట్లు పెంచి కేటాయించాలా లేక వేలం పాట ద్వారా ఎవరు ఎక్కువ ధరకు పాడితే వారికి కేటాయించాలా అనేదానిపై చర్చించినట్లు తెలిసింది. గతంలో ప్లాట్ల కోసం డిపాజిట్లు కట్టిన వారు కోర్టుకు వెళ్లకుండా వారిని ఎలా సంతృప్తి పరచాలనే దానిపై కూడా చర్చించి నట్లు తెలిసింది. ఏది ఏమైనా వేలం పాటకే ప్రాధాన్యత ఇస్తే మున్సిపల్ ఆదాయం పెరుగుతుందనే భావం వ్యక్తపరిచినట్లు తెలిసింది. కమిటీ అభిప్రాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ అనుమతి మేరకు తదుపరి నిర్ణయం తీసుకొనేందుకు అధికారులు నిర్ణయించారు.

నేరాల నియంత్రణకు డ్రోన్ ఉపయోగం

● కందుకూరు డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యం

కందుకూరు, మే 6(ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకలాపాలను గుర్తించి నేరాలను నియంత్రించేందుకు డ్రోన్ కెమెరాలు పోలీసుశాఖకు ఎంతగానో ఉపయోగపడతాయని కందుకూరు డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. విపత్తుల సమయాల్లో బాధితులను ఆదుకునేందుకు డ్రోన్‌ల పనితీరు ఇప్పటికే నిరూపితమైందని తెలిపారు. ఇండోసోల్ సోలార్ ఎనర్జీ కంపెనీ వారు కందుకూరు డీఎస్పీ కార్యాలయానికి అత్యాధునిక సాంకేతికతతో కూడిన డీజేఐ ఎయిర్ 3ఎస్ డ్రోన్‌ను మంగళవారం అందజేశారు. జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ సూచనతో ఈ డ్రోన్‌ను పోలీసుశాఖకు అందజేస్తున్నట్లు ఇండోసోల్ సంస్థ ప్రతినిధులు తెలిపారు. డీఎస్పీ మాట్లాడుతూ ఈ డ్రోన్ కెమెరా అత్యధిక రెజిల్యూషన్ కలిగిన వీడియోలు, ఫొటోలు తీయగలదని, దీనిద్వారా విస్తృత ప్రాంతాల్లో నిఘా ఉంచటానికి, నేరస్థులను పరిశీలించటానికి, ట్రాఫిక్‌ను పర్యవేక్షించటానికి కూడా వీలవుతుందని తెలిపారు. అటవీ ప్రాంతాలు, తోటలు, ఎడారులు, ఇతర బహిరంగ ప్రదేశాల్లో జరిగే వివిధ అసాంఘిక కార్యకలాపాలను గుర్తించి దాడులు చేసేందుకు ఈ డ్రోన్ కెమెరా ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. కార్యక్రమంలో గుడ్లూరు సీఐ మంగారావు, ఎస్ఐ వెంకటరావు, ఇండోసోల్ సిబ్బంది పాల్గొన్నారు.



డీఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు డ్రోన్ కెమెరాను అందజేస్తున్న ఇండోసోల్ కంపెనీ ప్రతినిధులు

మండల సమావేశానికి ఎంపీటీసీల డుమ్మా

● కోరం లేక వాయిదా

కావలి రూరల్, మే 6(ఆంధ్రజ్యోతి): కావలి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన మండల పరిషత్ సాధారణ సమావేశానికి వైసీపీ ఎంపీటీసీలు డుమ్మా కొట్టారు. దీంతో కోరం లేక సమావేశం వాయిదా పడింది. సమావేశానికి హాజరైన ఎంపీపీ ఆలూరు కొండమ్మ, జడ్పీటీసీ జంపాని రాఘవులు, సర్వాయపాలెం, తుమ్మలపెంట ఎంపీటీసీలు జంపాని శ్రీనివాసులు, మునెమ్మ, కోఆప్షన్ సభ్యుడు ఖలీల్, ఆముదాలదిన్నె, కొత్తపల్లి, ఆర్సీపాళెం సర్పంచులు ఊడా బ్రహ్మానందం, చిమ్మిలి శ్రీహరినాయుడు, పేముల రాజేంద్ర, ఎంపీడీవోతోపాటు వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. వీరంతా ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు సభ్యుల కోసం ఎదురు చేశారు. కానీ పలువురు వైసీపీ ఎంపీటీసీలు కార్యాలయం వద్దకు వచ్చినా సమావేశానికి హాజరుకాకుండా చెట్ల కిందనే ఉండడంతో కోరం లేక సమావేశాన్ని వాయిదా వేశారు.



ఎంపీడీవోతో కలిసి సమావేశానికి హాజరైన ఎంపీపీ కొండమ్మ

లింగనిర్ధారణ నిషేధిత చట్టాన్ని అతిక్రమించొద్దు

● డిప్యూటీ డీఎంహెచ్‌వో రజని

కందుకూరు, మే 6(ఆంధ్రజ్యోతి): లింగనిర్ధారణ నిషేధిత చట్టాన్ని ఎవరు అతిక్రమించినా కఠిన చర్యలు తప్పవని కందుకూరు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టరు రజనీ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని రఘు డయగ్నోస్టిక్స్ సెంటర్, అత్తోట హాస్పిటల్స్ ప్రభుత్వ ఏరియా వైద్యశాలల్లోని స్కానింగ్ సెంటర్లను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భాధారణకు, ప్రసవానికి ముందు స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం వడ్డెపాలెంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను సందర్శించి గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, హైరిస్క్ గర్భిణుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆశా వర్కర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో శ్రీనివాసులు, అర్బన్ హెల్త్‌సెంటర్ వైద్యాధికారిణి బ్యూలాగ్రేస్, సీహెచ్ఎన్ ఉన్నం పద్మ తదితరులు పాల్గొన్నారు.



స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు నిర్వహిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టరు రజని

అల్లుకున్న నిర్లక్ష్యం!

వలేటివారిపాలెంలోని ప్రభుత్వ కార్యాలయాల కాంప్లెక్‌లో పొలాలకు వెళ్లే దారిలో విద్యుత్ స్తంభాలకు తుప్పర్లు తీగలు దట్టంగా అలుకోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యానికి ఇది నిలువుదట్టంగా మారింది. ఈ తీగలు వలన విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ అవుతుందని, విద్యుత్ స్తంభానికి కూడా విద్యుత్ సరఫరా జరిగి పంట పొలాల్లోకి వెళ్లే వారికి షాక్ కొడుతోందని రైతులు పేర్కొంటున్నారు. అంతేగాకుండా మూగజీవాలు కూడా విద్యుత్ ప్రమాదాలతో మృత్యువాత పడే అవకాశాలు ఉన్నాయని రైతులు చెబుతున్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ సిబ్బంది స్పందించి విద్యుత్ స్తంభం చుట్టూ అల్లుకున్న తీగలను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

- వలేటివారిపాలెం,(ఆంధ్రజ్యోతి)



వలేటివారిపాలెంలో విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న చెట్ల తీగలు

కుంగిన సీసీ రోడ్డుతో పొంచిఉన్న ప్రమాదం

కావలి పట్టణం క్రిష్టియన్‌పేట మెయిన్ రోడ్డులో కుంగిన సీసీ రోడ్డుతో ప్రమాదం పొంచిఉంది. ఈ ప్రాంతంలో అధికంగా వైద్యశాలలు, కళాశాలలు ఉండడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ మార్గంలో గతంలో నిర్మించిన సీసీ రోడ్డు మధ్యలో కొంత మేరకు కుంగడంతో వేగంగా వచ్చే వాహనాలు ఆ గుంతలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. తరచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా స్పందించి రోడ్డు దెబ్బతిన్న ప్రాంతంలో మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

- కావలిరూరల్,(ఆంధ్రజ్యోతి)



క్రిస్టియన్‌పేట ప్రధాన వీధిలో దెబ్బతిన్న సీసీ రోడ్డు

పాఠశాల ప్రహరీ నిర్మించరా?

వలేటివారిపాలెం, మే 6(ఆంధ్రజ్యోతి) : వలేటివారిపాలెంలోని ఎంపీపీ స్కూల్ ప్రహరీ గోడను మూడేళ్ల క్రితం కొంతభాగం కూలదోశారు. దానిని తిరిగి నిర్మించకుండా అలాగే వదిలేశారు. దీంతో పాఠశాల ఆవరణంలో అపరిశుభ్రత వాతావరణం నెలకొంది. వివరాల మేరకు.. వలేటివారిపాలెం హైస్కూల్‌కు నాబార్డు నిధులు రూ.95 లక్షలతో నాడు-నేడు రెండవ విడతలో 8 అదనపు తరగతి గదులు మంజూరయ్యాయి. అయితే స్థానిక హైస్కూల్‌లో అదనపు తరగతి గదుల నిర్మాణానికి స్థలం లేకపోవడంతో హైస్కూల్‌ను ఆనుకొని ఉన్న ఎంపీపీ స్కూల్‌లో అదనపు తరగతి గదులు నిర్మించాలని నిర్ణయించారు. దీంతో ఎంపీపీ స్కూల్ ఆవరణలో అదనపు తరగతి గదులు నిర్మాణానికి మెటీరియల్ తోలుకునేందుకు ఎంపీపీ స్కూల్ ప్రహరీ గోడ కొంతభాగం తొలగించి దారి ఏర్పాటు చేశారు. అనంతరం నిధులు రాకపోవడంతో అదనపు తరగతి గదులు నిర్మాణ పనులు పిల్లర్ల దశలోనే నిలిచిపోయాయి. అయితే తొలగించిన ప్రహరీని మళ్లీ నిర్మించలేదు. ఈ క్రమంలో ఎంపీపీ స్కూల్‌లోని తరగతి గదులను, టాయ్‌లెట్లను ఆకతాయిలు అపరిశుభ్రత చేస్తున్నారు. అంతేగాకుండా పాఠశాల తరగతి గదుల ఆవరణను బహిర్భూమిగా వినియోగిస్తున్నారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముక్కుపుటాలదిరేలా దుర్వాసన వస్తుందని ఆవేదన చెందుతున్నారు. ఎక్కడ అంటువ్యాధులు ప్రబలుతాయోనని భయాందోళన చెందుతున్నారు. ఎన్నిసార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రహరీ నిర్మించాలని కోరుతున్నారు.



వలేటివారిపాలెం ఎంపీపీ స్కూల్‌లో ప్రహరీ కూలదోసి ఏర్పాటు చేసిన దారి

భళా బాగ్ని!

- ఏకపాత్రాభినయంలో దిట్ట ఆంజనేయరాజు
- పెద్దోడు, జింగిడిగాడుతో గుర్తింపు
- రంగస్థలం నుంచి సినీ రంగంలోకి ప్రవేశం
- ఎందరో ప్రముఖుల నుంచి ప్రశంసలు

ప్రతిభకు పేదరికం అడ్డుకాదని నిరూపించాడు అల్లూరుకు చెందిన బడబాగ్ని ఆంజనేయరాజు. సంకల్పం గట్టిదైతే విజయం వరిస్తుందని నిరూపించారాయన. బడబాగ్ని రంగస్థల నాటకాల నుంచి సినీ రంగ ప్రవేశం వరకు ఆయన ప్రయాణం ఎన్నో మలుపులు తిరిగింది. కుటుంబ బంధాలు, బాధ్యతలు వెనక్కు లాగుతున్నా తన ప్రయత్నం మాత్రం మానలేదు. ఆ ప్రయత్నంతోనే రంగస్థలం నుంచి కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డు వరకు ఎదిగారు ఆంజనేయరాజు.

- అల్లూరు, (ఆంధ్రజ్యోతి)

'బొమ్మా బొరుసు' సీరియల్‌లో...





'సూరిగాడు' సినిమాలో బ్రహ్మానందంతో బడబాగ్ని

బడబాగ్ని ఆంజనేయరాజు నెల్లూరు జిల్లా అల్లూరు గ్రామవాసి. అల్లూరులోని బడబాగ్ని హనుమంతరాజు, రామలక్ష్మమ్మ దంపతుల కుమారుడు ఆంజనేయరాజు. అల్లూరులోనే ఇంటర్ చదువుతున్న రోజుల్లో రామకృష్ణ జూనియర్ కళాశాల వార్షికోత్సవంలో ఏకపాత్రాభినయం ప్రదర్శించి ప్రథమ బహుమతిని సాధించడం ఆయన ప్రగతికి మొదటి మెట్టు. అప్పుడే నిర్ణయించుకున్నాడు వెండితెరపై వెలగాలని. వివాహ అనంతరం కుటుంబ బాంధవ్యాలు, బాధ్యతలను భుజాన వేసుకున్నా నటనపై ఆశలు వదలక తన ప్రయాత్నాన్ని కొనసాగించారు.

● రాష్ట్రవ్యాప్తంగా బహుమతులు

బడబాగ్ని ఆంజనేయరాజు రంగ స్థలంలో ఏకదాటిగా ఏకపాత్రాభినయంతో ప్రేక్షకులను మెప్పించారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఏర్పాటు చేసిన అనేక కళాపరిషత్‌లలో ఆయనది అందెవేసిన చేయిగా నిలిచారు. 1988లో జరిగిన టీడీపీ మహానాడులో అప్పటి ముఖ్యమంత్రి, విశ్వవిఖ్యాత నటసార్వభౌమ ఎన్‌టీ.రామారావు ఎదుట పెద్దోడు పాత్రను ఏకపాత్రాభినయంలో ప్రదర్శించి ప్రథమ బహుమతిని అందుకున్నారు. నెల్లూరు 'జేసీస్' సంస్థలో రాష్ట్రస్థాయిలో జరిగిన పోటీల్లోనూ ప్రథమ బహుమతి సాధించారు. మద్రాస్ ఆంధ్రా క్లబ్‌లో ప్రదర్శించిన ఈయన నటనకు పులకించిపోయిన ప్రఖ్యాత హాస్యనటుడు అల్లు రామలింగయ్య తన నటనా వారసుడిగా ప్రకటించడంతో అప్పుడే బడబాగ్ని విజయానికి తార్కాణంగా నిలిచింది. ప్రతికథానాయకుడిగా పేరొందిన రాజనాల ద్వారా సన్మానాన్ని అందుకున్నారు. ఇటీవల ఒంగోలులో రంగభూమి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన జాతీయస్థాయి ఏకపాత్రాభినయం పోటీల్లో ఎందరో ఉద్దండుల నడుమ ఆయన ప్రదర్శనకు తృతీయ బహుమతి దక్కింది. ఈ విధంగా బడబాగ్ని అంజనేయ రాజు అల్లూరు పెద్దోడు నుంచి అవార్డుల పెద్దోడుగా నటనా రంగంలో విజయాలను సాధించారు.



నెల్లూరు కళాంజలి సంస్థ నుంచి ఘన సత్కారం పొందుతున్న బడబాగ్ని దంపతులు

● ఒంటరిగానే ప్రయాణం

పెద్దోడుగా పేరొందిన ఆంజనేయ రాజు ఎక్కడ ప్రదర్శనలు ఇవ్వాలన్నా, పోటీల్లో పాల్గొనాలన్నా ఒక్కడే వెళ్లేవారు. వ్యయప్రయాసలన్నీ తానే భరించి తన మేకప్ తానే వేసుకొని సమర్థవంతంగా ప్రదర్శించి ఎన్నో విజయాలను కైవసం చేసుకున్నారు.

● నటించిన సినిమాలు, గుర్తింపులు

శ్రీరామచంద్రులు, ఆగ్రహం, చిన్నారి స్నేహం, సూరిగాడు, మొండి మొగుళ్లు-పెంకి పెళ్లాలు, ప్రేమవిజేత తదితర సినిమాలు, అమెరికాలో అందాలరాశి, చిరుజల్లులు, మనసులో మాట, జై సంతోషి మాత, జలతారుదీపాలు, బొమ్మ బొరుసు సీరియళ్లలో ఆయన అనేక పాత్రల్లో నటించారు. 'జింగిడిగాడు' అనే గిరిజన జీవిత అంశాన్ని వివరించే ఈ పాత్రతోపాటు రాజకీయ నాయకులు పేదలను మోసం చేసే చతురతను ఎదుర్కొని వారి స్వార్థాన్ని ఎండగడుతూ ప్రదర్శించే 'పెద్దోడు' ఈ రెండు ఏకపాత్రాభినయాలకు రంగస్థల నాటకాలు రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపును తెచ్చాయి. రంగ స్థల నటుడి నుంచి కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యుడి వరకు ఎదిగారు. మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి సహకారంతో తాను ఇంత దూరం ప్రయాణం సాగించగలిగానని ఆయన చెబుతుంటారు. నెల్లూరు కళాంజలి సంస్థ నిర్వాహకులు సారథ్యంలో ఆంజనేయరాజు దంపతులను మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి సత్కరించారు.

మళ్లీ జన్మంటూ ఉంటే కళాకారుడిగానే పుడతా



చిన్నప్పటి నుంచి నటనపై నాకున్న మక్కువ రంగ స్థలం నుంచి కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యుడి వరకు తీసుకెళ్లింది. నా ప్రయాణంలో చివరి మజిలీకి చేరుకున్నా. నేను సాధించిన ఈ విజయాలన్నీ సంతృప్తినిచ్చాయి. మళ్లీ జన్మంటూ ఉంటే కళాకారుడిగానే పుట్టాలని ఉంది. నా నటనతో ప్రేక్షకులను మెప్పించాలని ఉంది. జింగిడి గాడు, పెద్దోడుగా నాకు వచ్చిన ఈ పేరు ప్రఖ్యాతులు అల్లూరు ప్రజలకు అంకితం.

- బడబాగ్ని ఆంజనేయరాజు, అల్లూరు

PRATIBHA

మద్యం మత్తులో అనైతికంగా..

● జీజీహెచ్‌లో పీజీ వైద్యుడి నిర్వాకం

నెల్లూరు (వైద్యం), మే 6 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో వైద్యులను దేవుడితో సమానంగా చూస్తారు. అయితే నెల్లూరు జీజీహెచ్‌లో పని చేసే ఓ పీజీ వైద్యుడు బాధ్యతలను, సంస్కారాన్ని మరిచి ప్రవర్తించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. ఎంబీబీఎస్ పూర్తి చేసుకుని ఎముకలు, కీళ్ల విభాగంలో స్పెషలిస్ట్ వైద్యం కోర్సు చేసేందుకు నాలుగు నెలల క్రితం ఓ వ్యక్తి పీజీ వైద్యునిగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చేరాడు. అయితే వచ్చిన నెలలోనే ఎంబీబీఎస్ కోర్సు చదువుతున్న విద్యార్థులపై చేయి చేసుకున్నాడు. దీనిపై ఆ విద్యార్థి ఉన్నతాధికారులకు రిపోర్టు చేశాడు. దీంతో ఉన్నతాధికారులు ఆ పీజీ వైద్యుడికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇది జరిగిన రెండో నెలలోనే ఆసుపత్రిలో జరిగే విషయాలను తల్లిదండ్రుల కు చేరవేస్తున్నాడన్న అనుమానంతో ఓ జూనియర్ డాక్టర్‌ను ఓపీ నుంచి బయటకు లాక్కొచ్చాడు. ఈ సంఘటనలతో సదరు పీజీ వైద్యుడిని అధికారులు హాస్టల్ నుంచి బయటకు పంపించారు. కాగా, గత శనివారం మరో సంఘటన చోటుచేసుకుంది. ఆ రోజు పీజీ వైద్యుని డ్యూటీ కాదు. అయినా జీజీహెచ్‌లోని వార్డుకు ఎందుకు వచ్చాడో తెలి యదు. పూటుగా మద్యం సేవించి తూలిపోతు న్నాడు. రోగి అటెండర్‌తో వాగ్వివాదానికి దిగా డు. దీంతో జూనియర్ వైద్యుడు ఆ పీజీ వైద్యు డిని పక్కకు తీసుకెళ్లాడు. ఈ వీడియా ఇన్‌స్టాగ్రామ్‌లో వైరల్‌గా మారింది. ఇలాంటి వారిపై తగిన చర్యలు తీసుకోవాలని రోగులు, ఆసుపత్రి సిబ్బంది కోరుతున్నారు.

హాస్టళ్లలో మరమ్మతులు పూర్తి చేయండి

● కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (హరనాథపురం), మే 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో మరమ్మతు పనులను ఈనెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆనంద్ ఇంజనీరింగ్ అధికా రులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో అధికారులు, వార్డెన్లతో ఆయన సమీక్షిం చారు. జిల్లాలో 64 హాస్టళ్లలో మరమ్మతు పనులు చేపట్టేందుకు ప్రభుత్వం రూ.9.32 కోట్లు మంజూరు చేసిందని చెప్పారు. వేసవి సెలవుల అనంతరం విద్యార్థులందరూ హాస్టళ్లకు తిరిగివచ్చే లోగా ఈ పనులన్నీ పూర్తి కావాలని సూచించారు. హాస్టళ్లలో నూటికి నూరు శాతం సీట్లు భర్తీ అయ్యేలా ఏఎస్‌డబ్ల్యూవోలు, వార్డె న్లు ప్రత్యేక యాక్షన్ ప్లాన్‌తో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ ఏడాది పదో తరగతిలో కొన్ని హాస్ట ళ్ల తక్కువ ఉత్తీర్ణత శాతం సాధించడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫలితాలు తగ్గడానికి గల కారణాలను తెలుసుకున్నారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ శోభారాణి, పంచా యతీరాజ్, ఆర్‌అండ్‌బీ ఇంజనీరింగ్ అధికారులు, జీ రామకృష్ణప్రసాద్, సుబ్బరాజు పాల్గొన్నారు.

మీ హెచ్చరిక... మాకో లెక్కా ?

● యథేచ్ఛగా కలప నరికి అక్రమంగా తరలింపు

దుత్తలూరు(ఉదయగిరి), మే 6(ఆంధ్రజ్యోతి): అధికారుల హెచ్చరిక.. మాకో లెక్కా...? అంటూ అక్రమార్కులు బరితెగిస్తున్నారు. యథేచ్ఛగా ప్రభుత్వ భూముల్లో కలప తరలించి రూ.లక్షలు సొమ్ము చేసుకుంటున్నారు. వివరాల మేరకు.. మండలంలోని భైరవరం పంచాయతీలో ఆరెకరాల ప్రభుత్వ భూమిలో కొందరు అక్రమంగా కలప నరికి రూ.లక్షలు సొమ్ము చేసుకుంటున్నారని సోమవారం గ్రామస్థులు రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు ఆర్ఐ, వీఆర్వో సంఘటనా స్థలానికి వెళ్లి అడ్డుకున్నారు. ప్రభుత్వ భూమిలో కలప నరికి తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అయితే అక్రమార్జనకు అలవాటుపడ్డ అక్రమారులు వారి హెచ్చరికలను భేఖాతరు చేస్తూ మంగళవారం కూడా యథేచ్ఛగా కలప నరికి వాహనాల్లో తరలించారు. అయితే అక్రమంగా కలప నరికివేతలో అధికారులు అక్రమార్కులకే వంతపాడుతున్నారని, వారి అక్రమార్జనలో వారికి వాటాలున్నాయని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై తహసీల్దారు నాగరాజును వివరణ కోరగా కలప నరికివేస్తున్నారని మంగళవారం సైతం తన దృష్టికి రావడంతో సిబ్బంది పంపి అక్రమార్కులను గట్టిగా హెచ్చరించామన్నారు. సిబ్బందిని అక్కడే కాపలాగా ఉంచామన్నారు. మరోసారి ఇలానే చేస్తే కేసులు నమోదు చేస్తామని ఆయన వివరించారు.

మమ్మల్ని రాజకీయాల్లోకి లాగకండి!

● వెంకటగిరి రాజాస్ కుటుంబీకుల కంపెనీ

నెల్లూరు, మే 6 (ఆంధ్రజ్యోతి) : తమ కంపెనీకి క్వార్ట్జ్ తవ్వకాలకు అనుమతులు రాకుండా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అడ్డుకుంటున్నారని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని వెంకటగిరి రాజాస్ కుటుంబీకులు ప్రకటించారు. జగన్ పత్రికలో వస్తున్న కథనాలు అవాస్తవమంటూ వెంకటగిరి రాజా కుటుంబీలకు చెందిన శ్రీకల్యాణరామ కంపెనీ పేరిట మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మైనింగ్ శాఖలో కొందరు చేస్తున్న తప్పులతో తమ కంపెనీకి అనుమతులు రాలేదని, ఈ సమస్యను పరిష్కరించుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. అంతేతప్ప వేమిరెడ్డి తమను ఇబ్బంది పెడుతున్నారంటూ చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. తమను రాజకీయాల్లోకి తీసుకురావద్దంటూ విజ్ఞప్తి చేశారు. 2021లో తమ కంపెనీ రెన్యువల్ అనుమతులు పొందడంలో అప్పట్లో ఎంపీగా ఉన్న వేమిరెడ్డి సహకరించారని ఆ ప్రకటనలో గుర్తు చేశారు.

నగరంలో ఉదయగిరి వాసి హత్య!

- ఇంట్లోకి దూరి కత్తులతో ముఖంపై నరికి..
- సుఫారీ హత్యా.. ఇతర కారణాలా..!?
- పలు కోణాల్లో పోలీసుల దర్యాప్తు

నెల్లూరు(క్రైం), మే 6 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని వేదాయపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి దారుణ హత్య జరిగింది. ఉదయగిరి మండలం సర్వరబాదు గ్రామానికి చెందిన చిన్నయ్య ఉరాఫ్ చిన్నా (40)ను గుర్తుతెలియని వ్యక్తులు నగరంలోని వెంకటరెడ్డినగర్‌లో ఇంట్లో నిద్రిస్తుండగా ఈనెల 5వ తేది రాత్రి కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు.

ఉదయగిరి మండలం సర్వరాబాదు గ్రామం ఎస్సీ కాలనీలోని గొల్లపల్లి ఓబయ్య, లక్ష్మమ్మలకు నలుగురు కుమారులు. పెద్ద కుమారుడు గొల్లపల్లి చిన్నయ్య అలియాస్ చిన్నా (40), వెంగణిలు దంపతులు. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. వివాహం అనంతరం చిన్నయ్య ఉదయగిరి మండలంలోని గొల్లపాలెంలో కాపురం పెట్టారు. సీతారామపురం మండలం బసినేనిపల్లి పశు వైద్యశాలలో కాంట్రాక్టు పద్ధతిన అటెండర్‌గా పని చేస్తున్నాడు. అధికారులు పిలిచినప్పుడు మాత్రమే ఈయన విధులకు హాజరవుతూ ఉంటాడు. అయితే, పదేళ్ల క్రితం నెల్లూరులోని వెంకటరెడ్డి నగర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. అదే ఇంట్లో మొదటి అంతస్తులో రెండు గదులను అద్దెకు తీసుకొని ఫైనాన్స్, రియల్‌ఎస్టేట్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. శని, ఆది వారాల్లో భార్య, పిల్లల వద్దకు వెళ్లి తిరిగి సోమవారం నగరానికి చేరుకుంటాడు. ఈ క్రమంలో 5వ తేదీ సోమవారం రాత్రి చిన్నయ్య తన ఇంటిలోని హాలులో పడుకోగా, స్నేహితుడు వెంకటేశ్వర్లు బెడ్‌రూమ్‌లో నిద్రించారు. ఏం జరిగిందో ఏమో గానీ సోమవారం ఉదయం వెంకటేశ్వర్లు నిద్రలేచి చూసే సరికి హాల్‌లో చిన్నయ్య రక్తపు మడుగులో మృతి చెంది ఉండటాన్ని గుర్తించాడు. వెంటనే స్థానికుల సహాయంతో వేదాయపాలెం పోలీసులకు సమాచారం అందించారు.



రోదిస్తున్న మృతుడి బంధువులు

● డాగ్‌స్క్వాడ్ పరిశీలన

హత్య జరిగిన ప్రాంతానికి డాగ్ స్క్వాడ్ చేరుకుంది. మృతదేహం వద్ద నుంచి డాగ్ గాంధీనగర్ వైపుగా కొద్ది దూరం పరుగులు తీసి తిరిగి వచ్చేసింది. ఫింగర్ ప్రింట్ టీమ్ వేలిముద్రలను సేకరించింది. నగర డీఎస్పీ సింధు ప్రియ, వేదాయపాలెం ఇన్‌చార్జ్ సీఐ రోశయ్యలు సంఘట స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. మృతుడి తమ్ముడు రాజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న మృతుడి తండ్రి ఓబయ్యతోపాటు బంధువులు వెంటనే నగరానికి చేరుకుని కన్నీరు మున్నీరయ్యారు. హత్య విషయం తెలుసుకున్న స్థానికులు భారీగా సంఘటన స్థలానికి చేరుకున్నారు.

● చిన్నయ్యకు పలువురితో విభేదాలు

మృతుడు చిన్నయ్య సొంతూరు సర్వరాబాదుతోపాటు ఉదయగిరిలోనూ పలువురితో విభేదాలు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా ఆర్థిక లావాదేవీలు, భూవివాదాలు ఉన్నట్లు సమాచారం. అంతేగాక పలువురుపై పోలీసులకు ఫిర్యాదులు చేసి వారిని జైలుకు పంపారని తెలుస్తోంది. ఈ కారణా ల నేపథ్యంలోనే సుపారీ ఇచ్చి ఎవరైనా హత్య చేయించి ఉంటారని కుటుంబసభ్యులు చర్చించుకుంటున్నారు. సోమవారం కొందరు వ్యక్తులు రియల్ ఎస్టేట్ గురించి చిన్నయ్యతో చాలా సేపు మాట్లాడి వెళ్లినట్లు సమాచారం. ఈ క్రమంలోనే రాత్రి 11.40 గంటల ప్రాంతంలో కొందరు వ్యక్తులు అదే వీధిలో గాంధీనగర్ వైపు పరుగులు తీయ డం చూశామని కొందరు చర్చించుకుంటున్నారు. పలు కోణాల్లో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

● ఏం జరిగి ఉంటుందో!

హత్య జరిగిన రోజు రాత్రి చిన్నయ్యతోపాటు ఆయన స్నేహితుడు వెంకటేశ్వర్లు అదే ఇంట్లో ఉన్నారు. మంగళవారం ఉదయం చిన్నయ్య మృతి చెంది ఉండటాన్ని గమనించి పరుగున కింద ఫ్లోర్‌లో ఉన్న ఇంటి యజమాని మధుకు చిన్నయ్య మృతి చెంది ఉండటాన్ని చెప్పాడు. వెంకటేశ్వర్లు లుంగీ, బనియన్ ధరించి ఉండటంతో ఇంట్లో మీరు కూడా ఉన్నారు కదా!? అని ప్రశ్నించగా, తాను బెడ్‌రూంలో గాఢ నిద్రలో ఉన్నానని, ఉదయం లేచి చూసేసరికి చిన్నయ్య మృతి చెంది ఉన్నాడని చెప్పుకొచ్చాడు. హత్య జరిగిన ఇంటికి సమీపంలోనే వేదాయపాలెం పోలీసు స్టేషన్ ఉండటంతో కింద ఇంట్లో నివాసం ఉంటున్న వారు స్టేషన్‌కు వెళ్లి పోలీసులకు సమాచారం అందించారు.



హత్య జరిగిన ఇంటి ముందు గుమికూడిన జనం



మృతుడు చిన్నయ్య (ఫైల్)

నగరవాసుల్లో భయం.. భయం

ప్రశాంతతకు మారు పేరు అయిన నెల్లూరు నగరం హత్యలకు అడ్డాగా మారిపోయింది. రోజుల వ్యవధిలో జరుగుతున్న హత్యలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. గత నెలలో ఒకేరోజు గంట వ్యవధిలో జరిగిన రెండు హత్యల గురించి నగరవాసులు మరువకముందే వేదాయపాలెం స్టేషన్ పరిధిలోని బుజబుజనెల్లూరు ప్రాంతంలో ఈ నెల 3వ తేదీన నడిరోడ్డుపై ఓ మహిళపై హత్యాయత్నం జరిగింది. చివరకు ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది. తాజాగా ఈ నెల 5వ తేదీ అర్ధరాత్రి అదే స్టేషన్ పరిధిలో వెంకటరెడ్డినగర్ నాల్గవ వీధిలో దుండగులు ఇంట్లోకి ప్రవేశించి ఓ వ్యక్తిని కత్తులతో విచక్షణ రహితంగా దాడి చేసి హత్య చేశారు. ఇలా నగరంలో రోజుల వ్యవధిలో వరుసగా జరుగుతన్న హత్యలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. జరుగుతున్న ఘాతుకాలపై సాక్షాత్తు డీజీపీ సీరియస్ అయినా జిల్లా యంత్రాంగంలో మాత్రం చలనం ఉండటం లేదు. మొక్కుబడిగా నాలుగు రోజులపాటు తనిఖీలపేరుతో హడావుడి చేసి వదిలేశారు. హత్య చేసిన నిందితులు గాంధీపురం వైపు పరుగులు తీశారు. ఆ సమయంలో పోలీసులు గస్తీ నిర్వహించి ఉండిఉంటే నిందితులు గుర్తించే అవకాశం ఉండేది.

కుటుంబం కోసం బతకండి

● పోలీసుల వీడ్కోలు సభలో ఎస్పీ కృష్ణకాంత్




ఉద్యోగ విరమణ పొందిన పోలీసులతో ఎస్పీ కృష్ణకాంత్, ఏఎస్పీ సౌజన్య తదితరులు

నెల్లూరు(క్రైం), మే 6 (ఆంధ్రజ్యోతి) : సమాజం కోసం దీర్ఘకాలంగా పోలీసులుగా సేవలందించారు, ఇక నుంచి జీవిత భాగాస్వామి, కుటుంబం కోసం సమయం కేటాయించాలని ఎస్పీ జీ కృష్ణకాంత్ సూచించారు. ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులు, సిబ్బందికి మంగళ వారం ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో ఆత్మీయ వీడ్కోలు సభ జరిగింది. ఎస్ఐ కే వెంకటాద్రి నాయుడు, ఏఎస్ఐ ఎస్‌కే ఖాదర్ వల్లి, హెచ్‌సీ టీ భాస్కర్, ఉమెన్ హెచ్‌సీ టీ దేవసేన, ఏఆర్ ఎస్ఐ ఎం శంకరయ్య, ఏఎస్ఐ వై వెంకటే శ్వర్లు, హెచ్‌సీ కే ప్రసాద్‌ను ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీసు యూనిఫామ్‌తో సర్వీస్ చేయడం గర్వకారణమన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను పొదుపుగా వాడుకోవాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఎటువంటి అవసరమైనా తనను సంప్రదిం చవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, ఏవో చంద్రమౌళి, ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్, వెల్ఫేర్ ఆర్ఐ రాజారావు, హోంగార్డ్ ఆర్ఐ పాల్‌రాజ్, పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాద్, మాజీ అధ్యక్షుడు శ్రీహరి, పోలీసుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సంగం బ్యారేజీలో ఆగమేఘాలపై గేట్ల నిర్వహణ

సంగం, మే 6 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లుగా బ్యారేజీ నిర్వహణను మరిచిన అధికారులు మంగళవారం ఆగమేఘాలపై నీటిమట్టం తగ్గించి, నిర్వహణ పనులు చేపట్టారు. 2022 మేలో సంగం బ్యారేజీ పనులు పూర్తి కాకుండానే వైసీపీ ప్రభుత్వం ప్రారంభించింది. అప్పటి నుంచి బ్యారేజీలో నీటిని నిల్వ చేసి, వివిధ కాలువలకు సరఫరా చేస్తున్నారు. ప్రతి ఏటా వరికోతలు పూర్తయ్యాక వేసవిలో గేట్ల నిర్వహణ చేయాల్సి ఉంది. కానీ వైసీపీ ప్రభుత్వంలో రెండేళ్లు ఎలాంటి నిర్వహణ పనులు చేపట్టలేదు. ఇటీవలే ఖరీఫ్ సీజన్ పూర్తయింది. బుధవారం నుంచి రబీకి నీటిని విడుదల చేయనున్నారు. ఈ క్రమంలో ఆగమేఘాలపై బ్యారేజీ వద్ద నిల్వ చేసిన నీటిని ఇటు నెల్లూరు, అటు కనిగిరి రిజర్వాయర్ కాలువకు విడుదల చేశారు. నీటిమట్టాన్ని పూర్తిగా తగ్గించారు. ఈ నేపథ్యంలో గేట్ల నిర్వహణ పనులకు చేస్తున్నారు. ప్రస్తుతం గేట్ల రోప్‌లకు గ్రీస్ పెడుతున్నారు. మొత్తం 85 గేట్ల రోప్‌లకు గ్రీస్ పెట్టి గేట్ల నిర్వహణ ఎలా ఉన్నా యో..? సరిచూడాల్సిన అవసరం ఉంది. ఇకపోతే రెండు రోజుల్లో నిర్వహణ పనులు ఎలా పూర్తతాయో వేచి చూడాల్సిందే. అంతా మొక్కుబడి నిర్వహణేనని పలువురు రైతులు పెదవి ఇరుస్తున్నారు.



బ్యారేజీ గేట్ల రోప్‌లకు గ్రీస్ వేస్తున్న కూలీ

నేడు సోమశిలకు ఆనం రాక

అనంతసాగరం : సోమశిల ప్రాజెక్టును బుధవారం మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సందర్శించనున్నారు. ఐఏబీలో తీసుకున్న నిర్ణయం మేరకు డెల్టా, నాన్‌డెల్టాలో రెండో పంటకు నీరు విడుదల చేస్తారని మంత్రి కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

మైనార్టీస్ కార్పొరేషన్ ఈడీ హైఫా

నెల్లూరు (హరనాథపురం), మే 6 (ఆంధ్రజ్యోతి) : ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా 2025 - 26 సంవత్సరానికి మైనార్టీ లబ్ధిదారులకు స్వయం ఉపాధి కోసం రుణాలు మంజూరు చేస్తామని జిల్లా మైనార్టీ కార్పొరేషన్ ఈడీ షేక్ హైఫా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముస్లింలు, బౌద్ధులు, జైనులు, సిక్కులు, పార్సీలు తదితర మైనార్టీలు బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు పొందేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. జిల్లాకు 1449 మంది లబ్ధిదారులకుగాను రూ.11.15కోట్ల సబ్సిడీతో రూ.22.31కోట్ల రుణ లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించిందని తెలిపారు. స్లాబ్-1 కింద యూనిట్ విలువ రూ.లక్ష అని, దీని కింద 1098 మందికి కేటాయింపులు ఉంటాయని తెలిపారు. స్లాబ్-2లో యూనిట్ విలువ రూ.లక్ష నుంచి రూ.3లక్షల వరకు ఉంటుందని, దీని కింద 23 మంది లబ్ధిదారులకు కేటాయింపులు ఉంటాయన్నారు. స్లాబ్-3లో యూనిట్ విలువ రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వరకు ఉంటుందన్నారు. ఈ స్లాబ్ కింద 112 మంది లబ్ధిదారులు ఉంటారని తెలిపారు. స్లాబ్-4లో యూనిట్ విలువ రూ.8లక్షలని, దీని కింద 16 మందికి కేటాయింపులు ఉంటాయని పేర్కొన్నారు. ఈ నాలుగు స్లాబుల్లోనూ 50 శాతం సబ్సిడీ లభిస్తుందని తెలిపారు. 21-55 సంవత్సరాలలోపు వయసు కలిగిన మైనార్టీ అభ్యర్థులు apobmms.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నాన్‌బెయిలబుల్ కేసు పెట్టినట్లు పోలీసులు చెప్పలేదు

● మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి

కావలిటౌన్, (ఆంధ్రజ్యోతి) : తనపై నాన్ బెయిలబుల్ కేసు పెట్టినట్లు పోలీసులు సమాచారం ఇవ్వలేదని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ముసునూరులోని క్యాంప్ కార్యాలయంలో వైసీపీ నేతలు ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చరవాణి ద్వారా మాట్లాడారు. ఎప్పుడో మూసేసిన ఫైలాన్ కూల్చివేత కేసును రీ ఓపెన్ చేసి సంబంధంలేని తనతోపాటు కొందరు వైసీపీ నేతలు పాత్రికేయులపై నాన్ బెయిల్ కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు. మీడియా ద్వారా కేసు విషయం తెలుసుకున్నానని డీఎస్పీ గాని ఎస్పీ గాని పిలిస్తే తప్పకుండా వస్తానన్నారు. కేసులకు భయపడనని చట్టంపై నమ్మకం గౌరవం ఉందని న్యాయపోరాటం చేస్తామన్నారు. సమావేశంలో వైసీపీ నేతలు గంధం ప్రసన్న, పందిటి కామరాజు, మద్దిబోయిన రఘు, నెల్లూరు వెంకటేశ్వరరెడ్డి, కనమర్లపూడి నారాయణ, కుందుర్తి కామయ్య, గుడ్లూరు మాల్యాద్రి, కొమారి రాజు, జీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.